శుక్రవారం
21-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 179
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

ఇజ్రాయిల్ దాడులు 100 మంది మృతి

జెరూసలేం: గాజాలో ఇజ్రాయిల్ భూతల, వైమానిక దళాలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం జరిపిన వైమానిక దాడుల్లో 100 మంది పలస్తీనియన్లు మృతి చెందారు. మృతుల్లో చిన్నారులు, మహిళలు ఎక్కువగా ఉన్నారు. ఉత్తర, దక్షిణ భూభాగాల్లో తెల్లవారుజామున ఇజ్రాయిల్ భీకర దాడులు జరిపినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ మంగళవారం నుంచి ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో ఇప్పటివరకు 200 మంది పిల్లలతో సహా 710 మంది చనిపోయారని, 900 మందికిపైగా గాయపడ్డారని పేర్కొంది. దురాక్రమణ

- మిగతా 2 లో

కీచక ప్రొఫెసర్ అరెస్టు

లక్నో: విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న కీచక ప్రొఫెసర్ రజనీశ్ కుమార్ (50) పోలీసులకు చిక్కాడు. తన బాగోతం బయట పడటంతో పరారీలో ఉన్న రజనీశ్‌ను ఉత్తరప్రదేశ్, పోలీసులు గురువారం ప్రయాగ్‌రాజ్ అరెస్టు చేశారు. విద్యార్థినులను లోబర్చుకోవడం, వీడియోలు తీయడం, వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేయడాన్ని రజనీశ్ అలవాటుగా మార్చుకున్నాడని హత్రాస్ ఎస్పీ వెల్లడించారు. హత్రాస్‌లోని సేథ్‌ఫూల్ చంద్ బాగ్లా పీజీ కళాశాలలో చీఫ్ ప్రొక్టర్‌గా ఇతను పనిచేస్తున్నట్లు చెప్పారు. అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన రజనీశ్‌ను

- మిగతా 2 లో

రికార్డు సృష్టించిన ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్

న్యూఢిల్లీ: ప్రముఖ భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ గీసిన ఓ పెయింటింగ్ అరుదైన రికార్డు సృష్టించింది. ప్రముఖ వేలం సంస్థ క్రిస్టీ న్యూయార్క్‌లో తాజాగా నిర్వహించిన వేలంలో హుస్సేన్ గీసిన 'అన్‌టైటిల్డ్ (గ్రామ్ యాత్ర)' కళాఖండం 13.8 మిలియన్ డాలర్ల (రూ.118 కోట్లు)కు అమ్ముడు పోయింది. దీంతో ఆధునిక భారత చరిత్రలో అత్యంత ఖరీదైన కళాకృతిగా ఇది రికార్డు సృష్టించింది. ప్రముఖ ఆర్టిస్ట్ అమృతా షెర్గిల్ 1937లో గీసిన 'ది స్టోరీ టెల్లర్' పెయింటింగ్‌ను 2023లో వేలం వేయగా రూ.61.8 కోట్ల ధర పలికింది. అత్యంత

- మిగతా 2 లో

రైతులపై ఉక్కుపాదం

- సరిహద్దుల్లో శిబిరాల తొలగింపు- అరెస్టులు
- దేశవ్యాప్త ఆందోళనలకు అన్నదాతల పిలుపు
- పంజాబ్‌లో నిరసనలు
- హర్యానా సీఎం ఇంటి వరకు మార్చ్

న్యూఢిల్లీ/చండీగఢ్: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద దీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్న రైతులపై పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. సరిహద్దు శిబిరాల నుంచి రైతులను బలవంతంగా తొలగించింది. గుడారాలు కూల్చివేసింది. రోడ్డు మొత్తం ఖాళీ చేయించి వాహనాల రాకపోకలకు అనుమతిచ్చింది. సీనియర్ రైతు నాయకులు జగ్జీత్ సింగ్ దలేవాల్, సర్వన్ సింగ్ పంథేర్ సహా దాదాపు 200 మందిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో దేశవ్యాప్త ఆందోళనకు సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) పిలుపునిచ్చాయి. కేంద్రంతో జట్టు కట్టిన పంజాబ్ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేసిందని కిసాన్

- మిగతా 2 లో

బ్రిటన్ పార్లమెంట్‌లో మెగాస్టార్‌కు ఘన సత్కారం

- జీవిత సాఫల్య పురస్కారం అందించిన 'టీమ్ బ్రిడ్జ్ ఇండియా'
- ఈ గౌరవంతో హృదయం నిండిపోయింది: చిరంజీవి

టాలీవుడ్ సీనియర్ హీరో మెగాస్టార్ చిరంజీవిని బ్రిటన్ పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఘనంగా సత్కరించారు. నాలుగున్నర దశాబ్దాలుగా సినీ రంగానికి, సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా లండన్‌కు చెందిన బ్రిడ్జ్ ఇండియా ఆయనకు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని (లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్) అందించింది.

2లో

చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్లు

నెత్తురోడిన దండకారణ్యం

30 మంది మావోయిస్టుల మృతి
పెద్దమొత్తంలో ఆయుధాల స్వాధీనం

విశాలాంధ్ర-చింతూరు: దండకారణ్యం మరోసారి నెత్తురోడింది. మావోయిస్టులకు దెబ్బమీద దెబ్బ తగిలింది. కేంద్రప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా చత్తీస్‌గఢ్‌లో 30 మంది మావోయిస్టులను భద్రతా దళాలు కాల్చిచంపాయి. చత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం కాల్పులతో దద్దరిల్లుతోంది. గురువారం ఒకేరోజు బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎదురుకాల్పుల్లో ఓ జవాను కూడా అమరుడైనట్లు అధికారులు వెల్లడించారు. బీజాపూర్ - దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అంద్రి అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు నిఘా సమాచారం వచ్చింది. దీంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ సంయుక్త బలగాలు గురువారం ఉదయం నుంచి అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతంలో 26 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఘటనాస్థలంలో పెద్దఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ ఎదురుకాల్పుల్లో జవాను పొడియామి రాజు(35) ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇదే సమయంలో కాంకేర్ జిల్లాలోనూ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఇక్కడ డీఆర్‌జీ, బీఎస్‌ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. రెండు జిల్లాల్లోనూ యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ కొనసాగుతోంది. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు సంఘటనల్లోనూ మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనను బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్, బస్తర్ ఐజీ సుందర్ రాజ్ పట్టా ధ్రువీకరించారు. కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు, విస్తృత గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు 90 మంది మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతి చెందారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సాయి, డిప్యూటీ సీఎం శర్మ భద్రతా దళాలను ప్రశంసించారు. మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాన్ని మోదీ సర్కారు కొనసాగిస్తోంది. మావోయిస్టులను అంతమొందించే చర్యల్లో భాగంగా ఆదివాసీలను సైతం ఎన్‌కౌంటర్ పేరుతో కేంద్రం హతమారుస్తోంది. ప్రజాస్వామ్యవాదుల నుంచి నిరసనలు ఎదురవుతున్నా కేంద్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

కారుణ్య నియామకాలు వారసత్వ హక్కు

- పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం
- భవన నిర్మాణాల్లో అక్రమాలు అరికట్టేందుకే 'బిల్డ్ నౌ' పోర్టల్
- మిస్ యూనివర్స్ పోటీలు పర్యాటక రంగానికి అద్భుత అవకాశం
- కొలువుల పండుగలో సీఎం రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: కారుణ్య నియామకాలు మీ హక్కు అని, ఇవి మీ కుటుంబ సభ్యుల నుంచి వారసత్వంగా మీకు రావాల్సిన ఉద్యోగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత పాలకులు పదేళ్లుగా నియామకాలను పట్టించుకోలేదని, అలాంటి నిర్లక్ష్యం ప్రజా ప్రభుత్వంలో ఉండకూడదనే ఈ నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. రవీంద్ర భారతిలో గురువారం కొలువుల పండుగ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం... పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగాల్లో వివిధ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు 922 మందికి నియామక పత్రాలు అందజేశారు. అలాగే 'బిల్డ్ నౌ' పోర్టల్ ను ఆవిష్కరించారు. బిల్డ్ నౌ దరఖాస్తుదారులకు అనుమతి పత్రాలు అందజేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ... దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న మీ కల ఇవాళ నిజమైందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే జీవితాలు బాగుపడతాయని నిరుద్యోగ యువత పోరాడిందని, కానీ రాష్ట్రం ఏర్పడినా తెలంగాణ కోసం అమరులైనవారి ఆశయాలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తామే నోటిఫికేషన్లు ఇచ్చామని, కాంగ్రెస్ చేసింది ఏం లేదని కొందరు మాట్లాడుతున్నారని, పదేళ్లు పరీక్షలు నిర్వహించకపోతే నిరుద్యోగుల జీవితాలు ఆగమవడం మీకు కనిపించలేదా అంటూ బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నప్పుడు పేదింటి బిడ్డలకు ఉద్యోగాలు ఇచ్చే ఆలోచన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి కేవలం పది నెలల్లో 57, 924 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన రాష్ట్రం దేశంలో ఎక్కడా లేదన్నారు. గ్రూప్ -1, 2, 3 లలో రెండువేల పైచిలుకు ఉద్యోగాలకు మరి కొన్ని రోజుల్లో నియామక పత్రాలు అందించబోతున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో భవన నిర్మాణ అనుమతుల్లో అక్రమాలు అరికట్టేందుకే బిల్డ్ నౌ పోర్టల్ ను తీసుకొచ్చామని స్పష్టం చేశారు. ఎంతటివారైనా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడమే లక్ష్యమన్నారు. అదే గుడ్ గవర్నెన్స్, ఇది తెలంగాణ మోడల్ అని చెప్పారు. మరికొందరు రేవంత్ రెడ్డికి పట్టు రాలేదని మాట్లాడుతున్నారని అంటే రాజయ్య, ఈటెల వంటి బలహీనవర్గాలను సస్పెండ్ చేస్తేనే పట్టు వచ్చినట్టా అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రికి విజ్ఞత ఉండాలని, మీకు ఆ విజ్ఞత లేకపోవడం వల్లే ఫామ్ హౌస్ నుంచి బయటకు రాలేకపోతున్నారని దుయ్యబట్టారు. మిస్ యూనివర్స్ పోటీలపై కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని కానీ పర్యాటక రంగానికి ఇది ఒక అద్భుతమైన అవకాశమని, వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు తెలంగాణలో ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలను సందర్శించబోతున్నారని వివరించారు. 72 వ మిస్ యూనివర్స్ పోటీలతో ప్రపంచం తెలంగాణ వైపు చూడబోతుందని, భవిష్యత్తు లో రాష్ట్రానికి వందల కోట్ల ఆదాయం రాబోతుందన్నారు. ఫార్ములా ఈ- రేస్ ముసుగులో ప్రభుత్వ సొమ్ము దోచుకున్న మీకు మాకు పోలికా అని మండిపడ్డారు. పట్టింపులేకుండా వ్యవహరించిన విధానం మీది, పట్టుదలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పం మాదని స్పష్టం చేశారు. మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పాల్గొన్నారు.

ఉగాది నుంచి సన్న బియ్యం

నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర -పెనుబల్లి/ ఖమ్మం: ఉగాది పండుగ నుంచి అర్హులైన కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం నాలుగు లక్షల 50 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టి, రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే దిశగా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని పేర్కొన్నారు.

పెనుబల్లి, కల్లూరు మండలాల్లో గురువారం పర్యటించి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి ఇందిరమ్మ గృహ నిర్మాణానికి, సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. పెనుబల్లి మండలం రామచంద్రాపురంలో గృహ నిర్మాణానికి, ఎస్టీపీ (ఎస్.డి.ఎఫ్.) నిధులు రూ.87 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే 57,626 ఉద్యోగాల భర్తీ చేశామన్నారు . మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.5,450 కోట్లు ఖర్చు చేశామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఆరోగ్య శ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంచామన్నారు. రూ.21వేల కోట్లు రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా రూ.50 వేల నుంచి రూ.నాలుగు లక్షల వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదు వేల మందికి తగ్గకుండా రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. అటవీ భూముల వివాదాలను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఒక్కటి గుర్తుపెట్టుకోండి! మీరేం సలహాలు ఇవ్వాలన్నా నా సలహా అడగండి!

పల్లెల అభివృద్ధికి పెద్దపీట

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: సీతక్క

విశాలాంధ్ర- మహబూబాబాద్ బ్యూరో: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బయ్యారం మండల పరిధిలో లక్ష్మీనరసింహపురం, కోడిపుంజుల తండా, మొట్ల తిమ్మాపురం, కోటగడ్డ, కొత్తగూడెం మండలం గాంధీనగర్ గ్రామాలలో అంతర్గత రోడ్లు, బ్రిడ్జిలు, పాఠశాలల్లో అభివృద్ధి పనులను గురువారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌లతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తుందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామన్నారు. బీసీలకు దామాషా ప్రకారం ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. లక్ష్మీనరసింహాపురంలో రూ.మూడు కోట్లతో, కోడిపుంజుల తండాలో రూ.కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు, మొట్ల తిమ్మాపురంలో రూ. రెండు కోట్లతో వంతెన నిర్మాణం, కోటగడ్డ లో రూ.4.72 లక్షలతో రోడ్ల విస్తరణ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసినట్టు వివరించారు. గిరిజన గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, విద్య, వైద్యం, ఆరోగ్యం, మహిళా సాధికారత

- మిగతా 2 లో

'మిస్ వరల్డ్' ఆతిథ్యం గర్వకారణం

- సంస్కృతిని పరిచయం చేసే సువర్ణావకాశం
- రాజకీయ కోణంలో చూడటం సరికాదు
- ప్రీ ఈవెంట్‌లో మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రపంచ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని, ఫ్యూచర్ సిటీగా ఎదుగుతున్న విశ్వనగరం హైదరాబాద్... ఈ ఈవెంట్ కు వేదికగా నిలవడం ఆనందంగా ఉందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బేగంపేట్ టూరిజం ప్లాజాలో గురువారం మిస్ వరల్డ్ పోటీల ప్రీ ఈవెంట్ మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రితో పాటు టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, టూరిజం కార్యదర్శి స్మితా సబర్వాల్, మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ. జూలియా మోర్లీ, 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ హాజరయ్యారు. తొలుత అతిథులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విగ్నేశ్వర పూజ చేసి, వేదాశీర్వచనం చేశారు. తొలుత పేరిణి

- మిగతా 2 లో



త్రిపురలో 35 ఏళ్ల వామపక్ష పాలన

త్రిపురలో వామపక్ష ఫ్రంట్ 1978 నుంచి 1988 మధ్య, 1993 నుంచి 2018 వరకు రెండు విడతలుగా మూడున్నర దశాబ్దాలు అధికారంలో కొనసాగింది. త్రిపురలో వామపక్ష ఫ్రంట్ అంటే సీపీఐ(ఎం), సీపీఐ, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్. 2018లో వామపక్ష ఫ్రంట్ త్రిపురలో బీజేపీ చేతిలో ఓడిపోయింది. అంత మాత్రం చేత వామపక్ష ఫ్రంట్‌కు ఇక భవిష్యత్తే లేదని చెప్పడానికి వీలు లేదు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ఇజ్రాయిల్ మారణహోమం ఆపాలి

ఇరాక్ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్

గాజాకు సంపూర్ణ సంఘీభావం

కాబూల్: గాజాలో పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ మారణహోమం తక్షణమే ఆపాలని ఇరాకీ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ రెచ్చిపోతోందని, అర్ధరాత్రి భూతల, వైమానిక దాడులతో విరుచుకుపడిందని, 400 మందికిపైగా అమాయక పౌరుల ప్రాణాలు హరించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. మృతుల్లో పిల్లలు, మహిళలే ఎక్కువగా ఉన్నారని, కుటుంబాలకు కుటుంబాలే ఈ దాడుల్లో అంతమయ్యాయని తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం కేసింది. యుద్ధ నేరస్తుడు నెతన్యాహు, అతని ఫాసిస్టు ప్రభుత్వ అధ్వర్యంలో ఈ మారణహోమం సాగిందని ఓ కమ్యూనిస్టు పార్టీ దుయ్యబట్టింది. రాజీ ఒప్పందానికి తూట్లు పొడిచి జియోనిస్ట్ యుద్ధానికి శాశ్వతంగా ముగింపు పలికేందుకు అవకాశాలు లేకుండా చేయడమే ఇజ్రాయిల్‌లోని నెతన్యాహు ప్రభుత్వ లక్ష్యమని ఆక్షేపించింది. ఇజ్రాయిల్ దురాక్రమణ మొదలైనప్పటి నుంచి దాదాపు 50వేల మందికిపైగా పలస్తీనియన్లను చనిపోయారని గుర్తుచేసింది. కాల్పుల విరమణకు ఒప్పందం జరిగినప్పటికీ దానిని ఉల్లంఘించే విధంగా ఇజ్రాయిల్ మళ్లీ భీకర దాడులకు పాల్పడుతోందని, గాజా ప్రజలను బలవంతంగా తరిమివేయాలని చూస్తోందని ఇరాకీ కమ్యూనిస్టు పార్టీ వ్యాఖ్యానించింది. అరబ్ దేశాలు తక్షణమే జోక్యం చేసుకొని ఇజ్రాయిల్ మారణహోమానికి చెక్ పెట్టాలని, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి స్థాయిలో ఈ సమస్యను పరిష్కరించాలని, తాజా అరబ్ సదస్సులో జరిగిన నిర్ణయాల అమలునకు కట్టుబడాలని పిలుపునిచ్చింది. పలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ప్రపంచ వ్యాప్తంగా అన్ని రూపాల్లో ఉద్యమాలు తీవ్రతరం చేయాలని, అక్రమ ఆంక్షలు ఎత్తివేయాలని, గాజాపై యుద్ధ నేరగాళ్లు విధించిన 'పస్తు' ఉంచే విధానాలను రద్దు చేయాలని ఇరాకీ కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. పలస్తీనియన్లకు సాధ్యమైనంత సహాయ సహకారాలు అందించాలని అరబ్ ప్రజలను కోరింది. ఇజ్రాయిల్‌ను బహిష్కరించాలని అరబ్‌కు పిలుపునిచ్చింది. పలస్తీనా ప్రజలకు, గాజాకు సంపూర్ణ మద్దతును ఇరాకీ కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. వారి విజయాన్ని కాంక్షించింది.

విమోచనం వరకు పోరు: పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ

జెరూసలేం: గాజాలో మా ప్రజలపై కొనసాగుతున్న నేరాలను తీవ్రంగా ఖండిస్తున్నాం అంటూ పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటన చేసింది. ప్రజా పోరాటాలు, ప్రతిఘటనల బలోపేతానికి పిలుపునిచ్చింది. ఇజ్రాయిల్ దురాక్రమణను తిప్పికొట్టాలని నొక్కిచెప్పింది. ఇజ్రాయిల్ నేరాల గుట్టు రట్టు చేసేందుకు అంతర్జాతీయ స్థాయి విస్తృత సంఘీభావ ప్రచారోద్యమానికి పిలుపునిచ్చింది. అంతర్జాతీయ న్యాయస్థానాల్లో ఇజ్రాయిల్‌ను దోషిగా నిలబెట్టే విధంగా ఒత్తిడి తేవాలని కోరింది. పలస్తీనా ప్రజలపై, గాజాపై దురాక్రమణ, లిక్విడేషన్ ప్రాజెక్టులు, నకిలీ ఒప్పందాలను ఆక్షేపించాలని పేర్కొంది. పలస్తీనా స్వావలంబన, ప్రజల హక్కుల పరిరక్షణ దిశగా కసరత్తు జరగాలని కోరింది. ఇజ్రాయిల్ నేరపూరిత విధానాలపై కచ్చితమైన వైఖరితో ముందుకెళ్లాలని, ఎటువంటి మద్దతు ఆ దేశానికి లభించకుండా చూడాలని ప్రగతిశీల, ప్రతిఘటన శక్తులకు పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. జియోనిస్ట్ యుద్ధ యంత్రాంగానికి తలొగ్గేది లేదని, ఓటమిని అంగీకరించబోమని తేల్చిచెప్పింది. విమోచనం వరకు పోరు ఆగబోదని పేర్కొంది. వీర ఖైదీల విడుదలకు నినదించింది. దురాక్రమణ, వలసవాద వ్యతిరేక పోరులో పలస్తీనా ప్రజల విజయాన్ని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ ఆకాంక్షించింది.

సంతోషం ఫిన్‌లాండ్ సొంతం

118వ స్థానంలో భారత్

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశంగా ఫిన్లాండ్ నిలిచింది. అంతర్జాతీయ ఆనంద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని వెల్‌బీయింగ్ పరిశోధన కేంద్రం ఈ మేరకు సంతోషకర దేశాల జాబితాను విడుదల చేసింది. వరుసగా ఎనిమిదో సారి ఫిన్లాండ్ నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుంది. ఆ తర్వాత స్థానాల్లో ఎప్పటిలానే డెన్మార్క్ ఐస్‌లాండ్ ఉన్నాయి. స్వీడెన్ (4), నెదర్లాండ్స్ (5), కోస్టారికా (6), నార్వే (7), ఇజ్రాయిల్ (8) లక్సెంబర్గ్ (9), మెక్సికో (10) స్థానాలు నిలిచాయి. టాప్ పది సంతోషకర దేశాలుగా పేరు గాంచాయి. గాజాపై భీకర పోరు సాగిస్తూ ఇజ్రాయిల్ ఈ జాబితాలో నిలవడం గమనార్హం. ఇక భారత్ విషయానికొస్తే గతంలో కంటే కాస్త మెరుగైన స్థానాన్ని ఈసారి దక్కించుకోగలిగింది. 118వ ర్యాంకు సాధించింది. గతేడాది భారత్ 126వ స్థానంలో ఉంది. చైనా 68వ స్థానంలో ఉంటే భారత్ కంటే మెరుగ్గా 109వ స్థానంలో పాకిస్థాన్ 109 ఉంది. అమెరికా 24వ స్థానంలో నిలిచింది. పన్నెండేళ్ల క్రితం 11వ స్థానంలో ఉన్న అమెరికా ర్యాంకు క్రమంగా పడిపోయింది. అఫ్ఘనిస్థాన్ ఈ ఏడాది కూడా జాబితాలో అట్టడుగున నిలిచింది. సంపద, వృద్ధి మాత్రమే కాకుండా సంబంధాలు, మనుషుల మధ్య విశ్వాసం, ఆత్మ సంతృప్తి, సామాజిక మద్దతు, జీవన కాలం, స్వేచ్ఛ, దాతృత్వం, అవినీతి వంటి అంశాల ఆధారంగా ఈ జాబితా రూపొందింది.

ఇస్తాంబుల్ మేయర్ అరెస్టుపై ప్రజాగ్రహం

వీధుల్లోకి వచ్చిన వేలాది మంది: సిటీ సెంటర్ వద్ద భారీ ప్రదర్శన

ఇస్తాంబుల్: ఇస్తాంబుల్ మేయర్ అక్రమ్ ఇమ్మాంగ్లు అరెస్టును టర్కీ ప్రజలు వ్యతిరేకించారు. వేలాది మంది ఇస్తాంబుల్ వీధుల్లోకి వచ్చి తమ నిరసన తెలిపారు. అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగ్‌న్‌కు ప్రత్యర్థిగా ఉన్నందునే మేయర్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వివిధ ప్రధాన మార్గాలను మూసివేశారు. సామాజిక మాధ్యమాలను నిషేధించారు. నాలుగు రోజుల పాటు ప్రదర్శనలు నిర్వహించకుండా ఆంక్షలు విధించారు. కానీ నిషేధాజ్ఞలను ఇస్తాంబుల్ ప్రజలు ధిక్కరించారు. ఇస్తాంబుల్ పోలీసు హెడ్‌క్వార్టర్స్ సిటీ హాల్ వద్దకు కదం తొక్కారు. మేయర్ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అరెస్టు చట్ట విరుద్ధమని, ఆరోపణలు నిరాధారమని నినాదించారు. 'ఇది ప్రజాస్వామ్యం కాదు. పజాస్వామ్యానికి కళంకం' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

తాజా పరిస్థితి కలచివేస్తోందని నిరసనకారులు తెలిపారు. మేయర్‌ను అరెస్టు చేసిన వాటన్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌కు తరలించిన క్రమంలో అటుగా వెళ్లే అన్ని మార్గాలను పోలీసులు దిగ్బంధించారు. అయితే ఓటమి భయంతోనే ఇమ్మాంగ్లును అవినీతి కేసులో ఇరికించారని రిపబ్లికన్ పార్టీ పార్టీ (సీహెచ్‌పీ) నాయకుడు ఓజ్గుర్ ఓజెల్ విమర్శించారు. తిరుగుబాటు చేసేందుకు విఫలయత్నం జరిగిందన్నారు. 'వాళ్లు ఏమైనా చేయగలరు. ఎంతకైనా దిగజారగలరు. ఇది రాజకీయ పోరు కాదు... దేశ మనుగడకు సంబంధించిన పోరాటం అన్నది స్పష్టం' అని అన్నారు. కాగా, కోర్టులు స్వతంత్రంగా పని చేస్తాయని, ఈ విషయంలో తగిన నిర్ణయం తీసుకుంటాయని చెబుతూ తమ ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలను టర్కీ న్యాయ శాఖ మంత్రి యిల్మెజ్ తుంక్ తోసిపుచ్చారు.

రికార్డు సృష్టించిన ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఖరీదైన భారతీయ కళాకృతిగా ఇప్పటివరకు ఇదే కొనసాగగా... తాజాగా ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ దీని కంటే రెట్టింపు ధర పలకడం విశేషం. ఎంఎఫ్ హుస్సేన్ కుంచె నుంచి జాలువారిన 'గ్రామ్ యాత్ర' ఒకే కాన్వాస్‌లో 13 రకాల చిత్రాలతో రూపుదిద్దుకొంది. ఈ అద్భుత కళాఖండం కొత్త రికార్డు సృష్టించడంలో భాగస్వామ్యమైనందుకు సంతోషంగా ఉందని వేలం సంస్థ క్రిస్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఇజ్రాయిల్ దాడులు: 100 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

మొదలైనప్పటి నుంచి 49,617 మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా, 1,12,950 మంది గాయపడ్డారని ఆరోగ్య శాఖ వెల్లడించింది. కాగా, మృతుల సంఖ్య 61,700 దాటిందని, శిథిలాల కింద వేలాది మృతదేహాలు ఉన్నాయని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం తెలిపింది. ఇదిలావుంటే బందీలను అప్పగించకపోతే మరింత తీవ్ర పరిణామాలు తప్పబోవని ఇజ్రాయిల్ హెచ్చరించింది. ఇదే క్రమంలో నెట్జారిమ్ నడవాలో కొంత భాగాన్ని ఇజ్రాయిల్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మరోవైపు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు బెదిరింపులకు పాల్పడుతూనే ఉన్నారు. గాజా స్ట్రిప్‌లో హమాస్ అంతమే లక్ష్యంగా భీకర పోరు సాగిస్తూనే, వెస్ట్ బ్యాంక్‌లో మరింత భయానక రీతిలో దురాక్రమణను, సైనిక చర్యలను చేపడతామని ఆయన తాజా ఒక ప్రకటన చేశారు. అదే క్రమంలో వెస్ట్ బ్యాంక్‌లో 87 భవనాలను ఇజ్రాయిల్ దళాలు నేలమట్టం చేశాయి. కొన్ని వారాలుగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడుతున్న క్రమంలో జెనిన్ శరణార్థి శిబిరం ఖాళీ అయింది. మొత్తం 20వేల మంది బలవంతంగా అక్కడ నుంచి తరలిపోవాల్సి వచ్చింది.

గాజాను ఒంటరి చేయొద్దు: హమాస్

రక్తమోడుతున్న గాజాను ఒంటరిగా వదిలేయొద్దు అని అంతర్జాతీయ సమాజానికి హమాస్ విజ్ఞప్తి చేసింది. 'గాజా రక్తమోడుతోంది. సహాయం కోసం కన్నీళ్లతో వేడుకుంటోంది. ఈ మారణ హోమాలను ఎదుర్కొనేందుకు గాజాను ఒంటరిగా వదిలేయొద్దు' అని పిలుపునిచ్చింది. ఇజ్రాయిల్ దురాక్రమణ, యుద్ధ నేరాలను తక్షణమే ఆపేందుకు అన్ని మార్గాల్లో ఒత్తిడి తేవడం అత్యవసరమని ఒక ప్రకటనలో హమాస్ నొక్కిచెప్పింది.

బ్రిటన్ పార్లమెంట్‌లో మెగాస్టార్‌కు ఘన సత్కారం

న్యూఢిల్లీ: టాలీవుడ్ సీనియర్ హీరో మెగాస్టార్ చిరంజీవిని బ్రిటన్ పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఘనంగా సత్కరించారు. నాలుగున్నర దశాబ్దాలుగా సినీ రంగానికి, సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా లండన్‌కు చెందిన బ్రిడ్జ్ ఇండియా ఆయనకు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని (లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్) అందించింది. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. బ్రిటన్ పార్లమెంటులో తనకు దక్కిన గౌరవంపై తాజాగా చిరంజీవి స్పందించారు. 'యూకే పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో గౌరవనీయులైన పార్లమెంటు సభ్యులు, మంత్రులు, సెక్రటరీలు, దౌత్యవేత్తలు ఇచ్చిన గౌరవానికి నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. టీమ్ బ్రిడ్జ్ ఇండియా అందించిన లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో హృదయపూర్వకంగా సంతోషిస్తున్నాను. మాటలు సరిపోవు. నా ప్రయాణానికి అన్ని విధాలుగా సహకరించిన నా అభిమానులు, రక్త సంబంధీకులు, నా సినిమా ఫ్యామిలీ, శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. నేను చేస్తున్న మానవతావాద కార్యక్రమాలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ గౌరవం నన్ను మరింత శక్తితో పని చేయడానికి ప్రేరేపిస్తుంది" అని చిరంజీవి ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. అలానే చిరంజీవి మరో ట్వీట్ చేస్తూ యూకే పార్లమెంట్‌లో జీవిత సాఫల్య పురస్కారం అందించడానికి కారణమైన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రిటన్ పార్లమెంటులో సత్కారానికి సంబంధించిన ఫోటోలు, అక్కడి ప్రతినిధులతో దిగిన ఫోటోలను కూడా ఎక్స్ లో షేర్ చేసారు. ఇవి ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. చిరుకి దక్కిన ఈ గౌరవానికి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా మరెన్నో అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన చిరంజీవి.. తన స్వయంకృషితో ఇండియన్ సినిమాలో హిస్టరీ క్రియేట్ చేశారు. . నాలుగున్నర దశాబ్దాల తన కెరీర్ లో 156 సినిమాల్లో నటించారు. ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారు. 9 ఫిలింఫేర్ అవార్డులు, 3 నంది అవార్డులతోపాటు రఘుపతి వెంకయ్య పురషారాన్ని సాధించారు. కేంద్ర ప్రభుత్వం 2006లో పద్మభూషణ్, 2024లో దేశంలో రెండో అత్యున్నతమైన పద్మ విభూషణ్ పురష్కారంతో సత్కరించింది. తన డ్యాన్సులతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన చిరు... గతేడాది ఏఎన్ఆర్ నేషనల్ అవార్డ్ అందుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం 'విశ్వంభర' అనే సోషియో ఫాంటసీ సినిమాలో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించాల్సి ఉంది.

కీచక ప్రొఫెసర్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసుల ప్రత్యేక బృందాలు వెతికి పట్టుకున్నాయి. అతని వద్ద నుంచి వేధింపుల వీడియోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే బాధితులు ఎంత మందో లెక్కతేలలేదు. అతను కూడా కచ్చితంగా చెప్పలేకపోయాడని పోలీసులు చెప్పారు. 2009లో ఓ విద్యార్థిని లైంగికంగా వేధించగా... వెబ్ కెమెరాలో ఆ దారుణం రికార్డు అయింది. ఇలా లైంగిక దాడుల చిత్రీకరణ ఆలోచన అప్పటి నుంచే అతనికి వచ్చింది. విద్యార్థినుల నోరు నొక్కేందుకు ఆ వీడియోలతో వారిని బ్లాక్ మెయిల్ చేసేవాడు. పరీక్షల్లో మార్కులు ఎక్కువగా వేస్తాను... ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి లంచాలు తీసుకున్నట్లు రజనీశ్ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అయితే కంప్యూటర్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా లైంగిక కార్యకలాపాలను రజనీశ్ రికార్డు చేసినట్లు హత్రాస్ ఎస్పీ వెల్లడించారు. అతని మొబైల్ నుంచి 65కి పైగా వీడియోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రజనీశ్‌కు 1996లో వివాహం జరిగినా, వైవాహిక జీవితం సరిగ్గా లేదని, అతనికి పిల్లలు కూడా లేరని చెప్పారు. 2001లో బాగ్లా కళాశాలలో భౌగోళిక శాస్త్రం అధ్యాపకుడిగా నియమితుడైన రజనీశ్... గతేడాది చీఫ్ ప్రొక్టర్‌గా పదోన్నతి పొందినట్లు ఎస్పీ వెల్లడించారు.

విద్యారంగంపై ప్రత్యేక దృష్టి: మంత్రి పొన్నం

విశాలాంధ్ర- హైదరాబాద్ : విద్యారంగం ప్రాముఖ్యతను గుర్తించి విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సికింద్రాబాద్ నల్లగుట్ట బలంరాయి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎఫ్ ఎల్ ఎన్, ఏఎక్సెల్ ఏఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్ ,సైన్స్ ల్యాబ్ లను గురువారం కలెక్టర్ తో కలసి పరిశీలించారు. పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని అన్నారు.అనంతరం ఆరవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారిలో ఉన్న ఇంగ్లీష్ ,హిందీ భాషపై ఉన్న పట్టును పరిశీలించి బాగా చదువుకోవాలని సూచించారు. చదివే నైపుణ్యం, రాసే నైపుణ్యం, సమస్యను ఎలా ఎదుర్కోవాలో అన్న దానిపై వారికి అవగాహన కల్పించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. కలెక్టర్ అనుదీప్ దురశెట్టి , డీఈఓ రోహిణి, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మిస్ వరల్డ్' ఆతిథ్యం గర్వకారణం

(మొదటిపేజీ తరువాయి)

నాట్య కళాకారులతో హారతినిచ్చి, తిలకధారణతో పలికిన ఆహ్వానం అందరిని ఆకట్టుకుంది. ఫిలిగ్రి వెండి వస్తువులు, చేర్యాల నఖాషి చిత్రాలను కళాకారులు ప్రదర్శించారు. ప్రసిద్ధిగాంచిన పోచంపల్లి చేనేత పట్టు వస్త్రాలను అక్కడిక్కడే మగ్గంపై నేసి చూపించడం అంతర్జాతీయ మీడియాకు అదనపు ఆకర్శణగా నిలిచింది. తెలంగాణ పర్యాటక శాఖ వెబ్ సైట్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవని, ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యాటక అందాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన నుంచి వచ్చిందని, తెలంగాణ జానపద కళలను తెలియజేయడం, చారిత్రక, వారసత్వ కట్టడాలు, ప్రసిద్ధ దేవాలయాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలను దర్శించేలా చేయడంతో పాటు తెలంగాణ, హైదరాబాద్ రుచులను పరిచయం చేసేందుకు ఇదో అద్భుత అవకాశంగా భావిస్తున్నామని చెప్పారు. ప్రపంచ సుందరి పోటీలను తెలంగాణ సంస్కృతి సొగసులు అద్దేలా, భారతీయ వారసత్వ మూలాలోనే వీటిని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ చరిత్రాత్మకమని, వేలాది ఏళ్ల చరిత్ర ఉందని, మహిళల ఆత్మ సౌందర్యాన్ని ప్రదర్శించడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశమని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని వెల్లడించారు. దక్షిణ కొరియాలో స్క్విడ్ గేమ్, బీటీఎస్ బ్యాండ్ లాంటివి ఆ దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయని, ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు పేరు ప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నామని తెలియజేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచస్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇది మంచి అవకాశమని, రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలి. ప్రభుత్వంపై విమర్శలకు, రాజకీయ కోణంలోనే మిస్ వరల్డ్ పోటీలను చూడటం సరికాదని హితవు పలికారు. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సాధారణంగా ఆతిథ్య రాష్ట్రంతో 50-50 భాగస్వామ్య నమూనాను అనుసరిస్తుందని, ఈ పోటీలకు రూ. 55 కోట్లు అంచనా వ్యయం కాగా రూ. 27 కోట్ల రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందని, మిగిలిన సగం నిధులను నిర్వాహకులు సమకూరుస్తారన్నారు. అయితే ఈ ఈవెంట్ లో స్పాన్సర్స్ ను భాగస్వాములు చేస్తున్నందు వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పడదని, పర్యాటక అభివృద్ధి సంస్థ రూ. 5 కోట్లు మాత్రమే వెచ్చిస్తుందని, మిగితా నిధులు స్పాన్సర్స్ నుంచి సమకూరుతాయని వివరించారు. సుమారు 140 దేశాల వారు ఇక్కడికి వస్తారని ప్రపంచం దృష్టి తెలంగాణ రాష్ట్రంపై పడుతుందని వివరించారు. అందాల పోటీలు ఎంతో మంది అమ్మాయిలకు, మహిళలకు, మనోధైర్యం, సంకల్పం ఇస్తుందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. నమస్తే ఇండియా అంటూ 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పలకరించింది. అతిథులు చాలా గొప్పగా స్వాగతం చెప్పారని అన్నారు. తన ప్రయాణంలో, తన హృదయంలో భారతదేశానికి చాలా ప్రాధాన్యత ఉందని తెలిపారు. భారత కల్చర్, ఆర్ట్స్ చాలా గొప్పగా ఉంటాయని వివరించారు. భారత్ విలువలను బోధిస్తుందని.. భిన్నత్వంలో ఏకత్వానికి ఎంతో గొప్ప భావన ఉందని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని చెప్పారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించడం మంచి అనుభూతిని ఇచ్చిందని, ఈ జర్నీ తనకు ఎప్పటికీ గుర్తుండి పోతుందని క్రిస్టినా పిజ్కోవా పేర్కొన్నారు. తెలంగాణ త్రిలింగ దేశంగా ప్రాముఖ్యతను కలిగి ఉందని పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. ఈ ప్రాంతానికి వేలాది ఏళ్ల చరిత్ర ఉందని ఉద్ఘాటించారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయి స్థంభాల గుడి, గోల్కొండ, కాకతీయ కోటలు, చార్మినార్ లాంటి ఎన్నో గొప్ప కట్టడాలు ఇక్కడ ఉన్నాయని అన్నారు. మేలో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ సంస్కృతి ప్రతిభింబించేలా నిర్వహించనున్నామని చెప్పారు. మెడికల్ టూరిజంలో తెలంగాణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. సినిమా, ఆహార రంగాల్లో తెలంగాణకు పెట్టింది పేరని పేర్కొన్నారు.

ఉగాది నుంచి సన్న బియ్యం

(మొదటిపేజీ తరువాయి)

20 రోజుల్లో పరిష్కరించాలని మంత్రి అధికారులకు సూచించారు. సీతారామ ప్రాజెక్టు కాల్వల కింద తూము నిర్మించి రామచంద్రాపురం, ఎరుగట్ల గ్రామాల చెరువు నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళలు కు వివిధ యూనిట్లు కేటాయించి వారి ద్వారా క్యాంటీన్లు, ఆయిల్ పంపులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కల్లూరు మండలం పెద్దకోరుకొండి లో రూ.95 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, డి.ఎం.ఎఫ్.టి నిధులు 25 లక్షలతో నిర్మించిన లైబ్రరీ, రీడింగ్ హాల్ ను ప్రారంభించారు. యర్రబోయినపల్లి గ్రామంలో సి.ఆర్.ఆర్. నిధులు రూ. కోటి 77.50 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, ఎఫ్ఆర్వో పి. స్నేహాలత, తహసీల్దార్లు జి. ప్రతాప్, సాంబశివుడు, ఎంపీడీవోలు అన్నపూర్ణ, చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులుపాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని వివరించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మిస్తామన్నారు.

యువ వికాసం పథకం కింద నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనారిటీ వర్గాల యువతకు రూ.నాలుగు లక్షల ఆర్థిక చేయూత అందిస్తామన్నారు. మహిళలకు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాలలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ తన నియోజకవర్గంలో రూ.10 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. బయ్యారం పెద్ద చెరువును ఆధునీకరించాలని కోరారు. ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, మూల మధుకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రైతులపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కేఎంఎస్‌సీ) నేత సత్నాం సింగ్ పన్నూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పంజాబ్ సహా అనేక రాష్ట్రాల్లో డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాల వద్ద ధర్నాలకు పిలుపునిచ్చారు. హర్యానాలోని కర్నాల్‌లో ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ ఇంటి వరకు రైతులు కదం తొక్కారు. అఖిలభారత కిసాన్ సభ, భారతీయ కిసాన్ యూనియన్ సంయుక్త అధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. ప్రదర్శనలో అన్నదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత పంజాబ్ గ్రామాల సమీపంలోని రోడ్లను రైతులు దిగ్బంధించారు. నిరసనల్లో పాల్గొనేందుకు మొహాలీ వెళ్లే రైతులను పోలీసులు అడ్డుకున్నారు. కొందరు నేతలను గృహనిర్బంధంలో ఉంచారు. మొహాలీ వద్ద దలేవాల్, పంథేర్‌ను అదుపులోకి తీసుకోగా... ఖనౌరీ వద్ద మరో 200 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు సంగ్రూర్, పటియాలాలో ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు. చండీగఢ్ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతుల్ని పోలీసులు చెదరగొట్టారు. పోలీసుల నిర్బంధంలో ఉన్న రైతులు కొందరు నిరాహార దీక్షకు దిగారు. పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హర్యానా పోలీసులు చర్యలు ప్రారంభించారు. శంభూ-ఖనౌరీ సరిహద్దులు తెరిచేందుకు ఈ చర్యలు చేపట్టినట్టు పంజాబ్ మంత్రి హర్‌పాల్ సింగ్ చీమా తెలిపారు. కేంద్రానికి వ్యతిరేకంగా నిరసనకు దిగిన రైతులు తమ కార్యక్రమాలను దిల్లీలో లేక వేరొక చోట చేపట్టాలి తప్ప రహదారులను మూసేయరాదన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం దిల్లీ వెళ్లేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో సరిహద్దు వద్ద రైతులు నిరసనకు దిగిన విషయం తెలిసిందే.

ఆసుపత్రికి దలేవాల్

రైతు నేత జగ్జీత్ సింగ్ దలేవాల్‌ను జలంధర్‌లోని పిమ్స్ (పంజాబ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)కి తరలించారు. గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆయనను ఆసుపత్రికి తరలించినట్లు పంజాబ్ పోలీసులు తెలిపారు. ఆసుపత్రి వద్ద భారీగా భద్రత ఏర్పాటు చేశారు. గతేడాది ఫిబ్రవరి 13 నుంచి రైతులు ఖనౌరీ, శంభూ సరిహద్దు పాయింట్ల వద్ద నిరసన చేస్తున్న విషయం తెలిసిందే.

విపక్షం మండిపాటు

రైతులను బలవంతంగా తరలించడం, గుడారాలు, శిబిరాలు ధ్వంసం చేయడాన్ని ప్రతిపక్షం ఖండించింది. రైతుల సమస్యలపై పార్లమెంటు ఆవరణలో ఆందోళనకు దిగిన పంజాబ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీలతో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. రైతుల పక్షాన నిలుస్తామని అన్నారు. రైతులపై పోలీసుల చర్యలను వ్యవసాయ రంగంపై దాడిగా కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జీత్ సింగ్ చన్నీ వ్యాఖ్యానించారు. కుట్రలో భాగంగానే రైతులపై దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం, అసంబద్ధంగా ఉందని శిరోమణి అకాలీదళ్ నేత దల్జీత్ సింగ్ చీమా దుయ్యబట్టారు. రైతులను మోసం చేశాయని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించారు. కేంద్ర మంత్రులతో సమావేశం తరువాత ఏం జరిగింది? శిబిరాలు తొలగించాలన్న ఆదేశాలు ఎవరిచ్చారో పంజాబ్ ముఖ్యమంత్రి మాన్ వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్‌డీఏ-ఆప్ ప్రభుత్వాలు కుమ్మక్కయ్యాయని, రైతు వ్యతిరేక చర్యలకు పూనుకున్నాయని విమర్శించారు. రైతులను బలవంతంగా తరలించడాన్ని బీకేయూ నేత రాకేశ్ తికైత్ ఖండించారు. ఒకవైపు డిమాండ్ల పరిష్కారానికి రైతు సంఘాలతో చర్చలు జరుపుతూ... మరోవైపు వారిపై ఉక్కుపాదం మోపుతుండటం ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

జట్టు కట్టిన రైతు వ్యతిరేక బీజేపీ, ఆప్: ఖడ్గే

న్యూదిల్లీ: శంభు, ఖనౌరీ శిబిరాల నుంచి రైతుల తొలగింపును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ఖండించారు. రైతులకు వ్యతిరేకంగా ఆ రెండు రైతు వ్యతిరేక పార్టీలు జట్టు కట్టినట్లున్నాయ్ అంటూ బీజేపీ, ఆప్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. పార్లమెంటు హౌస్ వెలుపల పంజాబ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీలు గురువారం ఆందోళన చేసిన సమయంలో ఖడ్గే... ఎక్స్‌లో ఆప్, బీజేపీపై విమర్శలు చేశారు. 'అధికార మత్తులో ఉన్న బీజేపీ, ఆప్... రైతులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నాయి. వీటిని దేశంలోని 62 కోట్ల మంది రైతులు ఎప్పటికీ క్షమించరు' అని ఖడ్గే పేర్కొన్నారు. అన్నదాతలకు వ్యతిరేకంగా ఈ రెండు పార్టీలు చేతులు కలిపినట్లున్నాయని వ్యాఖ్యానించారు. 'తొలుత చర్చలకు రావాలని రైతులను పంజాబ్ ప్రభుత్వం ఆహ్వానించింది... ఆపై బలవంతంగా వారిని ఆందోళన స్థలి నుంచి తొలగించింది. సీనియర్ నాయకులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్, సర్వన్ సింగ్ పంధేర్‌ను పంజాబ్ పోలీసులు బలవంతంగా నిర్బంధించడం ఖండించనార్హం' అని ఖడ్గే పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామన్న అహంతో ఈ రెండు పార్టీలకు రైతుల గోడు పట్టడం లేదని దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వం ఎంఎస్‌పీని ఇవ్వలేదు... నల్ల సాగు చట్టాలను దిల్లీలోని ఆప్ సర్కార్ వేగవంతంగా అమలు చేసింది.' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. మధ్యప్రదేశ్ మాండసౌర్ ఘటనను, లఖింపూర్ ఖేరి ఘటనను గుర్తుచేశారు. 2015లో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ర్యాలీ సమయంలో రాజస్థాన్‌లో ఓ రైతు ఉరి వేసుకున్నాడని ఖడ్గే పేర్కొన్నారు.

వలస ఆదివాసులకు అండగా ఉంటాం: విశ్వనాథం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : పేదలు, కార్మిక కష్టజీవుల పార్టీ సీపీఐ సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైందని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. గురువారం పాల్వంచ మండలంలోని ఉలవనూర్ బంజర పంచాయితీ చిరతానిపాడు గుంపులో సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సీపీఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదన్నారు. అనాదిగా పోడు సాగు చేసుకుంటున్న రైతులందరికి పట్టాలు అందించి రైతు భరోసా మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీ గ్రామాలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. సభ అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. చిరతానిపాడుగుంపు శాఖ కార్యదర్శిగా మాడే చుక్కారావ్, సహాయ కార్యదర్శిగా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, మండల నాయకులు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, వేములపల్లి శ్రీను, కొంగర అప్పారావు, అమృత్తరావు, బాలాజీ, రేగు కృష్ణ, బాలు,స్వర్ణలత, రమణ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: వడదెబ్బ నివారణ,ఆరోగ్య సంరక్షణ చర్యలపై గురువారం ఆర్జీ వన్ 2వ గనిపై జరిగన సమావేశంలో సింగరేణి ఏరియా హాస్పిటల్ ఏసిఎంఓ డా.కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.కె.పద్మ మాట్లాడుతూ ఎండలు ముదురుతున్న నేపథ్యంలో అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, అధికారులు డి.వెంకటేశ్వర్లు, టి.శంకర, గణేష్, ఏఐటీయూసీ గని కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన

విశాలాంధ్ర-మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ మరియు 14వ డివిజన్‌లో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మాజీ మేయర్ అమర్ సింగ్ గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బచ్చ రాజు, అనంత్ రెడ్డి, వి.సత్యనారాయణ, పాశం బుచ్చి యాదవ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ, డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే, పనులు నాణ్యతతో సమయానికి పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.

స్కూళ్లలో అధికారుల తనిఖీలు

విశాలాంధ్రలో వార్తకు స్పందన

విశాలాంధ్ర-ఆమనగల్లు: ఒంటిపూట బడులు వీరికి వర్తించవా అని విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన వార్తకు గురువారం ఆమనగల్ మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వము వేసవి తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ ప్రవేట్ పాఠశాల విద్యార్థులకు ఒంటి పూట బడులు నిర్వహించాలి.కానీ ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ సమయపాలన పాటించకుండా ఇష్ట రీతినా తరగతులు నిర్వహిస్తున్నారని విశాలాంధ్ర దినపత్రికలో బుధ వారం ప్రచురణ వార్తకు గురువారం మండల విద్యాశాఖ అధికారులు గురువారం మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం నియమాలకు వ్యతిరేకంగా గుర్తించగా, ప్రభుత్వ నియమాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు

సురసముద్రంలో మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - ఆమనగల్లు : సురసముద్రంలో గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయింది. సురసముద్రం నుండి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 30-35 సంవత్సరాలు ఉంటుందని, అతని ఒంటి పై కాపీ కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్‌ఉందన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తు పడితే ఆమనగల్ పోలీస్ స్టేషన్ 8712663340 నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

రియల్ ఎస్టేట్ మోసగాళ్లు అరెస్టు

విశాలాంధ్ర-ఖమ్మం: నాయుడుపేట ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మానుకొండ శ్రీనివాస్ అనునతను మరియు పోలేపల్లి గ్రామం ఖమ్మం రూరల్ మండలం కు చెందిన వెలుతురు శ్రీనివాస్ అనునతను రఘునాథపాలెం రెవిన్యూ గ్రామంలో లేని ఇళ్ల స్థలాన్ని ఉన్నట్టుగా చూపించి పాకబండ బజార్ బోనకల్ ఎక్స్ రోడ్ ఖమ్మం కి చెందిన కాకుమాని రామారావు అను అతనికి 200 గజాల ఇళ్ల ప్లాటును మోసపూరితంగా అమ్మి 18 లక్షల రూపాయలు తీసుకొని ఉద్దేశపూర్వకంగా మోసగించినందున, అదేవిధంగా మానుకొండ శ్రీనివాస్ మరో ముగ్గురిని ఖమ్మంలో ఎవరికో చెందిన ఇళ్ల స్థలాన్ని తనవిగా చూపించుకొని వారి వద్ద నుండి డబ్బులు తీసుకొని మోసగించినందున ఖమ్మం సిసిఎస్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయబడినందున ఈరోజు వారిద్దరిని అరెస్టు చేసి గౌరవ న్యాయస్థానం ముందు రిమాండ్ నిమిత్తం పంపనైనది సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-మేడిపల్లి: తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు ఏ మాత్రం సరిపోవని, సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న విద్యారంగానికి అధిక నిధులు కేటాయించలేరా, ప్రజా ప్రభుత్వంలో కూడా విద్యారంగం అభివృద్ధికి నోచుకోకపోవడం సిగ్గు చేటని, వెంటనే ఈ బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్లు కనీసం 15% నిధులైన విద్యకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో బోడుప్పల్ కమాన్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ప్రభుత్వం 3,04,965 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా విద్యారంగానికి కేవలం 23,108 కోట్లు మాత్రమే కేటాయించారని 7.5% నిధులు మాత్రమే విద్యకు కేటాయించిందని, గత బడ్జెట్‌కు ఈ బడ్జెట్‌కు కేవలం 0.2% నిధులు కేవలం 1816కోట్లు మాత్రమే పెంచారని, ఇవి ఏ మేరకు విద్యారంగ అభివృద్ధికి సరిపోవని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఉన్నత విద్య బలోపేతం ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి ఊసే లేదని, ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు ప్రతిష్టాత్మకంగా చేస్తున్నామని 11వేల కోట్లు కేటాయించామని చెపుతున్నారని మరి ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవి, గురుకులాలు మోడల్ స్కూల్, మైనార్టీ స్కూళ్ళ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు ఊసే ఎత్తకుండా, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు, అద్దె భవనాల్లో నిర్వహణలో ఉన్న వాటికి కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయింపు పై నిధుల చేయకపోవడం సరికాదని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలే రూ.8000 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని వాటి ఊసే లేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యార్థులకు ల్యాప్ టాప్ లు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని చెప్పారని వాటి గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదని, మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుపై ప్రకటన దానికి నిధుల కేటాయింపు పై బడ్జెట్‌లో మాట కూడా లేదని, బిఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం అయిందని నిధుల కేటాయింపు లేదని కాంగ్రెస్ ప్రజా పాలనలో విద్యాశాఖ రేవంత్ రెడ్డి వద్ద ఉంది కాబట్టి నిధులు అధికంగా విద్య శాఖకు వస్తాయని ఆశిస్తే కాంగ్రెస్ కూడా విద్యను నిర్వీర్యం చేసే విధంగా నిధుల కేటాయింపు చేసిందని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిన బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు తల్లోజు హరీష, నాయకులు, బన్నీ, అరవింద్, కృష్ణ, వెంకట్, సైదులు, గురు ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు

నిర్దేశిత గడువులోనే పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-తొర్రూరు: పట్టణంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ పైప్‌లైన్ ఎంతో కీలకమని, నిర్దేశిత గడువులోనే పనులు పూర్తి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ అధికారులతో కలిసి పలు పనులను పరిశీలించారు.హరిపిరాల రోడ్డులో అమృత్ పైప్‌లైన్ పనుల పురోగతిని తనిఖీ చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ పైప్‌లైన్ ఎంతో కీలకమని, నిర్దేశిత గడువులోనే పనులు పూర్తి చేయాలని తెలిపారు. పట్టణంలోని పెద్దచేరువ వద్ద మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులకురాష్ట్ర ప్రభుత్వంటి యుఎఫ్ఐడిసి నిధుల ద్వారా రూ.5 కోట్లు మంజూరు అయిందన్నారు. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంతో ప్రజలకు విశ్రాంతి కోసం ఒక అందమైన విహార స్థలం లభిస్తుందని, పర్యాటక అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, గ్రీనరీతో కూడిన ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం మండలంలోని అమ్మాపురం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో వంట సామాగ్రిని పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 557 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, మున్సిపల్ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సోదర భావం పెంపునకు ఇఫ్తార్ విందులు ప్రతీక: అనుదీప్

విశాలాంధ్ర - కొత్తగూడెం : మనిషి మంచి వ్యక్తిగా మలిచి మానవతా విలువలు పెంపొందించే రంజాన్ మాసంలోని ఇఫ్తార్ విందులు వర్గాలతో పరస్పర సోదర పాదుగొలుపుతాయని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సంకు బాపన అనుదీప్ అన్నారు. తమ జీవితాలను సత్యం, న్యాయం, ధర్మం అనే పునాదుల మీద ముస్లిం లు తమ జీవిత సౌధాలన్ని నిర్మింప చేసేదే కఠోర ఉపవాస వ్రతమన్నారు. గురువారం సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ మజీద్ లో బిఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ గంగా జమున తహజీబ్ మన సంస్కృతిలో ఒక భాగమని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అనేవారని గుర్తు చేసారు. కానీ నేడు కొందరు రాజకీయ నాయకులు మతాల మధ్య విద్వేషం సృష్టించి, దేశ ప్రజలను విడదీసి లాభపడాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విభజన పరిణామాలు ఎప్పటికి మంచి పద్ధతి కాదన్నారు. పండుగలు ఏమైనా దేశ ప్రజలు ఐక్యంగా జరుపుకునే సాంప్రదాయం మనదన్నారు. తమ పార్టీ ఎప్పటికీ సెక్యులర్ పార్టీ అని అనుదీప్ స్పష్టం చేసారు.ముస్లిం సోదరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు గూడెల్లి యాకయ్య, కలకోటి ఐలయ్య, బావు సతీష్, అజార్, ఉమర్, జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు అబ్దుల్ బషీద్, కరీం, సోను సాబ్, యాకూబ్, సమీర్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి హోటల్‌లో ఎమ్మెల్యే చాయ్ తాగుతూ..

విశాలాంధ్ర బ్యూరో-నిర్మల్ జిల్లా ఖానాపూర్ : బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో నిద్రించిన, ఖానాపూర్ ఎమ్మెల్యే బెడుమ బొజ్జు పటేల్ గురువారం ఉదయాన్నే సామాన్యుడిలా వీధిలో వాకింగ్ చేస్తూ హొటల్లో చాయ్ త్రాగుతూ సామాన్యులు మాట్లాడుకునే సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా వెళ్లేందుకు గుట్టు చప్పుడు కాకుండా అండర్ కవర్ గైడ్ల తెలుసుకుంటున్నారు. హంగు అర్భటాలు లేకుండా ప్రభుత్వ లాంఛనంగా గన్ మెన్లను వెంటబెట్టుకోకుండానే సమాజంలో సామాన్యుడిలా తిరగడమే ఇష్టం సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నాకు సామాన్యుల బాధలు తెలుసుకోవాలంటే ఇలా టీ హొటల్లో లోని సామాన్యుల సమస్యలపై చర్చించుకుంటారు వాటిని విని సమస్యకు పరిష్కార చూపడమే నా కర్తవ్యం అంటూ నేను మీలో ఒక్కడిగా ఉండటమే ఇష్టపడతాను అని అన్నారు గతంలో ఖానాపూర్ నియోజకవర్గానికి ఎందరో ఎమ్మెల్యే లుగా సేవలు అందించిన వారు గుర్తిరగని సమస్యలను గుట్టు చప్పుడు కాకుండా సమాజ శ్రేయస్సు బాటలో నడుస్తు నియోజకవర్గానికి వన్నె తెస్తున్న ఎమ్మెల్యే అని పట్టణ పల్లె వాసులు కొనియాడుతున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొరికిన దయానంద్ ఏకైక కార్యకర్త ఉన్నారు.

పంట పొలాలు ఎండిపోకుండా చూడాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పెద్ద పల్లి: జిల్లాలో ఎస్సారెస్పీ క్రింద యాసంగి పంట పొలాలు సరిగా నీటి సరఫరా కోరకు అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష డీ 83 కాల్వ క్రింద యాసంగి పంటకు నీటి విడుదల, పై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాల్వ క్రింద యాసంగి పంట కింద 7 తడులలో 6 తడుల నీటిని ఇప్పటికే విడుదల చేశారని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగిపోవడం, ఎస్సారెస్పీ నుంచి ఆశించిన స్థాయిలో నీరు విడుదల కాకపోవడం, ఎండ తీవ్రత వల్ల ఆవిరిలో కొంత నీరు నష్టపోవడం వంటి కారణాలవల్ల చివరి ఆయకట్టు ప్రాంతాల్లో పంట పొలాలకు ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదని అన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను సంబంధిత అధికారులను తెలుసుకొని వారికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, మంథని, ఈఈ బాల రామయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజా వైద్యానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఇల్లందు : కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం ఇల్లందు లోని ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్యే చేతుల మీదుగా డయాలసిస్ వార్డ్ లో అదనపు బెడ్లను ప్రారంభించారు. గతంలో ఉన్న ప్లేట్ల కంటే పేషంట్ల సౌకర్యార్థం మరో మూడు డయాలసిస్ బెడ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సేవలు ప్రారంభించడం జరిగిందన్నారు. రానున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు హాస్పిటల్లో 120 లీటర్స్ వాటర్ కూలర్స్ రెండు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రజెండా పోరాటాలతోనే పేదలకు అభివృద్ధి, సంక్షేమం : విజయరాములు

విశాలాంధ్ర-వనపర్తి: దేశంలో ఎర్రజెండా పోరాడాలతోనే పేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు అన్నారు. గురువారం పెబ్బేర్ పట్టడం మహాజన హమాలి సంఘం భవనంలో సిపిఐ శతజయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిసెంబర్ 26, 1925 లో సిపిఐ ఆవిర్భవించి డిసెంబర్ 26, 2024 న 100వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో మార్చి 23న శతజయంతిఉత్సవాలు జరుపుతున్నామన్నారు. దున్నేవాడికి భూమి పింఛన్లు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, రుణమాఫీ, తదితర ఎన్నో సంక్షేమ పథకాలు పేదలకు లభించాయన్నారు. కార్మిక కర్షక బడుగు బలహీన వర్గాల గొంతుకలు సిపిఐ చట్టసభల్లో బయట వినిపిస్తోందన్నారు. అధికారం ఉందా లేకపోయినా పేదల అభివృద్ధి ఎజెండాగా పనిచేస్తుందని, పేదలతో హక్కుల కోసం ఎర్రజెండా పట్టి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, పెబ్బేరు నాయకులు శ్రీనివాసులు, శాంతమూర్తి, జగదీష్, రాములు, వెంకట్, రాజు , మన్యం , గాంధీ , చింతల రాములు, చంద్రన్న పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి: ఎంఈఓ

విశాలాంధ్ర-కారేపల్లి : సింగరేణి మండలంలో నేడు శుక్రవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని ఎంఈఓ దుగ్గిరాల జయరాజు తెలిపారు. గురువారం సింగరేణి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఈనెల21వ తేదీనుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసమని తెలిపారు.ఈఏడాది మొత్తం565 మంది రెగ్యులర్ విదార్థులు,ఇందులో 80 మంది ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు.వీరికోసం కారేపల్లిలో మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోమట్లగూడెం హై స్కూల్ మొత్తం మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 47 మంది ఇన్విజిలేశర్లు,ముగ్గురు చొప్పున చీఫ్ సూపరిడెంట్ లు, డిపార్టెంట్ ఆఫీసర్లు,పేపర్ కస్టోడియంలు ఉంటారని తెలిపారు.డీ.ఈ.ఓ సోమశేఖర శర్మ సూచన మేరకు ప్రతీ పరీక్షాకేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.పరీక్షలు ఉదయం 9.30 నుండి 12:30గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు పరీక్షకు ఒక గంట ముందుగా కేంద్రానికి చేరుకోవడం మంచిదన్నారు.విద్యార్థులు హాల్ టికెట్ తప్పనిసరిగా పరీక్ష కేంద్రానికి తీసుకు రావాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ఫోన్లు,ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరని, పరీక్షా కేంద్రాల దగ్గరలోని జిరాక్స్ సెంటర్ల మూసివేత, 144 వ సెక్షను అమలులో ఉంటుందన్నారు.ఇప్పటికే పరీక్షకు సంబంధించిన అన్ని మెటీరియల్లు మండలానికి చేరుకుందన్నారు.పరీక్ష రాసే విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎంఈఓ సూచించారు.

పది విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-మరిపెడ: పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ మరిపెడ మండలం సూర్యాపేట రోడ్డులో గల కేజీవిబీ వసతి గృహం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి గృహంలో పాఠశాలలలో తగిన సౌకర్యాలు కల్పిస్తూ రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, డైట్ మెనూ పక్కాగా పాటించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో జిల్లాను అత్యుత్తమ ఫలితాలను సాధించుటకు గత కొన్ని రోజుల నుండి ప్రణాళికా ప్రకారం విద్యాశాఖ ముందుకు వెళ్లిందని అందుకు అనుకూలంగా చర్యలు తీసుకొని ప్రతీ సబ్జెక్టు వారీగా విద్యాబోధనలు అందించారని అన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు తెలిపారు. భోజనం సిద్ధం చేసే వారు తగిన జాగ్రత్తలు పాటిస్తూ భోజనం వడ్డించాలని అన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను తనిఖీ చేసి ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృశ్య కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్లవారీగా తగిన మందులు ఓఆర్ఎస్ సిద్ధంగా ఉంచుకోవాలని ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే స్పందించాలని, తీవ్రమైన ఎండల నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలను గ్రామపంచాయతీలు ,మున్సిపల్ వారిగా విస్తృత ప్రచారం చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు.మందుల స్టాక్ రిజిస్టర్, హాజరు వివరాలను, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ వివరాలను తనిఖీ చేసి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-కొమరం భీం: స్పష్టమైన ఓటర్ జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావు తో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 19.03.2025 వరకు ఆన్లైన్లో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో 6,7,8 ఫారం 5481 దరఖాస్తులు వచ్చాయన్నారు.4559 దరఖాస్తులను పరిష్కరించి ఆన్లైన్లో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వివరాలు సరిగ్గా లేని 369 తిరస్కరించినట్లు పేర్కొన్నారు.553 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు ప్రారంభమౌతున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కోరుతూ విద్యార్థులకు గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో 73 పరీక్ష కేం ద్రాలు ఏర్పాటు చేయగా 12,282 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు, 73 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిళ్లను పోస్టాఫీసులకు చేరవేసేందుకు పోలీసు బందోబస్తు, పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు పరీక్షలను ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో రాయడం ద్వారా విజయం సాధిస్తారని తెలిపారు.

విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

విశాలాంధ్ర-ఇల్లందు: పది విద్యార్థులు భయం వీడి ప్రశాంతమైన మనస్సుతో పరీక్షలను రాయాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ ఎమ్ లకావత్ రాంబాబు పలు సూచనలు చేసారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థికి జీవితంలో ఓ మలుపు లాంటిదన్నారు. భవిష్యత్తులో ఉన్నత విద్యశిఖరాలకు తొలిమెట్టు లాంటివి ఈ పరీక్షలన్నారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో తమకు వచ్చిన సమాధానాలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా రాయాలని సూచించారు. ఈ పరీక్షలు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తమ తల్లితండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్ పథకంలో నిరుద్యోగ యువతకు చిక్కులు: శంకర్

విశాలాంధ్ర-అమనగల్లు: రాజీవ్ యువ వికాస్ పథకంలో నిరుద్యోగ యువతకు అర్హత కోల్పోతున్నారని సోషలిస్టు విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ జంతుక శంకర్ అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులకు అవకాశం కల్పించకపోవడంతో 12 సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పెళ్లిళ్లు జరిగి వేరుగా నివాసం ఉంటున్న ఎందరో యువకులు ఇంకా తల్లిదండ్రులు రేషన్ కార్డులోనే కొనసాగుతూ వచ్చారని,కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో నిబంధనలు ప్రకారం పాత రేషన్ కార్డులు డిలీట్ అయితేనే కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే పరిస్థితి ఉండడంతో పలువురు యువకులు డిలీట్ ఆప్షన్ ద్వారా పాత రేషన్ కార్డులు డిలీట్ కాగా, ప్రభుత్వం యువతకు చేయూతనందించేందుకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తీసుకొని వచ్చింది. కానీ ఎంతో ఆశగా శిక్షణతో పాటుగా సబ్సిడీ రుణాలు లభిస్తాయని ఉపాధి పొందవచ్చు అని ఆశతో ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకోవడానికి ఈ సేవా సెంటర్లకు యువత వెళ్తే అక్కడ నిర్వాహకులు వివరాలు నమోదు చేసే క్రమంలో రేషన్ కార్డ్ ఆప్షన్ వచ్చేసరికి ఇంతకుముందు పాత కార్డు డిలీట్ అయిన కారణంగా ఆ పాత రేషన్ నెంబర్లు కొడితే దరఖాస్తులు రిజెక్ట్ అవుతున్నాయని, దింతో యువకులు చాలా మంది నిరుత్సాహ పడుతున్నారని. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జంతుక శంకర్ సూచించారు.

సికిల్ సెల్ ఎనీమియా అవేర్నెస్ ట్రైనింగ్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ హైదరాబాద్ ఆదేశాను ఆదేశాల మేరకు,ములుగులోని రోడ్డు,భవనాల అతిథి గృహ సమావేశ మందిరంలో గురువారం జిల్లాస్థాయి శిక్షకుల సికిల్ సెల్ ఎనీమియా అవేర్నెస్ ట్రైనింగ్ 'శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని, ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల రావు తెలిపారు.ఈ శిబిరాన్ని వచ్చిన ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల ఉద్దేశించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ గిరిజనులలో అనువంశికత వల్ల కలిగే సికిల్ సెల్ రక్తహీనత మీద, గ్రామస్థాయిలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి, ప్రజలకు సికిల్ సెల్ వ్యాధి పట్ల చైతన్యవంతులను కావించినప్పుడే 2047 సంవత్సరం నాటికి సికిల్ సెల్ రక్తహీనతను, అంతమొందించవచ్చని డిఎంహెచ్వో పిలుపునిచ్చారు . సికిల్ సెల్ రక్తహీనత వ్యాధి అనువంశికంగా సంక్రమింప చేసే వ్యక్తుల వివాహాల వల్ల కలిగే సంతానం సికిల్ వ్యాధికి గురికాకుండా, ఆ కుటుంబానికి తగిన కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంబించేటట్లు చేసి తద్వారా సికిల్ సెల్ వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు.జాతీయ సికిల్ సెల్ రక్తహీనత అవగాహన కార్యక్రమం రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన శిక్షకులు డాక్టర్. గణేష్ డాక్టర్, శ్రవణ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా, సికిల్ సెల్ వ్యాధి కలిగిన వ్యక్తులు, పుష్కలమైన నీటిని తీసుకోవాలని, ఆరోగ్యవంతమైన పోషకాహారాన్ని తీసుకోవాలని వివరించారు. జిల్లా ఎస్ వి బి డి సి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చంద్రకాంత్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రణధీర్, జయశంకర్ భూపాలపల్లి జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ పవన్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సురేందర్, జిల్లా సికిల్ సెల్ జిల్లా ప్రోగ్రాం అధికారి పాల్గొన్నారు.

సంపాదకీయం

రైతులపై మళ్లీ బుల్డోజర్లు

శంభు, ఖనోరీ సరిహద్దులో ఆందోళన చేస్తున్న రైతుల ఉద్యమాన్ని కొనసాగనివ్వకుండా నిరోధించడం కోసం పంజాబ్‌లో అధికారంలో ఉన్న భగవంత్ సింగ్ మాన్ నాయకత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం బుధవారం రాత్రి బుల్డోజర్లు ప్రయోగించింది. రైతుల ట్రాక్టర్లను, ట్రాలీలను అక్కడి నుంచి తొలగించారు. హైవేను తెరిపించే ప్రయత్నం జరుగుతోంది. రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంథేర్‌ను కూడా అరెస్టు చేశారు. ఈ పని బీజేపీ చేసి ఉంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఆమ్‌ఆద్మీ పార్టీ ఈ పని చేయడం ఆశ్చర్యకరంగా ఉంది. రైతుల ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతోంది. అయినా కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం బుల్డోజర్లను వినియోగించడం వెనక ఆంతర్యం ఏమిటో తెలియదు. దిల్లీలో కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ ఇటీవలి ఎన్నికలలో ఓడిపోయిన తరవాత పంజాబ్ ప్రభుత్వాన్ని కూడా కొనసాగనివ్వదేమో అన్న వార్తలు వచ్చాయి. అంటే భగవంత్ సింగ్ మాన్ బీజేపీ ఒత్తిడికి లొంగిపోయారనుకోవాల్సి వస్తోంది. ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్‌ను అరెస్టు చేశారు. ఆయన అనారోగ్యంగా పడుకుని ఉన్న సమయంలో ఆయనను అరెస్టు చేశారు. రైతు నాయకులు కేంద్ర మంత్రులతో చర్చలు జరిపి తిరిగి వచ్చిన తరవాత ఆందోళన చేస్తున్న రైతులపై బుల్డోజర్లు ప్రయోగించడం విడ్డూరమే. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు దలేవాల్‌తో పాటు అనేక మంది రైతు నాయకులను కూడా అరెస్టు చేశారు. దలేవాల్ గత ఏడాది నవంబర్ నుంచి నిరాహార దీక్షలో ఉన్నారు. ఈ దాడిని సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు రాకేశ్ తికైత్ తీవ్రంగా దుయ్యబట్టారు. ఇక మీదట రైతు ఉద్యమానికి పంజాబ్ కేంద్రంగా ఉంటుందని హెచ్చరించారు. భగవంత్ సింగ్ మాన్ ఉద్యమం చేస్తున్న రైతులకు మద్దతివ్వాల్సింది పోయి బలప్రయోగానికి పాల్పడడం ఏమిటి అని రాకేశ్ తికైత్ ప్రశ్నించారు. దీనితో పంజాబ్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా పోరాడాలన్న కేంద్ర ప్రభుత్వ పన్నాగం సఫలం అవుతుంది. దీర్ఘ కాలంగా రైతులు తమ పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్నారు. ఈ దశలో పంజాబ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై రైతు ఉద్యమం మీద కొరడా ఝళిపించడం విచిత్రంగా ఉంది. బుల్డోజర్లను ఎందుకు వినియోగించారు, రైతుల తాత్కాలిక గుడారాలను ఎందుకు తొలగించారో అన్న విషయంలో పంజాబ్ ప్రభుత్వం వివరణ ఏదీ ఇవ్వలేదు. ఇది భగవంత్ సింగ్ మాన్ ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనం అనుకోక తప్పదు. కేంద్ర ప్రభుత్వం రైతు ఉద్యమకారులను సరిహద్దులోనే నిలిపివేయాలని, పంజాబ్‌కి ఇతర రాష్ట్రాలతో సంబంధాలు లేకుండా చేయడానికి ఒక మార్గం కనిపెట్టిందని పంజాబ్ మంత్రి తరుణ్ ప్రీత్ సింగ్ సోంద్ చెప్పారు. బీజేపీని వ్యతిరేకిస్తామంటున్న పార్టీకి చెందిన నాయకుడు ఇలాంటి వ్యాఖ్య చేయడం వింతగా ఉంది. రైతులు పంజాబ్ శ్రేయస్సు కోరుకుంటే రహదారులలో స్వేచ్ఛగా తిరగడానికి అనువుగా మార్చాలని కూడా ఆయన అన్నారు. బుధవారం రైతుల ప్రతినిధులు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పౌర సరఫరాల మంత్రి ప్రహ్లాద్ జోషి, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో చర్చలు జరిపారు. దలేవాల్‌ను, పంథేర్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న వాహనాలను ఆపడానికి రైతులు ప్రయత్నించినప్పుడు ఓ మోస్తరు ఘర్షణ కూడా జరిగింది. ఇందులో కొంతమంది రైతులు గాయపడ్డారంటున్నారు. రైతుల మీద దాడి చేయడానికి పంజాబ్ ప్రభుత్వ వాహనాలు భారీ సంఖ్యలో వచ్చాయి. పంజాబ్ సర్కారు పాల్పడ్డ దాష్టీకానికి వ్యతిరేకంగా పంజాబ్ రైతులు శంభు, ఖనౌరి సరిహద్దుకు చేరుకోవాలని రైతు నాయకులు పిలుపు ఇచ్చారు. 2020-2021 లో దిల్లీ సరిహద్దులో రైతులు బైఠాయించినప్పుడు కనీసం 700 మంది రైతులు ప్రాణ త్యాగం చేయవలసి వచ్చింది. కేంద్ర ప్రభుత్వమే కాదు పంజాబ్ ప్రభుత్వం కూడా రైతులకు శత్రువుగా మారింది. రైతుల మీద దాడికి దిగడంవల్ల భగవంత్ సింగ్ మాన్ ప్రభుత్వం తమకు కేంద్ర ప్రభుత్వం నుంచి మెప్పు లభిస్తుందనుకోవడం కేవలం భ్రమగానే మిగిలిపోక తప్పదు.

బుధవారం రాత్రి కేంద్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఏ ఫలితం లేకుండా ముగిసిన వెంటనే పంజాబ్ సర్కార్ రంగంలోకి దిగి అరెస్టులు మొదలు పెట్టింది. పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాల పోలీసులు రైతులు దిల్లీ వేపు వెళ్లకుండా నిరోధించడానికి బుల్డోజర్లను వినియోగిస్తున్నారు. మరీ విచిత్రం ఏమిటంటే రైతులతో చర్చల్లో పాల్గొన్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ చర్చలు సానుకూలంగా జరిగాయంటున్నారు. మే 4న మళ్లీ చర్చలు జరుపుతామని చెప్పారు. ఈ చర్చల్లో పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, వ్యవసాయ శాఖ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుద్దియన్ పాల్గొన్నారు. రైతుల తరఫున 28 మంది ప్రతినిధులు చర్చల్లో భాగస్వాములయ్యారు. గత ఫిబ్రవరి 22 న జరిగిన చర్చల్లో కూడా కేంద్ర మంత్రులు ముగ్గురు పాల్గొన్నారు. రూ. 25000 నుంచి రూ 30000 కోట్లు ఖర్చు పెడ్తే రైతుల పంటలకు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం సాధ్యమేనని రైతుల ప్రతినిధులు అంటున్నారు. "మా ప్రభుత్వం ఎప్పుడూ రైతులకే మద్దతు ఇచ్చిందని పంజాబ్ పరిశ్రమల శాఖ మంత్రి తరుణ్ ప్రీత్ సింగ్ సోంద్ చెప్పారు. అయితే వ్యాపారం కొనసాగించడానికి, నిరుద్యోగ సమస్య ఎదుర్కోవడానికి రహదారులు రాకపోకలకు సుగమంగా ఉండాలని ఆయన అన్నారు. రైతుల మీద బుల్డోజర్లు ప్రయోగించినందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు పంజాబ్ ప్రభుత్వం కూడా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ నాయకుడు సత్నాం సింగ్ పన్నూ హెచ్చరించారు. రైతుల మీద దౌర్జన్యానికి నిరసనగా పంజాబ్, హర్యానా డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల ఎదుట ప్రదర్శన చేస్తామని ఆయన చెప్పారు. శిరోమణి అకాలీ దళ్ నాయకుడు సుఖ్బీర్ సింగ్ బాదల్ కూడా పంజాబ్ ప్రభుత్వ చర్యను ఖండించారు. "మాన్ కు మతి స్థిమితం తప్పింది" అని అకాలీ నాయకురాలు, పార్లమెంటు సభ్యురాలు హర్సిమ్రత్ కౌర్ బాదల్ వ్యాఖ్యానించారు. రైతుల కోర్కెలు అంగీకరిస్తామన్న మాన్ వాగ్దానం ఏమైందని ఆమె ప్రశ్నించారు. కేంద్ర సహాయంతో ముఖ్యమంత్రి మాన్ ఏదో పెద్ద చర్యకు సిద్ధమవుతున్నారని పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ ఛన్నీ అన్నారు. రైతులతో చర్చలు కొనసాగుతున్న తరుణంలో పంజాబ్ ప్రభుత్వానికి అరెస్టులు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది అని ప్రశ్నించారు. ఈ పరిణామాలు రైతుల ఉద్యమం మరింత తీవ్రం కావడానికి మాత్రమే ఉపకరిస్తాయి.

బ్రోచేవారెవరు

రా..బావ ఏంటి కబుర్లు అలా దిల్ ఖుషిగా నవ్వుతూ ఆనందంగా వస్తున్నావు ఏంటి కథ - ఏముందయ్యా ఇక నుంచి నేనే కాదు రాష్ట్ర ప్రజలందరూ ఆందోళన వదలి ఆనందంగా హాయిగా బతకవచ్చు. సంపద సృష్టించే ముఖ్యమంత్రి, సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఉప ముఖ్యమంత్రి వుండగా ఇంకా భయమెందుకు. పవన్ సనాతన ధర్మాన్ని రక్షిస్తే ఆ దేముడే అన్ని సమకూరుస్తాడు గదా. నిన్న మా అబ్బాయి ఫోను చేసి ఇప్పటికే ఇద్దరు పిల్లలున్నారని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటానన్నాడు. ఎంతమంది వున్నా వారిని ప్రభుత్వమే పోషిస్తుందని వద్దని వారించాను. ఎంతమంది వున్నా వారిని పారిశ్రామికవేత్తలుగా తయారుచేసి నిరుద్యోగం, పేదరికం లేని రాష్ట్రంగా చేస్తానని ముఖ్యమంత్రి అంటున్నారు గదా. అదంతా నిజమేనని నమ్ముతూ అబ్బాయికి సలహ ఇచ్చావన్న మాట. పిల్లల్ని కనండి అంటే మన కోసం కాదయ్యా, జనం పెరిగితే నియోజకవర్గాలు పెరిగి రాజకీయ నిరుద్యోగం తగ్గుతుంది. దాంతో అదినాయకులపై ఒత్తిడి తగ్గటమే కాక పార్లమెంటులో బలం పెంచుకుని కేంద్రంపై పోరాడవచ్చు. అంత లోతుగా అలోచించ లేదయ్యా. బాబు గారు సంపద సృష్టించి మనల్ని పోషిస్తాడనుకున్నా గాని లోగుట్టు తెలియలేదు. సంపద సృష్టిస్తే పన్నులు పెంచడం దేనికి. ఇందులో ఒక లోగుట్టు కూడా వుంది. ప్రజలకు తెలియని పరోక్ష పన్నులుంటాయి. అవి పెంచితే సామాన్యులకు తెలియకుండానే తినో తినకో చెల్లించవలసిందే. కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు పెరిగితే మనకు తెలుస్తుంది. అవి స్వల్పంగా పెంచి పరోక్ష పన్నులతో బాదుతారు.

అది సరే రైతులు పారిశ్రామికవేత్తలుగా మారితే తిండి గింజలు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలా. కంగారు పడకయ్యా ముందుగా లక్షమందిని పారిశ్రామిక వేత్తలుగా మారుస్తాడట. అలా అంచెలంచెలుగా ఇంటికో పారిశ్రామికవేత్తని తయారు చేస్తాడట. నాకు తెలియక అడుగుతాను. ఇంటిలో ఒకరు పారిశ్రామికవేత్త తయారైతే మిగిలిన కుటుంబ సభ్యులు ఆ పరిశ్రమలో కార్మికులుగా మారాలా ఏ పని చేయకుండా కూర్చోవాలా! ఏమోనయ్యా నాకు మాత్రం చంద్రబాబులో మరో మార్పు కనబడుతున్నాడు. కమ్యూనిస్టులు, సోషలిస్టులు కోరుతున్న సమసమాజం నిర్మిస్తాడట. వున్న వాళ్ల నుంచి వసూలు చేసి లేని వాళ్ళకు ఇస్తాడట. ఇది ముమ్మాటికి కమ్యూనిస్టు సిద్ధాంతమే. అసలు ముందుగా ఆదర్శంగా చంద్రబాబు ఇతర మంత్రులు, శాసనసభ్యులు, ఇవ్వకుండా ఆదాయపు పన్ను కట్టే వారి నుంచి వసూలు చేయడం మంచిది కాదు. అంతెందుకు ఎక్కడకెళ్లినా ఎంతో కొంత ఉపముఖ్యమంత్రి పవన్ విరాళాలు ఇవ్వడం చూస్తున్నాం గాని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవ్వడం నేను వినలేదు. చివరకు ఎన్టీఆర్ ట్రస్టుకు

వివేచన
- బండారు రాధాకృష్ణ

కూడా పవన్ యాభై లక్షలు విరాళం ఇచ్చారు. అలాగే బుక్ ఎగ్జిబిషన్‌కు వెళ్లి లక్షలు వెచ్చించి పుస్తకాలు కొన్నారు. నిజమేనయ్యా అసలు ఇద్దరి మనస్తత్వం విరుద్ధంగా కనబడుతోంది కాని చంద్రబాబుకు మద్దతివ్వడంలో లోగుట్టు అర్థం కావడం లేదయ్యా. అనుభవం కోసం ఆగడమా లేక జగన్ పైనున్న కోపమో తెలియదు.

అది సరేనయ్యా... ప్రజలందరూ కలిసి ఎన్నుకున్న ప్రభుత్వం కొందరి కోసమే పని చేయడం అన్యాయం కాదా. ఈ మధ్య బాబుగారు కార్యకర్తలతో మాట్లాడుతూ పథకాలన్నీ మన పార్టీ వారికే దక్కాలని అన్నట్లు పేపర్లో చదివాను. కానీ ప్రజలందరూ పన్నులు కడుతున్నారు. ప్రజలందరూ ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అలా అనడం అన్యాయం కదా. చంద్రబాబుని అనవలసిన పనిలేదు. ఏ పార్టీ అధికారంలో వున్నా ఇంచుమించు అదే పరిస్థితి. బాబుగారు తొందరపడి నోరు జారారు గాని ఆయన చెప్పినా చెప్పకపోయినా మండలస్థాయి నాయకులు ఎప్పటి నుంచో అదే విధానంలో పని చేస్తున్నారు. ఈ జాఢ్యం అన్ని పార్టీలకు అంటుకుంది. ఇందులో ఎవరినీ మినహాయించనవసరం లేదు. అది సరే రైతు బిడ్డలు కూడా పరిశ్రమలు స్థాపిస్తే తిండి గింజలు ఏ దేశం నుంచి దిగుమతి చేసుకోవాలో అర్థం కాదు. ఇప్పటికే డబ్బు వ్యామోహంలో అమెరికా, జర్మనీ లాంటి దేశాలకు వెళ్లి ఉద్యోగం చేయడానికి బారులు తీరుతున్నారు. ఇప్పటికే వ్యవసాయం చేసేవారి శాతం 80 నుంచి 60 శాతంకు పడిపోయింది. గ్రామాల్లో నివసించే శాతం కూడా తగ్గుతోంది. గ్రామ స్వరాజ్యం కావాలని ఆశించిన మహాత్మాగాంధీ ఆశయానికి తూట్లు పడుతున్నాయి. పరిశ్రమలు గ్రామాల్లోకి ప్రవేశిస్తే వ్యవసాయం చేసేవాళ్లు కరువై తిండిగింజలు కోసం అగచాట్లు తప్పవు.

అది సరేనయ్యా. గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల సామాన్య ప్రజలు అధికారులు చుట్టూ తిరగకుండా వారి పనులు జరుగుతున్నాయి. వాలంటీర్లను తొలగించినట్లు సచివాలయాలను తొలగిస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. సచివాలయ వ్యవస్థ రద్దు చేయకపోవచ్చు. కానీ జగన్ విస్మరించిన రోడ్ల మరమ్మత్తులు, గ్రామాలకు రోడ్లు ముఖ్యమంత్రి చేపట్టడం అభినందనీయం.

పవన్ చంద్రబాబును అభినందిస్తూనే తన పార్టీ భవిత గురించి తదుపరి ఎన్నికలలో అధికారంలోకి వచ్చే విధంగా పావులు కదుపుతున్నాడు. కానీ సనాతన ధర్మ పరిరక్షకుడుగా బీజేపీని మోయదాన్ని విద్యాధికులు విమర్శిస్తున్నారు. పవన్ ప్రజలనుకున్నట్లు అమాయకుడు కాదు. వేచి చూసే ధోరణిలో ముందుకు సాగుతున్నాడు. సరే ఏదిఏమైనా ప్రజలను బ్రోచేది మాత్రం ప్రభుత్వమే.

సెల్: 9885569394

డీలిమిటేషన్‌పై రేపు కీలక సమావేశం

పి. సుధీర్

2026వ సంవత్సరం సమీపిస్తున్న తరుణంలో పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల విభజన అంశం ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది, ఈ అంశం వివాదాస్పదంగా మారుతోంది. సీట్ల సంఖ్య మారే సంవత్సరం ఇది. 2026 తర్వాత నిర్వహించిన మొదటి జనాభా గణనను అనుసరించి తదుపరి రౌండ్ డీలిమిటేషన్ తప్పనిసరిగా చేపట్టాలి. పునర్విభజన 2026 సంవత్సరానికి వాజపేయి ప్రభుత్వంవాయిదా వేసింది. ఆయన పాలనలోనే పునర్విభజన జరగవలసి ఉండగా, నిలిపివేసి 2026కు వాయిదా వేశారు. బీజేపీ నాయకుడు నరేంద్రమోదీ పాలనలో 2026 లో పునర్విభజన జరుపుతామని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దక్షిణాది రాష్ట్రాలలో పునర్విభజన జరిగితే పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల సంఖ్య తగ్గిపోతుందని, ఉత్తరాది రాష్ట్రాలు ప్రయోజనం పొందుతాయని తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ గట్టిగా వ్యతిరేకించారు. దక్షిణాది రాష్ట్రాలలో కుటుంబ నియంత్రణ జరగటం వల్ల జనాభా తక్కువగా ఉంది. ఈ కారణం చేత దక్షిణాది రాష్ట్రాలలో నియోజక వర్గాల సంఖ్య తగ్గుతుందని ఇప్పటికే ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలు ప్రజల దృష్టికి కూడా వెళ్లాయి. ఇది వివాదాస్పదం అయ్యే అవకాశం కన్పిస్తోంది. 2025 చివరి నాటికి ఇప్పుడున్న సీట్ల సంఖ్య నిలిచిపోతుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఇప్పటికే కొంతమంది ముఖ్యమంత్రులతో చర్చ జరిపారు. మరోసారి చర్చ జరిపి ఉమ్మడి కార్యాచరణ రూపొందించనున్నారు. మార్చి 22 వ తేదీన తమిళనాడులో మరోసారి చర్చ జరిపి నిర్ణయం తీసుకుంటారు. అత్యవసర పరిస్థితి సమయంలో 42 వ రాజ్యాంగ సవరణను 1976 లో చేశారు. వాజపేయి పాలనలో నియోజక వర్గాల విభజనను నిలిపివేశారు. పునర్విభజన కార్యక్రమం రాజ్యాంగంలో రెండు అంశాలుగా పేర్కొన్నారు. 1. ప్రతి రాష్ట్రంలో జనాభా నిష్పత్తి ఆధారంగా పార్లమెంటు సీట్ల సంఖ్యను సవరిస్తారు. అలాగే అసెంబ్లీ నియోజక వర్గాలలోను ప్రతి రాష్ట్రంలో జనాభా సంఖ్య ప్రకారమే నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుంది. 2. పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాలను నిర్ణయించేందుకు ప్రాంతీయ సరిహద్దులు తిరిగి నిర్ణయించి ఇవన్నీ సమంగా ఉన్నాయని అలాగే జనాభాను కూడా పోల్చి చూడవలసి ఉంటుంది.

1976లో రాజ్యాంగ సవరణను చేశారు. అనంతరం వాజపేయి ప్రభుత్వంలో 2001 లో సవరణ జరిగింది. 1981, 1991, 2001 దశాబ్దాలలో జనాభా గణన జరగలేదు. అలాగే పునర్విభజన కోసం కమిషన్లు ఏర్పాటు చేయలేదు. రాజ్యాంగ అంశాల ప్రకారం 2026 లో నియోజక వర్గాల పునర్విభజన జరగవలసి ఉంది. జనాభా గణన సైతం జరగవలసి ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన 2026లో జరపడం కష్టమవుతుంది. ఆయా రాష్ట్రాలలో జనాభాలో తేడా ఉంటుంది. కొన్ని రాష్ట్రాలలో జనాభా నియంత్రణ చర్యలు సమర్థంగా జరిగాయి. ఈ కారణంతో జనాభా వృద్ధి తీవ్రంగా తగ్గింది. మరికొన్ని రాష్ట్రాలలో జనాభా అత్యధికంగా పెరిగింది. ఫలితంగా సమర్థంగా, విజయవంతంగా జనాభా వృద్ధి పెరిగింది. జనాభా వృద్ధి తగ్గిన రాష్ట్రాలలో నియోజక వర్గాల సంఖ్య తగ్గుతుంది. అదనపు నియోజక వర్గాలు లభించవు. పంజాబ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో కొన్ని నియోజక వర్గాల సంఖ్య తగ్గిపోతుంది. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా నిర్వహించినందున జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పునర్విభజన జరపకూడదని గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నియోజక వర్గాల పునర్విభజనను మరో 30 ఏళ్ల పాటు వాయిదా వేయాలని కోరుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో ఉత్తరప్రదేశ్, అలాగే మధ్యప్రదేశ్, బీహార్ లాంటి రాష్ట్రాలలో జనాభా గణనీయంగా పెరిగింది. అందువల్ల ఈ రాష్ట్రాలలో నియోజక వర్గాల సంఖ్య పెరుగుతుంది. ఇది బీజేపీకి గణనీయంగా ప్రయోజనం ఉంటుంది, ప్రస్తుతం పార్లమెంటులో 543 సీట్లు ఉన్నాయని ఇవి పునర్విభజన జరిగితే 848 సీట్లకు పెరుగుతాయని మీడియా సమాచారం.

దక్షిణాది 5 రాష్ట్రాలలో కలిపి అదనంగా 40 సీట్లు వచ్చి చేరతాయి. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 63 సీట్లు, బీహార్‌లో 39 సీట్లు కలుస్తాయి. అంటే ఆయా రాష్ట్రాలలో నియోజక వర్గాల సీట్లలో తేడాలుంటాయి. దక్షిణాది రాష్ట్రాలలోని ప్రభుత్వాలు పునర్విభజనను గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి.

> **1976లో రాజ్యాంగ సవరణను చేశారు. అనంతరం వాజపేయి ప్రభుత్వంలో 2001 లో సవరణ జరిగింది. 1981, 1991, 2001 దశాబ్దాలలో జనాభా గణన జరగలేదు. అలాగే పునర్విభజన కోసం కమిషన్లు ఏర్పాటు చేయలేదు. రాజ్యాంగ అంశాల ప్రకారం 2026 లో నియోజక వర్గాల పునర్విభజన జరగవలసి ఉంది. జనాభా గణన సైతం జరగవలసి ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన 2026లో జరపడం కష్టమవుతుంది.**

దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలను హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రస్తావిస్తూ తాజా జనాభా ఆధారంగా దక్షిణాది రాష్ట్రాలు సీట్ల సంఖ్యను కోల్పోవని చెబుతున్నారు. దామాషా పద్ధతి ప్రకారం అదనంగా సీట్లు వస్తాయని అమిత్‌షా అంటున్నారు. అయితే ఇది వాస్తవమా కాదా అనేది నిర్ధారణ కావలసి ఉంటుంది. జనాభా గణన జరిగి తాజా జనాభా సంఖ్య నిర్ధారణ కావాలి. దేశ ఉత్తరాది రాష్ట్రాలలో నియోజక వర్గాల సంఖ్య తరతమ భేదాలుగా ఉంటుందని ఆయన చెబుతున్నారు. దామాషా జనాభా ప్రకారం నియోజక వర్గాలు లెక్కింపు మంచిదని అంటున్నారు. జనాభా వృద్ధి ప్రకారం కాకుండా దామాషా ప్రకారమే ఉత్తమం అని మంత్రి అంటున్నారు. ఉదాహరణకు మొత్తం పార్లమెంటు సీట్లు 800 కు పెరిగితే పార్లమెంట్‌కు ప్రస్తుతమున్న 543 పార్లమెంటు సీట్లలో తమిళనాడుకు 39 పార్లమెంటు సీట్లు ఉన్నాయి. ప్రస్తుత జనాభా ప్రకారం అదనంగా 18 సీట్లు చేరి మొత్తం 57 సీట్లు అవుతాయని చెబుతున్నారు. ఈ పద్ధతి ప్రకారం కేరళకు అదనంగా తొమ్మిది సీట్లు వస్తాయని ప్రస్తుతం ఉన్న 20 సీట్లు 29 కు పెరుగుతాయని తెలియజేస్తున్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం 80 సీట్లు ఉండగా 38 పెరిగి మొత్తం 118 అవుతాయి. బీహార్‌లో అదనంగా 25 సీట్లు పెరిగి మొత్తం 79 సీట్లు అవుతాయి. ఏ రాష్ట్రం కూడా సీట్లను కోల్పోదని హోంమంత్రి అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై చర్చించి ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన ప్రధాన రాజకీయ పార్టీలతో ఈ నెల 22వ తేదీన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో తీసుకునే వైఖరి పునర్విభజన సమస్య పరిష్కార వేగాన్ని నిర్దేశిస్తుంది.

త్రిపురలో 35 ఏళ్ల వామపక్ష పాలన

ఆర్వీ రామారావ్

త్రిపురలో వామపక్ష ఫ్రంట్ 1978 నుంచి 1988 మధ్య, 1993 నుంచి 2018 వరకు రెండు విడతలుగా మూడున్నర దశాబ్దాలు అధికారంలో కొనసాగింది. త్రిపురలో వామపక్ష ఫ్రంట్ అంటే సీపీఐ(ఎం), సీపీఐ, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్. 2018లో వామపక్ష ఫ్రంట్ త్రిపురలో బీజేపీ చేతిలో ఓడిపోయింది. అంత మాత్రం చేత వామపక్ష ఫ్రంట్‌కు ఇక భవిష్యత్తే లేదని చెప్పడానికి వీలు లేదు.

ఎందుకంటే 2018 ఎన్నికలలో బీజేపీకి 43 శాతం ఓట్లు వస్తే వామపక్ష ఫ్రంట్ 42.7 శాతం ఓట్లు సాధించింది. రెండు పార్టీల మధ్య వ్యత్యాసం కేవలం 0.3 శాతం ఓట్లు మాత్రమే. త్రిపురలో వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం స్థానిక స్వపరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయడానికి చట్టం తీసుకొచ్చింది. కోక్ బొరోక్ భాషకు అధికార భాషా స్థాయి కల్పించింది. స్వయం ప్రతిపత్తి గల త్రిపుర గిరిజన ప్రాంతాల జిల్లా మండలి ఏర్పాటు చేసింది.

2011లో బెంగాల్‌లో వామపక్ష ఫ్రంట్ ఓడిపోయిన తరవాత 2018లో త్రిపురలో ఓడిపోవడం కమ్యూనిస్టు రాజకీయాలకు పెద్ద విఘాతం కిందే లెక్క. ఎందుకంటే బెంగాల్‌లో ప్రాంతీయ పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్ గెలిచినా అది వామపక్ష ఫ్రంట్ సిద్ధాంతం మీద విజయం కాదు. కానీ త్రిపురలో బీజేపీ చేతిలో వామపక్ష ఫ్రంట్ ఓడిపోవడం సైద్ధాంతికంగా పెద్ద ఎదురు దెబ్బ కిందే లెక్క.

1988లో త్రిపుర శాసనసభ ఎన్నికలు జరగడానికి ముందు అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ త్రిపురలో జాతీయ వలంటీర్ల తిరుగుబాటును వామపక్ష ప్రభుత్వం ఆపలేక పోయింది అని ఆరోపించారు. అప్పుడు కాంగ్రెస్, టి.యు.జె.ఎస్. కూటమి విజయం సాధించింది. త్రిపుర రాష్ట్రం మొత్తాన్ని రాజీవ్‌గాంధీ కల్లోలిత ప్రాంతంగా ప్రకటించారు. కాంగ్రెస్ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం వామపక్ష ఫ్రంట్ మీద విరుచుకు పడింది. రెండు వేల మంది వామపక్ష ఫ్రంట్ కార్యకర్తల మీద కేసులు మోపారు. మరో 7,000 మందిపై అరెస్టు వారెంట్లు జారీ చేసింది. 2000 సంవత్సరంలో టి.టి.ఎ.ఎ.డి.సి. (త్రిపుర స్వయం ప్రతిపత్తిగల త్రిపుర గిరిజన ప్రాంతాల మండలి)లో వామపక్ష ఫ్రంట్ ఓడిపోయింది. త్రిపుర మూలవాసుల ఫ్రంట్ గెలిచింది. కానీ 2005లో వామపక్ష ఫ్రంట్ మళ్లీ ఈ మండలిపై ఆధిపత్యం సంపాదించింది. 1978 నుంచి 1988 దాకా త్రిపుర ముఖ్యమంత్రిగా ఉన్న నృపేన్ చక్రవర్తి, 1993లో ముఖ్యమంత్రి అయిన దశరథ దేవ్, 1998 నుంచి 2018 దాకా నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న మాణిక్ సర్కార్ త్రిపురలో వామపక్ష ఫ్రంట్ ను బలోపేతం చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు.

మాణిక్ సర్కార్


నృపేన్ చక్రవర్తి

మార్కెట్‌లోకి ఊబకాయం, మధుమేహం ఔషధం

న్యూఢిల్లీ: ఊబకాయం, మధుమేహంతో రోగులకు ఊరట కలిగేలా భారత్‌లో తొలిసారిగా ఔషధాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఎలీ లిల్లీ సంస్థ వెల్లడించింది. మౌంజారో బ్రాండ్ పేరుతో మార్కెట్లో విడుదల చేసినట్లు తెలిపింది. ఇందుకు సంబంధించి కేంద్ర ఔషధ ప్రామాణిక నియంత్రణ సంస్థ అనుమతి లభించిందని పేర్కొంది. మౌంజారో సింగిల్ డోసు బాటిల్‌లో లభిస్తుంది. 2.5 మి.గ్రా ధర రూ.3500 కాగా... 5 మి.గ్రా రూ.4375 ఉన్నట్లు తెలుస్తోంది. మధుమేహం, బరువు తగ్గించే చికిత్సలో ఉపయోగించే ఈ మౌంజారో ఔషధం టిర్జెపటైడ్ పేరుతో బ్రిటన్, యూరప్ దేశాల్లో ఇప్పటికే అందుబాటులో ఉంది. అమెరికాలో మాత్రం జెప్‌బౌండ్ పేరుతో విక్రయిస్తున్నారు. భారత్‌లో మాత్రం ఇదే మొదటిసారి. జీఐపీ (గ్లూకోజ్ ఆధారిత ఇన్సులినోట్రోపిక్ పోలిపెప్టైడ్), జీఎల్‌పీ-1 (గ్లూకాగాన్ మాదిరి పెప్టైడ్) హార్మోన్ గ్రాహకాలను ఉత్తేజపరచడం ద్వారా మౌంజారో పనిచేస్తుందని నిపుణులు వెల్లడించారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో ఊబకాయం, అధికబరువు, టైప్-2 మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు భారీగా పెరుగుతున్నాయి. కేవలం మధుమేహం, ఊబకాయం సమస్యలు ఎదుర్కొంటున్న వారి సంఖ్య దేశంలో దాదాపు 10 కోట్లు ఉన్నట్లు అంచనా. అధిక బరువుతో మధుమేహం ముప్పు పొంచివుండగా... హైపర్‌టెన్షన్, హృద్రోగ సమస్యలు, నిద్రలేమి వంటి దాదాపు 200 రకాల ఆరోగ్య సమస్యలతో ఇవి ముడిపడి ఉన్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ప్రతిపక్షం వినూత్న నిరసన

- టీషర్టులపై నినాదాలతో కేంద్రంపై విమర్శలు
- డీలిమిటేషన్‌పై పోరాడి గెలుస్తామన్న డీఎంకే ఎంపీలు
- టీషర్టులు తీసేసి సభలోకి రావాలన్న స్పీకర్ బిర్లా

న్యూఢిల్లీ: ఎటువంటి చర్చ లేకపోయినప్పటికీ 'డిలిమిటేషన్' అంశం పార్లమెంటును కుదిపేసింది. ప్రతిపక్ష ఎంపీల నిరసనల నడుమ లోక్‌సభ గురువారం అనేకమార్లు వాయిదా పడింది. అనేక మంది ప్రతిపక్ష ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నినాదాలు రాసిన టీ-షర్టులు ధరించి సభలోకి ప్రవేశించారు. ఈ తరుణంలో స్పీకర్ ఓం బిర్లా నిరసన తెలుపుతున్న ఎంపీలను మందలిం చారు. సభ సరిగ్గా పనిచేయడానికి వారు ఇష్టపడితే టీ-షర్టులు తీసివేయాలని కోరారు. "కొంతమంది సభ్యులు సభ గౌరవం, పవిత్రతను కాపాడుకోవడం లేదు" అని బిర్లా అన్నారు, టీ-షర్టులు ధరించడం పార్లమెంటరీ నియమాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. కాగా టీషర్టులు ధరించిన ప్రతిపక్ష సభ్యుల్లో ఎక్కువమంది డీఎంకేకి చెందిన ఎంపీలు. నియోజవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై కేంద్ర వైఖరిని వ్యతిరేకిస్తూ నినాదాలు ముద్రించిన తెల్లని టీషర్టులు ధరించి నిరసన కొనసాగించారు. 'పునర్విభజన న్యాయబద్ధంగా జరగాలి. తమిళనాడు పోరాడుతుంది. తమిళనాడు గెలుస్తుంది' అనే నినాదాలు టీ షర్టులపై రాసి ఉన్నాయి. 'నిబంధనలు, విధానాలతో సభలు నిర్వహిస్తారు. సభ్యులు హుందాగా వ్యవహరించి సభ గౌరవాన్ని కాపాడుకోవాలి. కానీ, ప్రతిపక్ష పార్టీలోని కొంతమంది ఎంపీలు నిబంధనలు పాటించడం లేదు. ఇది సరైనది కాదు. ఎంత పెద్ద నాయకుడైనా సభ గౌరవాన్ని తగ్గించే ఇలాంటి దుస్తులు ధరించడం ఆమోదయోగ్యం కాదు' అని ఓం బిర్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభను మధ్యాహ్నానికి వాయిదా వేస్తూ... సభ్యులు బయటకు వెళ్లి దుస్తులు మార్చుకుని రావాలని సూచించారు. సభలో ఎలా ప్రవర్తించాలో తెలుసుకోవడానికి పార్లమెంటు నియమం 349 చదవమని కూడా స్పీకర్ ఎంపీలను కోరారు. ఓం బిర్లా మొదట ఈ అంశంపై సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు స్పీకర్ స్థానంలో ఉన్న తెలుగుదేశం పార్టీ సభ్యుడు కృష్ణ ప్రసాద్ తెన్నేటి మధ్యాహ్నం 2 గంటల వరకు సభా కార్యకలాపాలను వాయిదా వేశారు.

కాగా కనిమొళి, టి.శివతో సహా డిఎంకే ఎంపీలు పార్లమెంటు వెలుపల నిరసన తెలిపారు. పధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రం, దక్షిణాది రాష్ట్రాలు... ముఖ్యంగా తమిళనాడు మధ్య, భాషా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో 'డీ లిమిటేషన్' అంశం వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది.

ఒకటి నుంచి మార్పులు ఇవే...

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో మధ్య తరగతి వారికి ఆదాయపు పన్నులో భారీ ఉపశమనంతో పాటు అనేక నియమాలలో కీలక మార్పులు చేశారు. ఇవి ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి అంటే 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఈ మార్పులో పన్ను మినహాయింపుతోపాటు మూలం పన్ను వసూలు కోసం కొత్త నియమాలు సైతం ఉన్నాయి. సీనియర్ సిటిజన్లకు టీడీఎస్ తగ్గింపును రెట్టింపు చేసింది. గతంలో ఇది రూ.50 వేలుగా ఉండేది. ప్రస్తుతం అది రూ.లక్షకు చేరింది. ప్రస్తుతం ఇది గొప్ప ఉపశమనంగా మారింది. అదే సమయంలో ఇంటి యజమానులకు పెద్ద ఉపశమనం లభించింది.

అద్దె ఆదాయంపై టీడీఎస్ మినహాయింపు పరిమితిని ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.2.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచారు. విదేశాల నుంచి లావాదేవీలు చేసే వారికి ఆర్‌బీఐ సరళీకృత రెమిటెన్స్ పథకానికి టీసీఎస్ తగ్గింపు పరిమితిని కూడా పెంచారు. గతంలో విదేశాల నుంచి జరిగే లావాదేవీలపై టీసీఎస్‌ను రూ.7 లక్షలకు తగ్గించే వారు. అయితే ప్రస్తుతం దానిని రూ.10 లక్షలకు పెంచారు. నిర్దిష్ట ఆర్థిక సంస్థల నుంచి విద్యా రుణంపై టీసీఎస్ మినహాయింపు తొలగించారు. గతంలో రూ.7 లక్షల కంటే ఎక్కువ విద్యా రుణాలపై 0.5 శాతం టీసీఎస్ తగ్గించబడేది. అయితే రూ.7 లక్షల కంటే ఎక్కువ విద్యా లావాదేవీలపై 5 శాతం టీసీఎస్ తగ్గించబడింది. డివిడెండ్ ఆదాయంపై టీడీఎస్ పరిమితిని రూ.5,000 నుంచి రూ.10,000కి పెంచారు. మ్యూచువల్ ఫండ్ యూనిట్ల నుంచి వచ్చే ఆదాయంపై టీడీఎస్ పరిమితిని కూడా ఆర్థిక సంవత్సరానికి రూ.5,000 నుంచి రూ.10,000కి పెంచారు. ఇది కాకుండా బహుమతికి టీడీఎస్‌ను రూ.10,000కు పెంచారు. చమురు కంపెనీలు ప్రతి నెల మొదటి తేదీన ఎల్‌పీజీ ధరలను సమీక్షిస్తాయి. ఏప్రిల్ 1వ తేదీ తెల్లవారుజామున సిలిండర్ ధరలలో మార్పులు సంభవించే అవకాశముంది. ప్రతి నెలా మొదటి తేదీన, చమురు కంపెనీలు విమాన ఇంధనం ధరలలో అంటే ఎయిర్ టర్బైన్ ఇంధనం (ఏటీఎఫ్), సీఎన్‌జీ-పీఎన్‌జీ ధరలలో సైతం కొన్ని మార్పులు తీసుకురానున్నాయి.

మద్యం కుంభకోణంపై హైకోర్టుకు స్టాలిన్ సర్కార్

చెన్నై: తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ (టాస్మాక్) చెన్నై ప్రధాన కార్యాలయంలో మార్చి 6-8 తేదీలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన సోదాలకు వ్యతిరేకంగా టాస్మాక్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద చర్యను నిలిపివేయాలని, టాస్మాక్ అధికారులు, కార్మికులను వేధించకుండా ఉండాలని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, ఎన్.సెంథిల్‌కుమార్‌ల ధర్మాసనం ముందు ఈ పిటిషన్లు విచారణకు రానున్నాయి. మొత్తంగా రిజిస్ట్రీకి మూడు రిట్ పిటిషన్లు వచ్చాయి. టాస్మాక్, రాష్ట్ర ప్రభుత్వం కలిసి మొదటి రిట్ పిటిషన్‌ను దాఖలు చేయగా... ఆ తర్వాత మిగిలిన రెండూ దాఖలయ్యాయి. ముందుగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందకుండా రాష్ట్ర పరిధిలో మనీలాండరింగ్ నేరాలను పరిశీలించే అధికారం ఈడీకి లేదని... ఇది సమాఖ్యవాదం, అధికారాల విభజన యొక్క ప్రధాన ఆలోచనలకు విరుద్ధంగా ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే దర్యాప్తుకు సంబంధించిన ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) కాపీని అందించేలా ఈడీని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోర్టును అభ్యర్థించింది.

చట్ట విరుద్ధంగా కంటెంట్ తొలగింపు

- కేంద్ర ప్రభుత్వంపై 'ఎక్స్' దావా
- నిబంధనలు పాటించాల్సిందే: కేంద్రం

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఎలాన్ మస్క్ నేతృత్వంలోని సామాజిక మాధ్యమం 'ఎక్స్' భారత ప్రభుత్వంపై దావా వేసింది. చట్టవిరుద్ధంగా కంటెంట్‌ను నియంత్రిస్తోందని, ఏకపక్షంగా సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని కేంద్రంపై ఆరోపణలు చేసింది. ఈ మేరకు కర్నాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఐటీ చట్టం, సహ్యోగ్ పోర్టల్ నిబంధనలు తమకున్న చట్టబద్ధ రక్షణలను ఉల్లంఘించేలా ఉన్నాయని, ఇది తమపై అనధికారికంగా సెన్సార్ చేయడం కిందికే వస్తుందని ఎక్స్ సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3)(ఎ)ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. ఐటీ చట్టం ప్రకారం... బ్లాక్ చేసిన కంటెంట్‌ను తొలగించకపోతే, ఎక్స్ తన చట్టబద్ధమైన రక్షణ కోల్పోయే అవకాశం ఉంటుంది. అయితే ఈ సెక్షన్ కింద కంటెంట్ బ్లాక్ చేసే అధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వలేదని ఎక్స్ వాదిస్తోంది. సెక్షన్ 69(ఎ)ని పక్కదారి పట్టించడానికి అధికారులు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. దేశంలో అల్లర్లు, ఘర్షణలకు కారణమయ్యే పోస్టులు, పూర్తి వివరాలు లేకుండా సృష్టించిన ఖాతాలపై నియంత్రణ విధించేందుకు సెక్షన్ 69-ఎ ప్రకారం కేంద్రానికి అధికారం ఉంటుంది. అదేసమయంలో సెక్షన్ 79(3)(ఎ) స్పష్టమైన నియమాలు, తనిఖీలు లేకుండా అధికారులు సమాచారాన్ని బ్లాక్ చేయడానికి అధికారులు అనుమతి ఇస్తున్నారని 'ఎక్స్' తన పిటిషన్‌లో ప్రస్తావించిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇది విస్తృతమైన సెన్సార్‌షిప్‌నకు దారితీస్తోందని విమర్శలు చేసింది.

చట్టప్రకారం ముందుకెళతాం: ప్రభుత్వ వర్గాలు

'ఎక్స్' దావాపై కేంద్ర ప్రభుత్వవర్గాల నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వం చట్టాన్ని అనుసరించి ముందుకెళ్తుందని, సోషల్ మీడియా సంస్థలు నిబంధనలు పాటించాల్సిందేనని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నత అధికారి ఒకరు ఆంగ్ల మీడియా ప్రతినిధితో వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో ఆటవిక పాలన: రాబ్డీ దేవి

పాట్నా: రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, నేరాలు-ఘోరాలు పేట్రేగిపోయాయని, ఆటవిక పాలన కొనసాగుతోందని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) నాయకురాలు రాబ్డీ దేవి వ్యాఖ్యానించారు. బీహార్‌లోని నితీశ్ సర్కార్ విపక్షాల గళాన్ని అణచివేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో నిత్యం అత్యాచారాలు, దోపిడీలు, లూటీలు జరుగుతున్నా నితీశ్ కుమార్ ప్రభుత్వానికి పట్టడం లేదని దుయ్యబట్టారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి, తన భర్త లాలూ ప్రసాద్ యాదవ్ పేరును ప్రస్తావిస్తూ అమర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో అత్యాచారాలు, దొమ్మీలు జరుగుతున్నా అసెంబ్లీలో వీటిని ప్రస్తావించరు. ప్రజల సమస్యలపై గళం వినిపించకుండా మమ్మల్ని అడ్డుకుంటారు. ప్రజల తరపున మాట్లాడకుండా మేము ఏం చేయాలి?' అని రాబ్డీ దేవి నిలదీశారు. 'ఆయన (నితీశ్) మీ భర్త... మీ భర్త అంటూనే ఉన్నారు. మేము ప్రభుత్వానికి సహకరిస్తాం కానీ మా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా అధికార పక్షం తప్పించుకుంటోంది' అని ఆమె దుయ్యబట్టారు. ఈడీ తనను అడుగున్న ప్రశ్నలను మీరు (మీడియా) నితీశ్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ప్రధాని మోదీని అడగాలన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని రాబ్డీ దేవి విమర్శించారు. సుపరిపాలనకు కేరాఫ్‌గా చెప్పుకునే ఈ ప్రభుత్వం... నిత్యం అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు జరుగుతున్నా వాటిని ఆపలేకపోతోంది. హోలీ వేళ రెండు రోజుల్లో 22 హత్యలు జరిగాయి కానీ ఎలాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోలేదు' అని రాబ్డీ దేవి వ్యాఖ్యానించారు. 'రెండు రోజుల్లో 22 హత్యలు జరిగాయంటే ఒక రోజులో ఎన్ని జరుగుతున్నాయి... రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారు' అని మండిపడ్డారు. 'ఇది మంగల్‌రాజ్... ఇక్కడ ఎవరూ సురక్షితం' కాదు అని ఆమె అన్నారు. రాబ్డీ దేవి అంతకుముందు శాసనమండలి వద్ద ఆర్‌జేడీ ఎమ్మెల్యేలతో కలిసి ధర్నా చేశారు. రాష్ట్రంలోని పాలన వైఫల్యాలను ఎండగట్టారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

జైపూర్: వివాహేతర సంబంధాలను కప్పిపుచ్చుకోవడానికి జరుగుతోన్న హత్యలు కలవరం సృష్టిస్తున్నాయి. ఒకవైపు ఉత్తరప్రదేశ్‌లో మర్చంట్ నేవీ అధికారి హత్య ఘటన కలకలం రేపుతుండగా... రాజస్థాన్‌లోని జైపూర్‌లో అదే తరహా ఘటన వెలుగుచూసింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... జైపూర్‌కు చెందిన నిందితురాలు గోపాలి దేవికి ఐదేళ్లుగా దీన్‌దయాళ్ కుశ్వాహాతో వివాహేతర సంబంధం ఉంది. తాను ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నానని భర్త ధన్నాలాల్ సైనీకి చెప్పి... ప్రియుడిని కలుసుకోవడానికి వెళ్లేది. అయితే ఆమె మాటలపై అనుమానం వచ్చిన సైనీ... ఏ ఫ్యాక్టరీలో పనిచేస్తుందో తెలుసుకునేందుకు గత శనివారం ఆమెను అనుసరించాడు. అతడు వెళ్లి చూసేసరికి గోపాలి దేవి, కుశ్వాహా కలిసి ఉన్నారు. వారి వివాహేతర బంధం బయటపడింది. దాంతో ఆగ్రహానికి గురైన సైనీ వారితో గొడవపడ్డాడు. దీంతో నిందితులు అతడిని పైఫ్లోర్‌కు తీసుకెళ్లి... ఐరన్ పైప్‌తో దాడి చేశారు. తాడుతో గొంతు నులిమి చంపేశారు. ఆ మృతదేహాన్ని ఒక బస్తాలో చుట్టి... నిర్మానుష్య ప్రాంతంలో పడేయాలని నిర్ణయించుకున్నారు. కుశ్వాహా బైక్ మీద ఆ బస్తాను తరలించాడు. ఆ దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. రింగ్‌రోడ్ సమీపంలో ఆ మృతదేహాన్ని దింపి... నిప్పంటించారు. మృతదేహం కాలుతుండగా అటువైపు ఒక కారురావడంతో భయపడిన నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. అప్పటికి మృతదేహం సగమే కాలింది. తర్వాత దానిని గుర్తించి కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు రోజుల తర్వాత అది ఎవరిదో నిర్ధారణ అయింది. ఆ దిశగా విచారణ జరపగా నిందితులు నేరాన్ని అంగీకరించారు. ప్రస్తుతం గోపాలిని అరెస్టు చేయగా.. కుశ్వాహా కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అత్యాచారం కేసులో 40 ఏళ్లకు న్యాయం

న్యూఢిల్లీ: నాలుగు దశాబ్దాల కింద అత్యాచారానికి గురైన ఓ బాధితురాలికి ఎట్టకేలకు న్యాయం లభించింది. ఈ కేసులో నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా కొట్టివేసింది. నిందితుడికి జైలు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చింది. దీంతో బాధితురాలు, ఆమె కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. కేసు వివరాలివీ... రాజస్థాన్‌కు చెందిన ఓ అమ్మాయిపై 1986లో 21 ఏళ్ల వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటికి ఆమె మైనర్. బాధితురాలి కుటుంబం ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు 1987 నవంబరులో అతడిని దోషిగా తేల్చి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. అనంతరం ఈ కేసు రాజస్థాన్ హైకోర్టుకు చేరింది. దీనిపై సుదీర్ఘకాలం విచారణ జరిగిన తర్వాత నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ 2013లో ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. బాధితురాలు సహా ప్రాసిక్యూషన్ నుంచి బలమైన సాక్ష్యాధారాలు లేనందున అతడిపై అభియోగాలను కొట్టివేస్తున్నట్లు కోర్టు తెలిపింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ బాధితురాలి కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై తాజాగా విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం... కింది కోర్టుల్లో విచారణ జరిగిన తీరుపై అసహనం వ్యక్తంచేసింది. 'బాధితురాలు, ఆమె కుటుంబం తమ జీవితంలో చోటుచేసుకున్న ఈ భయానక అధ్యాయానికి ముగింపు పలికేందుకు నాలుగు దశాబ్దాలు ఎదురుచూడాల్సి రావడం బాధాకరం. విచారణ సమయంలో బాధితురాలు కన్నీళ్లు పెట్టుకోవడం తప్ప ఏం జరిగిందో చెప్పలేకపోవడం నిజమే. కానీ, ఇలాంటి పరిణామాలు నిందితుడికి అనుకూలంగా మారకూడదు. ఘటన కారణంగా మానసిక కుంగుబాటుకు లోనవడం వల్లే బాధితురాలు మౌనంగా ఉండిపోయింది. ఆమె వాంగ్మూలం ఆధారంగా మొత్తం విచారణ భారాన్ని బాధితురాలి భుజాన వేయడం సరికాదు' అని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారం వ్యక్తంచేసింది. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనబెట్టింది. నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. అతడు నాలుగు వారాల్లోపు కోర్టులో లొంగిపోయి శిక్ష అనుభవించాలని ఆదేశించింది.

మాట నోట జారితే... పదవి ఊడింది

చెన్నై: పార్టీ పదవి చేపట్టిన 24 రోజుల్లోనే డీఎంకే ధర్మపురి తూర్పు జిల్లా కార్యదర్శి పి.ధర్మసెల్వన్‌ను ఆ పదవి నుంచి అధిష్టానం తొలగించింది. పెన్నగరం శాసనసభ నియోజకవర్గ పరిధిలో కూత్తంపాడికి చెందిన ధర్మ సెల్వన్ డీఎంకేలో ప్రధాన కార్యాచరణ మండలి సభ్యుడిగా, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. గత నెల 22న ధర్మపురి తూర్పు జిల్లా కార్య దర్శిగా ఉన్న తడంగం సుబ్రమణియ ంను ఆ పదవి నుంచి తొలగించి, ధర్మసెల్వన్‌ను డీఎంకే ప్రధాన కార్యదర్శి, నీటి వనరుల శాఖ మంత్రి దురైమురుగన్ నియమించారు. ధర్మసెల్వన్ జిల్లా కార్యదర్శి పదవి చేపట్టిన వారం రోజులకే ధర్మపురి, పెన్నాగరం శాసనసభ నియోజకవర్గాల్లో పార్టీకి, ప్రభుత్వానికి కళంకం తెచ్చేలా ప్రవర్తించారు. జిల్లాలో కలెక్టర్, ఎస్పీ ఇలా ఎంత పెద్ద అధికారి అయినా సరే తన మాటకు కట్టుబడి ఉండాలి అంటూ వెళ్లిన ప్రతిచోటా మాట్లాడారు. ఈ మాటలను ఎవరో సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.

ఈ విషయం తెలియగానే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పాలకపక్షంపై ధ్వజమెత్తారు.

కర్నాటక మంత్రులపై వలపు వల!

ఉన్నత స్థాయి విచారణకు ప్రభుత్వం ఆదేశాలు

బెంగళూరు: కొందరు సీనియర్ మంత్రులపై హనీ ట్రాపింగ్ యత్నాలు జరిగినట్లు కర్నాటక అసెంబ్లీలో గురువారం చర్చ జరిగింది. దీంతో ఈ వ్యవహారంలో ఉన్నత స్థాయి విచారణకు కర్నాటక ప్రభుత్వం ఆదేశాలివ్వనున్నది. తనను వలపు వలలో పడ వేసే ప్రయత్నాలు జరిగాయని మంత్రి కేఎన్ రాజన్న అసెంబ్లీకి వెల్లడించారు. పార్టీలకు అతీతంగా 48 మంది రాజకీయ నేతలు ఈ వలపు వలలో చిక్కుకున్నట్లు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజన్న సన్నిహితుడు. ఆయన హనీ ట్రాపింగ్‌ను ఓ వ్యాధిగా వర్ణిస్తూ, దీనిపై విచారణకు ఆదేశాలివ్వాలని పరమేశ్వరాను కోరారు. తొలుత మంత్రి సతీశ్ జర్కిహోళి కూడా తన కేబినెట్ సహచరులను వలస వలలో పడ వేసేందుకు రెండు విఫలయత్నాలు జరిగాయని తెలిపారు. అంతకుముందు బీజేపీ నేత పాటిల్ యత్నాల్ ఈ వ్యవహారాన్ని ప్రస్తావించారు. హనీ ట్రాపర్లు రాజన్నను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. దీంతో రాజన్న మాట్లాడుతూ తనను వలపు వలలో పడ వేసేందుకు ప్రయత్నాలు జరిగినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని, దర్యాప్తునకు ఆదేశాలిచ్చి, దీని వెనుకన్న ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు ఎవరో కనిపెట్టాలని కోరారు. 'సీడీలు, పెన్ డ్రైవ్‌లను తయారు చేసే ఫ్యాక్టరీ కర్నాటకలో ఉందని చాలా మంది అంటుంటారు. నాకున్న సమాచారం మేరకు 48 మందికి సంబంధించిన పెన్ డ్రైవ్‌లు (అసభ్య వీడియోలు) ఉన్నాయి' అని రాజన్న తెలిపారు. పరమేశ్వర స్పందిస్తూ 'ఇది అసెంబ్లీలోని ప్రతి సభ్యుడికి సంబంధించిన అంశం. అంతం పలకడం అవసరం. సభ్యుల గౌరవాన్ని, సభా మర్యాదను కాపాడటం మన కర్తవ్యం' అని అన్నారు. రాజన్న ఫిర్యాదు ఆధారంగా ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు ఇస్తానని పరమేశ్వర వెల్లడించారు.

కేంద్ర మంత్రి మేనల్లుడి హత్య

పాట్నా: కేంద్రమంత్రి నిత్యానందరాయ్ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన ఇద్దరు మేనల్లుళ్ల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బీహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన జగత్‌పూర్ గ్రామంలో వారి నివాసంలో గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. తాగునీటి విషయమై ఇద్దరి మధ్య వివాదం చెలరేగి... అది ఒకరి హత్యకు దారితీసిందని తెలిపాయి. 'జగత్‌పూర్ గ్రామంలో ఇద్దరు సోదరుల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయని మాకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకు న్నారు. అప్పటికే వారిలో ఒకరు మృతి చెందగా... మరొకరికి గాయాలయ్యాయి. వారి గొడవ ఆపేందుకు మధ్యలో వారి తల్లి వచ్చినట్లు తెలుస్తోంది. ఆమెకు బుల్లెట్ గాయం అయింది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది' అని పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు. కేంద్రమంత్రి నిత్యానందరాయ్‌కు బావ అయిన రఘునందన్ యాదవ్‌కు ఇద్దరు కుమారులు. వారు జైజిత్ యాదవ్, విశ్వజిత్ యాదవ్. వారింట్లో పనిచేసే సహాయకుడు సర్వ్ చేస్తోన్న సమయంలో తన చేతిని గ్లాసులో ముంచడమే వీరి గొడవకు కారణమని తెలుస్తోంది. ఆ గొడవ పెరిగి ఇద్దరు కాల్పులకు పాల్పడగా... విశ్వజిత్ ప్రాణాలు కోల్పోయాడు. ఎప్పటినుంచో ఈ అన్నదమ్ముల మధ్య సంబంధాలు సరిగా లేవని తెలుస్తోంది. సమాచారం.

సునీతా విలియమ్స్‌కు భారతరత్న

మమతా బెనర్జీ డిమాండ్

కోల్‌కతా: భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు భారతరత్న ఇవ్వాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా సునీతా విలియమ్స్‌ను భారత కుమార్తెగా మమత అభివర్ణించారు. తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో పరిశోధన కోసం అంకితభావంతో పని చేసిందని ప్రశంసించారు. అదేసమయంలో అసెంబ్లీలో సునీతా విలియమ్స్‌కు సభ్యులు అభినందనలు తెలిపారు. అసెంబ్లీలో మమత మాట్లాడుతూ సునీతా విలియమ్స్ అంతరిక్షంలో తొమ్మిది నెలల పాటు అంకిత భావంతో పనిచేసిందని ప్రశంసించారు. ఆమెను భారతరత్న పురస్కారంతో సత్కరించాలని డిమాండ్ చేశారు. రెస్క్యూ ఆపరేషన్ బృందాన్ని కూడా ప్రశంసించారు. సునీత క్షేమంగా భూమ్మీదకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. బుచ్ విల్మోర్, సునీత ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందేనన్నారు. తనకు అంతరిక్ష శాస్త్రం అంటే ఆసక్తేనన్నారు. వివిధ సమాచారాల ద్వారా వివరాలు తెలుసుకుంటానని చెప్పారు. సునీతా విలియమ్స్‌తో పాటు బుచ్ విల్మోర్ దాదాపు 286 రోజుల పాటు అంతరిక్షంలో ఉండిపోయారు. వాస్తవానికి వారం రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా... సాంకేతిక లోపంతో తిరిగి రాలేకపోయారు. బుధవారం సునీతా భూమ్మీద అడుగుపెట్టారు. చాలా ఉల్లాసంగా ఆమె కనిపించారు.

అసెంబ్లీలో నితీశ్ తాండవం

పాట్నా: వయస్సు దృష్ట్యా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ విపరీత ప్రవర్తనతో తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా మరోసారి ఆయన వార్తల్లోకెక్కారు. ప్రస్తుతం బీహార్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) సభ్యుడు సుగయ్ యాదవ్ గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సెల్‌ఫోన్ చూస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన ప్రశ్న అడిగారు. ఆ సభ్యుడు సెల్ ఫోన్ వినియోగించడాన్ని గమనించిన నితీశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సభలో సభ్యుడు మొబైల్ వాడడంపై ఆయన తీవ్ర అభ్యతరం వ్యక్తం చేశారు. సభలోకి మొబైల్ తీసుకు రాకూడదనే నిబంధన ఉందని నితీశ్‌కుమార్ గుర్తు చేశారు. సభలోకి సభ్యులు ఎవరు మొబైల్ తీసుకురాకుండా చర్యలు చేపట్టాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆయన కోరారు. గత పదేళ్లలో సెల్‌ఫోన్ వాడకం బాగా పెరిగిందన్నారు. సెల్‌ఫోన్ ఇలా వినియోగిస్తే.. భూమి త్వరలో నాశనం అవుతుందన్నారు.

సభకు ఎవరైనా మొబైల్ తీసుకువస్తే... నిర్దాక్షిణ్యంగా బయట పడేయాలని స్పీకర్‌కు సూచించారు. ఈ అంశంపై ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ తన సోషల్ మీడియా ఎక్స్ ద్వారా స్పందించారు. మొబైల్ ఫోన్ల వినియోగం వల్ల ప్రపంచం పదేళ్లలో నాశనం అవుతుందని నితీశ్ కుమార్ చెబుతున్నారని, అయితే పర్యావరణ పరిరక్షణ కోసం అసెంబ్లీని కాగిత రహితంగా ప్రభుత్వం మార్చిందని ఆయన గుర్తుచేశారు. సభలో సభ్యులు అడిగే ప్రశ్నలు... వాటికి సమాధానాలు ఇవ్వాలంటే సెల్‌ఫోన్ లేదా ట్యాబ్ వినియోగించాల్సి ఉందన్నారు.

ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రేపై కేసు నమోదు చేయండి

హైకోర్టును ఆశ్రయించిన దిశా సాలియన్ తండ్రి

ముంబై: ఐదేళ్ల క్రితం చనిపోయిన నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశ సాలియన్ కేసులో ఊహించని మలుపు తిరిగింది. తాజాగా శివసేన యూబీటీ ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే, ఇతరులపై కేసు నమోదు చేయాలని దిశ తండ్రి సతీశ్ సాలియన్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తెది ప్రమాదవశాత్తూ జరిగిన మరణం కాదని, ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టి, హతమార్చారని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే ... దిశ సాలియన్ జూన్ 8, 2020న ముంబైలోని మలాడ్ ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్ 14వ ఫ్లోర్ నుంచి కిందపడి చనిపోయింది. విచారణ చేపట్టిన పోలీసులు ప్రమాదవశాత్తూ మరణించినట్లు కేసు నమోదు చేశారు. సరిగ్గా ఆ ఘటన జరిగిన ఆరురోజుల తర్వాత బాంద్రాలోని తన ఫ్లాట్‌లో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అనుమానాదాస్పద స్థితిలో మరణించారు. దిశ సాలియన్, సుశాంత్ సింగ్ రోజుల వ్యవధిలో ఇద్దరూ అనుమానాస్పదంగా మరణించడంపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ప్రమాదవశాత్తూ పడి చనిపోయినట్లు తేల్చారు. పోలీసుల దర్యాప్తుపై దిశ తండ్రి సైతం సంతృప్తిని వ్యక్తం చేశారు. తమ కుమార్తె మరణంలో ఎలాంటి అనుమానం లేదని, కేసు దర్యాప్తుపై పూర్తిగా సంతృప్తిని వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే అనూహ్యంగా ఐదేళ్ల తర్వాత దిశ సాలియన్ కేసు ఊహించని మలుపు తిరిగింది. గురువారం దిశ తండ్రి సతీష్ సాలియన్ సంచలన ఆరోపణలు చేస్తూ బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

న్యాయస్థానంలోనే స్పందిస్తా: ఆదిత్య ఠాక్రే

ఆదిత్య ఠాక్రే స్పందిస్తూ తనపై వచ్చిన ఆరోపణలను కొట్టిపారేశారు. 'నాపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. నా పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేందుకు ఐదేళ్లుగా ప్రయత్నం జరుగుతోంది. ఈ అంశం కోర్టు పరిధిలో ఉంటే.. నేను న్యాయస్థానంలోనే స్పందిస్తాను' అని అన్నారు

విశాలాంధ్ర హైదరాబాద్

యువతకు మల్లారెడ్డి ఆదర్శనీయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మాజీ మంత్రి మల్లారెడ్డి నేటి యువతరానికి ఎంతో ఆదర్శమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద, సినీ నటుడు విజయ్ దేవర కొండ పేర్కొన్నారు.నియోజకవర్గం 129 - సూరారం డివిజన్ సూరార మల్లారెడ్డి విశ్వవిద్యాపీట్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఏకత్వ 2025" వార్షికోత్సవ వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మల్లారెడ్డి కళాశాలల అధినేత, ఎమ్మెల్యే మల్లారెడ్డి, అర్జున్ రెడ్డి ఫేమ్, సినీ హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి.అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తో పాటుగా ఇతర ముఖ్య అతిథులు మాట్లాడుతూ పట్టుదల, స్వయంకృషితో ఎదిగిన మల్లారెడ్డి నేటి యువతరానికి ఎంతో ఆదర్శమని, విద్యార్థులు విద్యతోపాటు ఇతర రంగాలలో రాణించేలా వారిని ప్రోత్సహిస్తున్న మల్లారెడ్డి విశ్వ విద్యాపీట్ సంస్థకు వారి అభినందనలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ప్రాంతానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రీతి రెడ్డి, సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజారాజ్యం పార్టీకి క్యారం బోర్డు గుర్తు కేటాయింపు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలంగాణ ప్రజారాజ్యం పార్టీకి క్యారం బోర్డు ఎన్నికల గుర్తు కేటాయించిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ తెలిపారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందే విధంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు క్యారం బోర్డు గుర్తును ఆదరించి ప్రజారాజ్యం పార్టీకి అండగా నిలవాలన్నారు. త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో క్యారం బోర్డు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు.

ఆరెకపూడి గాంధీ చొరవతో కాలనీకి ఆర్టీసీ బస్సు సర్వీసులు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్? కాలనీకి నూత ఆర్టీసీ బస్సు సర్వీస్లను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా గోకుల్ ప్లాట్స్? కాలనీ వాసులు కోరుతున్న విధంగా ఈ రోజు ఆర్టీసీ బస్సు సర్వీస్ ను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరంగా ఉంది అని , గోకుల్ ప్లాట్స్? కాలనీ వాసుల చిరకాల కోరిక నెరవేరింది అని ఎన్నో ఏండ్ల కోరిక నేటి తో తిరినది అని , గోకుల్ ప్లాట్స్? కాలనీ వాసులు ,పరిసర ప్రాంత ప్రజలు ఈ చక్కటి సదావకాశంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.గోకుల్ ప్లాట్స్? కాలనీ నుండి సికింద్రాబాద్ వరకు ఒక బస్సు సర్వీస్ మరియు మెహిదీపట్నం వరకు మరొక బసు సర్వీస్ నడుచునని మొత్తము రెండు బస్సు సర్వీసులు నడుచునని తెలిపారు.ఒక్క రోజు కూడా బస్సు సర్వీస్ అగకూడదని, పేద ,మధ్యతరగతి ప్రజలు, విద్యార్థులు, చిరు వ్యాపారస్థులు నిత్యం ప్రయాణం చేస్తారు అని , ఈ బసు సర్వీస్ లతో వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం, సుఖవంతం అని ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేరవేయుటలో ముఖ్యభూమిక పోషిస్తుంది అని ,ఆర్టీసీ ప్రయాణము సురక్షితం అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంఆర్పీఎస్ కో-ఆర్డినేటర్‌గా నాగరాజు

విశాలాంధ్ర-కాప్రా : ఉప్పల్ నియోజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) కో -ఆర్డినేటర్‌గా నాచారం డివి జన్ యువ నాయకుడు చిదు రాల యాకస్వామి ఏర్పుల నాగరాజు నియమితుల య్యారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కా జిగిరి అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సంద ర్భంగా కాకా స్వామి, నాగరాజులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవి ఇచ్చిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, ప్రణయ్ కుమార్‌లకు కృత జ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తీసుకెళ్లి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు.

జూన్‌లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి: మంత్రి

విశాలాంధ్ర-హైదరాబాద్ : కంటోన్మెంట్ నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు జూన్ మాసంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం కంటోన్మెంట్‌లో ఆశా ఆఫీసర్స్ కాలనీ నుండి రైల్వే స్టేషన్ వరకు రూ 1.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంటోన్మెంట్ లో 9.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకుంటున్నామని వీటిని జూన్ మాసం లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కంటోన్మెంట్ నియోజవర్గంలోపెండింగ్ లో ఉన్న కమ్యూనిటీ హాల్స్ ,తాగునీటి సమస్య ,జి హెచ్ ఎం సి లోకి తీసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. ఇతర సమస్యలు శాసన సభ వేదికగా ముఖ్యమంత్రి దగ్గర ఇతర మంత్రుల దగ్గర ఎమ్మెల్యే గణేష్ గారు చర్చిస్తారన్నారు. నియోజవర్గ సమస్యలు పట్టించుకున్నప్పుడే మన పనికి సార్థకత ఉంటుందన్నారు. ఆ పనిలో ఎమ్మెల్యే గణేష్ ముందుంటారు. కంటోన్మెంట్ నియోజకవర్గ సమస్యలు ఎప్పటికీ కప్పుడు పరిష్కారం తీసుకుంటున్నారని అన్నారు. హైదరాబాద్ మున్సిపాల్టీ ,మెట్రో వాటర్ వర్క్స్ నుండి ఎన్ని నీరు కావలన్న వాటర్ ఇవ్వడానికి రెడీ గా ఉన్నామని తెలిపారు.ఇది కంటోన్మెంట్ లో ఉండడం వల్ల స్టోరేజ్ కి తక్కువగా అవకాశం ఉందని తెలిపారు.మెట్రో వాటర్ వర్క్స్ ,కంటోన్మెంట్ అధికారులు కలిసి సమస్య పరిష్కారం చేద్దామని అన్నారు. ఎమ్మెల్యే గణేష్ అడిగిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి గారి తరుపున 5 కోట్లు మంజూరు చేస్తున్నమని తెలిపారు. కంటోన్మెంట్లో తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. నేను చాలా సంవత్సరాలు కంటోన్మెంట్ లో ఉండేది..మా పిల్లలు ఇక్కడే చదువుకున్నారు ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజా పాలన ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నమని ఈ నియోజకవర్గం లో 3500 ఇళ్లు మంజూరు చేశామని అన్నారు.ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,సన్న వడ్ల కు 500 బోనస్ ,500 గ్యాస్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం శుక్రవారం నుండి పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయి హైదరాబాద్ జిల్లాల్లో 358 కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి పరీక్షలు జీవితంలో కీలకం,తల్లిదండ్రులు టి వి సీరియల్ లు బంద్ చేయండి అన్నారు. పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం పక్షాన శుభాకాంక్షలు తెలుపుతున్నాను అందరూ పరీక్షలు బాగా రాయాలి.. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే శ్రీగణేశ్,కలెక్టర్ అనుదీప్ దురశెట్టి , కంటోన్మెంట్ జాయింట్ సీఈవో పల్లవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి తోటపల్లి శంకర్

విశాలాంధ్ర - కీసర : సమాజ మనుగడలో ప్రధాన భూమిక పోషిస్తున్న వ్యవసాయ రంగాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని సిపిఐ మేడ్చెల్ నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకరు అన్నారు. గురువారం కీసర మండల కేంద్రంలోని చీర్యాల గ్రామపంచాయతీ లో జరిగిన రైతు సంఘం మండల మహాసభ జరిగింది. ఈ మహాసభ లో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు జంగయ్య అధ్యక్షత వహించారు. ఈ మహాసభలు ముఖ్యఅతిథిగా పాల్గొన్న తోటపల్లి శంకర్ మాట్లాడుతూ.. నేటి పాలకులు కార్పోరేటు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు సంక్షేమాన్ని విస్మరించడం ఆందోళన కలిగిస్తుందని వ్యక్తం చేశారు 70 శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి ప్రజలు జీవిస్తున్న అప్పటికి రైతులువేసే ఉత్పత్తులతో మనిషి బ్రతుకుతున్నప్పటికీ పాలకులు మాత్రం రైతుల వ్యవసాయంపై పట్టింపు లేరన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలను మధ్య దళారులు వ్యాపారులు సిండికేట్ ఐ దోచుకుంటున్నారని మండిపడ్డారు. మేడ్చల్ జిల్లా రైతు సంఘంసంగం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు మాట్లాడుతూ...పండించిన పంటలకు సరైన ధర రాక తెచ్చుకున్న అప్పులు తీరక అనేక అవస్థలు పడుతున్న రైతుల గుసలు ప్రభుత్వాలకు వినిపించ లేదని అన్నారు. రైతుల భూములను కార్పోటు శక్తులకు కట్టబెట్టి విధంగా చట్టాలను రూపొందించి తమ నైజాన్ని తేట తెల్లం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నా సన్న కారు రైతుల వ్యవసాయానికి ప్రోత్సాహకాలు ప్రకటించ కుండ కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా రాయితీలు సబ్సిడీలు మాఫీలు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు డి జంగయ్య, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప,సిపిఐ మండల కార్యదర్శి ఎన్ కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.
అనంతరం కీసర నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది మండల అధ్యక్షురాలుగా కోల శోభ. ప్రధాన కార్యదర్శిగా కొండ చిత్తారి ఉపాధ్యక్షులు .వెంకటేష్ యాదవ్, కోశాధికారిగాభరత్ సహాయ కార్యదర్శిగా ఏ అనిల్ కోలా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు 9 మంది కమిటీ సభ్యుల ను ఎన్నుకోవడం జరిగింది. రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: 2025-26 వార్షిక బడ్జెట్‌ను గౌరవ ఆర్థిక మంత్రివర్యులు భట్టి విక్రమార్క శాసనసభలో మొత్తం రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించి,భాగ్యనగరానికి భారీగా కేటాయింపులు చేసినందుకు మాదాపూర్ డివిజన్ పరిధిలోని వార్డ్? కార్యాలయంలో కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రులు (బట్టి విక్రమార్క, దుద్దిల శ్రీధర్ బాబు, .దామోదర రాజనర్సింహ చిత్రపటానికి నియోజకవర్గ నాయలులు,డివిజన్ నాయకులు,కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో రాజధాని నగరం హైదరాబాద్ కు నిధుల వరద కేటాయించడం చాలా హర్షించదగ్గ విషయమని,హైదరాబాద్ రైజింగ్ పేరిట ఇక్కడ ప్రపంచస్థాయి ప్రమాణాలు కల్పించాలని భావిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అదే స్థాయిలో నిధులు కేటాయించిందని తెలిపారు. గ్రేటర్‌లో మౌలిక సదుపాయాల కల్పన,అభివృద్ధిలో కీలకమైన జీహెచ్ఎంసీపై సర్కారు ప్రత్యేక దృష్టి పెట్టి 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి రూ.3,101.21 కోట్లు కేటాయించడం చాలా సంతోషం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మహిపల్ యాదవ్,జీవి రెడ్డి,రాజు,హున్య నాయక్,ప్రసాద్ తన్నీరు,డివిజన్ అధ్యక్షులు నగేష్ నాయక్,బ్రహ్మయ్య యాదవ్,కిట్టు,వెంకట్ రెడ్డి,శ్యామలేట్ కృష్ణ,ప్రభు, సత్తిరెడ్డి, బాబ్జి, శ్యామ్, లోకేష్, కేశవులు, తదితరులు పాల్గొన్నారు..

ఇండియా టీన్స్, ఫ్యాషన్ లీగ్, మిసెస్ ఇండియా బ్యూటీ పీగెంట్ 2025

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: భారత దేశంలో మొట్టమొదటి సారిగా మాతృమూర్తులు మరియు వారి పిల్లలు కలసి ఒకే సారి, ఒకే చోట సంయుక్తంగా జాతీయ ఫ్యాషన్ వేదికపై పాల్గొనడానికి వీలుగా ఇండియా టీన్స్? ఫ్యాషన్ లీగ్ , మిసెస్ ఇండియా బ్యూటీ పీగెంట్ లు భారత దేశంలో ప్యాషన్ పరిశ్రమలో విప్లవం సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి. సమాన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్, విబ్జార్ ఎంటర్ టైన్మెంట్స్?, ఈవెంట్స్? వారి సంయుక్తంగా హైదరాబాదులో నిర్వహిస్తున్నఈ ఫ్యాషన్ ఈవెంట్ ను ఇపుడు దేశ వ్యాప్తంగా విస్తరిస్తూ తద్వారా కుటుంబాలు తమ ఆత్మవిశ్వాసం, శైలి మరియు వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడానికి ఒక అసాధారణ అవకాశాన్ని కలిపిస్తోంది. ఇండియా టీన్స్? ఫ్యాషన్ లీగ్ కేవలం ఒక ఫ్యాషన్ షో కార్యక్రమం కాదు, యువతీ, యువకుల కోసం ఫ్యాషన్ వస్త్రధారణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడం మరియు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించిన పరివర్తన ప్రయాణం. ఇతర సాంప్రదాయ బ్యూటీ పోటీలలాగా కాకుండా ఇండియా టీన్స్? ఫ్యాషన్ లీగ్ ప్యాషన్ ప్రపంచంలో తనదైన గుర్తింపు సాధించాలనుకొంటున్న వారి సృజనాత్మకత, స్వీయ వ్యక్తీకరణ, బహిరంగంగా మాట్లాడే నైపుణ్యాలను పెంపొందించి తద్వారా ఒక సమగ్ర వేదికగా యువతీ, యువకులకు మారుతుంది. ఉర్దూ విశ్వవిద్యాలయం ఆవరణలో ఉన్న సమానా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ లో ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ విడుదల కార్యక్రమం జరిగింది.

పాండుకు సమాచార హక్కు పరిరక్షణ సమితి మద్దతు

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా పోటీచేస్తున్న డీ.ఎల్.పాండు కు మద్దతుగా సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మెన్ డా. బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ ప్రచారం నిర్వహించారు. గురువారం హైదరాబాద్ లోని తెలంగాణ హైకోర్టు ప్రాంగణంలో ఎన్నికల ప్రచారం కు సంభందించిన పోస్టర్ ను డీ. ఎల్ పాండు, పలువురు న్యాయవాధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ డీ.ఎల్. పాండు హైకోర్టు న్యాయవాదిగా ఎన్నో కేసులలో వాధించి పేదలకు న్యాయం చేశారని చెప్పారు. బడుగు బలహీనవర్గాలకు న్యాయం చేసేలా వాదనలు వినిపించారని చెప్పారు. విద్యావంతుడు, సౌమ్యుడు, మానవతా వాది డీ. ఎల్ పాండు ను హైకోర్టు అడ్వకేట్లు అత్యధిక మెజారిటీ తో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీకి అనుబంధంగా వున్న న్యాయవాదులు, హైకోర్టు న్యాయవాదులు డీ.ఎల్ పాండు కు ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది డీ.వీ. శ్రీకాంత్, రాజశేఖర్ నాయక్, మధన్ మోహన్, సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ సభ్యులు మేకల శ్రీహరి, పిట్టల శంకర్, గుండెబోయిన నరేష్ , న్యాయవాదులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాష అభివృద్ధికి కేంద్రం చొరవ తీసుకోవాలని వినతి..

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలుగు రాష్ట్రాల్లో హిందీ భాష అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని హిందీ ప్రచార సభ హైదరాబాద్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఢిల్లీలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్, కేంద్ర విమానయాన శాఖ సహాయ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్,కృష్ణయ్య తదితరులను వేరువేరుగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో హిందీ భాషాభివృద్ధికి గాను పాఠశాల స్థాయి నుంచి హిందీ ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని, కోరారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ లలో ఒక్క పీజీటీ పోస్టు కూడ లేదని, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో హిందీ పోస్టులు లేవని, ఇంటర్మీడియట్, డిగ్రీ , పీజీ కళాశాలల్లో హిందీ అధ్యాపకుల పోస్టులు లేవని, విశ్వవిద్యాలయలలో హిందీ విభాగాలు లేవని గుర్తు చేశారు . దీనిని దృష్టిలో పెట్టుకుని హిందీ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫె సర్ల నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా దక్షిణ భారతదేశంలో హిందీ భాషకు సంబంధించిన ఎలాంటి కార్యక్రమాలు హిందీ ప్రచార సభ హైదరాబాద్ కు అప్పగిస్తే సమర్థవంతంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మే మాసంలో నిర్వహించనున్న హిందీ ప్రచార సభ హైదరా బాద్ 90వ వార్షికోత్సవ వేడుకలకు హాజరుకావాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రులు స్పందిస్తూ హిందీ భాషేతర రాష్ట్రాల్లో 90 ఏళ్లుగా హిందీ ప్రచార సభ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ కావ్డే , కన్వీనర్ శృతికాంత్ భారతి, న్యాయ సలహాదారుడు జె. వెంకట రామ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-దుండి గల్: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి కుమారుడు కోలన్ వెంకట్ రామ్ రెడ్డి వివాహ విందు కార్యక్రమానికి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-దుండిగల్: కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఆశయం మేరకు పలు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఆకాంక్షను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నెరవేర్చిన సందర్భంగా వారి చిత్రపటానికి దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతకింది సురేశ్ అధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి ,మాజీ కౌన్సిలర్ రాము గౌడ్,జిల్లా కిసాన్ సెల్ అద్యక్షులు కర్రోల్ల సదానందం,దుండిగల్ మున్సిపాలిటీ ఓబిసి సెల్ అధ్యక్షులు కుమార్ యాదవ్,అర్కల విజయ్ గౌడ్,పరశురాం గౌడ్,రాహుల్, ధర్మారెడ్డి,చెవిటి శ్రీనివాస్ మరియు దుండిగల్ మున్సిపాలిటీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-మల్కాజిగిరి: మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ కార్యాలయాన్ని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ పి.వి.మురళీ కృష్ణ ప్రారంభించారు. హైదరాబాద్ డివిజన్ డిఆర్ఎం లోకేష్ విష్ణోయ్, ఏడిఆర్ఎం ఎం.ఏ రెహమాన్, చీఫ్ సిగ్నల్ ఇంజనీర్ రాజీవ్ కుమార్ గంగేలే , సీనియర్ డిఎస్ టిఏ నీలా పావని, డిఎస్ టిఏ ఫిర్దాస్ ఖాన్ సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్.ఆర్.యు.సి.సి. సౌత్ సెంట్రల్ రైల్వే సభ్యుడు నూర్,డి.ఆర్. యు.సి.సి. హైదరాబాద్ డివిజన్ సభ్యుడు పి.భరద్వాజ్, పి.వి. మురళీ క ృష?ను శాలువాతో సత్కరించారు. డి.ఆర్.ఎం. హైదరాబాద్ లోకేష్ విషో?య్ జ్ఞాపికను అందజేశారు. చర్లపల్లి నుండి మల్కాజిగిరి మీదుగా 17023/24 తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించాలని, 2861/62 విశాఖపట్నం మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను కర్నూలు నగరం లేదా మంత్రాలయం రోడ్డు వరకు పొడిగించాలని కోరుతూ డి.ఆర్.ఎం. హైదరాబాద్‌కు ఒక మెమోరాండం సమర్పించారు.

నాడు-నేడు పనుల్లో అంతా డొల్లే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వం నాడు-నేడు కింద వైద్యారోగ్య రంగంలో చేపట్టిన పనుల్లో అంతా డొల్లతనమే కనిపిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ప్రచారార్భటమే తప్ప వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వాసుపత్రుల్ని ఆధునీకరించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటని గురువారంనాడు శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. గత పాలకులు అధికారంలో ఉన్నప్పుడు, అధికారంలో లేనప్పుడు రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం ముఖచిత్రాన్ని మార్చానని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. చేపట్టిన పనులను పరిశీలిస్తే నిజానిజాలు తెలిశాయని మంత్రి చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను రూ.1,225 కోట్లతో మరింత మెరుగుపరచాల్సి ఉందని, గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రులను రూ.246 కోట్లతో అభివృద్ధి చేయాలని, కడపలోని క్యాన్సర్ హాస్పిటల్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లతో పాటు పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు రూ.335.27 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల కోసం చేసిన మొత్తం ఖర్చు రూ.8,480 కోట్లు కాగా, గత ప్రభుత్వం చేసిన వాస్తవ ఖర్చు కేవలం 14శాతమేనని తెలిపారు. నందిగామ ఏరియా ఆస్పత్రి స్థానంలోనే వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తామని, నందిగామలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం సాధ్యంకాదని మంత్రి స్పష్టం చేశారు.

విజయవాడ రైల్వే డివిజన్‌కు 'ఆచార్య రఘువీర్ చల్ వైజయంతి' అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): విజయవాడ రైల్వే డివిజన్‌కు 'ఆచార్య రఘువీర్ చల్ వైజయంతి 'అవార్డు దక్కింది. డివిజన్‌లో అధికార హిందీ భాషను అమలు చేయడంలో అసాధారణ కృషి చేసిన ఆచార్య రఘువీర్ చల్ వైజయంతి అవార్డును 'ఆదర్శ మండల్'గా ప్రదానం చేశారు. న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లో గురువారం జరిగిన రైల్వే బోర్డు అధికారిక భాషా అమలు కమిటీ సమావేశంలో డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్... రైల్వే బోర్డు చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీశ్ కుమార్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.

డీఆర్ఎం మాట్లాడుతూ ఈ అవార్డు డివిజన్‌కు గర్వకారణమని, ఇది అధికారిక భాషా అమలుపై అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. డివిజన్ సాధించిన విజయానికి తోడు రాయనపాడు వర్క్‌షాప్ (గుంటుపల్లి) ఆచార్య రఘువీర్ చల్ వైజయంతి అవార్డును 'ఆదర్శ కార్ఖానా'గా అందుకుంది. దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జోన్‌కు ' రైల్ మంత్రి రాజ్‌భాషా' అవార్డు లభించింది. ఇది అధికారిక భాషను ప్రోత్సహించడంలో జోన్ నిబద్ధతను తెలియజేస్తుంది. భారతదేశ సాంస్కృతిక, భాషా పూర్వవైభవాన్ని పునరుజ్జీవింపజేసిన ఆచార్య రఘువీర్ ఒక మహోన్నత వ్యక్తి అని డీఆర్ఎం అన్నారు. అధికారిక భాషా విధానాన్ని అమలు చేయడంలో అవిశ్రాంత కృషి చేసినందుకు ఆర్‌బీఏ, రాజ్‌భాష బృందం ఎం.కె.నాగరాజును డీఆర్ఎం ప్రశంసించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే ఉద్యమం ఉధృతం

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-పెదగంట్యాడ: పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి ఆరోపించారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను విశాఖపట్నం పెదగంట్యాడ తహసీల్దార్‌కు గురువారం అందజేశారు. అనంతరం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినప్పటికి హామీ నిలబెట్టుకోలేదని ఆరోపించారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని తమ పార్టీ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టినట్టు చెప్పారు. నెలలోగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, ఎ.విమల, కె.అచ్యుతరావు, కె.వనజాక్షి, పల్లేటి పోలయ్య, కె.పోతయ్య, సోమేష్, మాధవరావు, మధుసూదన్ రావు, ఎర్రిపిల్లి దానయమ్మ, పెంటమ్మ, దరఖాస్తు దారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు పౌరులు అభ్యర్థించాలి

విశాలాంధ్ర-హైదరాబాద్ : జిహెచ్ఎంసిలో దోమల నివారణకు చేసే ఫాగింగ్ ఇప్పుడు డిజిటలైజ్ చేయబడింది. ఫాగింగ్ జరిగే ప్రాంతాలు, సమయం వృధా కాకుండా సమస్యల ఆధారంగా పరిష్కరించడానికి వీలుగా పౌరులే ఫాగింగ్ కొరకు అభ్యర్థించే విధంగా " మై జిహెచ్ఎంసి"మొబైల్ యాప్ లో ఫాగింగ్ రిక్వెస్ట్ పెట్టేందుకు వీలుగా వెసులు బాటు కల్పించారు. ఎక్కడైతే ప్రధానంగా దోమల బెడద ఉంటుందో అక్కడ ఏ పౌరుడైన మై జిహెచ్ఎంసి యాప్ లాగిన్ చేసి రిక్వెస్ట్ చేయొచ్చు వారి లొకేషన్ మరియు రిక్వెస్ట్ ఆటోమేటిక్ గా ఆఫీసర్ కి చేరుతుంది. ఎంటమాలజిస్ట్ దాన్ని ఫాగింగ్ వర్కర్ కి అసైన్ చేస్తారు. ఫాగింగ్ చేస్తున్న ఫోటో లాటిట్యూడ్ లాంగిట్యూడ్ తో సహా అప్ లోడ్ చేసి పరిష్కారం అయిపోయిందని అప్డేట్ చేస్తారు. జిహెచ్ఎంసిలో ఉన్న ఫాగింగ్ వర్కర్స్ కు తగినన్ని స్లాట్స్ అందుబాటులో ఉంటాయి. ఒకసారి రిక్వెస్ట్ చేసిన తర్వాత 100 మీటర్ల ప్రాంతం వరకు, వారం వరకు ఆ ప్రాంతం నుంచి రిక్వెస్ట్ రాకుండా నిరోధించబడుతుంది. ఈ ఫాగింగ్ ఆన్ రిక్వెస్ట్ ఫీచర్ ని మై జిహెచ్ఎంసి యాప్ లో మొదటగా ప్రయోగాత్మకంగా జూబ్లీహిల్స్ సర్కిల్ లో మొదటగా వాడి ఫలితాలను బట్టి తర్వాత మొత్తం జిహెచ్ఎంసికి విస్తరించనున్నారు.

విట్‌లో 'గూగుల్ డెవ్స్ స్ప్రింట్ 2కే25'

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: విఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో గూగుల్ క్లౌడ్ సహకారంతో 12 గంటలపాటు గూగుల్ డెవ్స్ స్ప్రింట్ 2కే25 హ్యాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం గూగుల్ క్లౌడ్‌లో డిజిటల్ క్యాంపస్ 2.0లో భాగంగా విఐటీ-ఏపీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఇందులో దాదాపు 350 జట్లు నమోదు చేసుకోగా, 160 జట్లు ఎలిమినేషన్ రౌండ్ తర్వాత పాల్గొనేందుకు ఎంపికయ్యాయి. మొదటి మూడు జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన గూగుల్ క్లౌడ్‌లో దక్షిణ ప్రాంతీయ అధిపతి సిద్ధార్థ్ దల్వాడి మాట్లాడుతూ గూగుల్ క్లౌడ్‌లో డిజిటల్ క్యాంపస్ 2.0 ద్వారా హ్యాకథాన్‌లు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లను నిర్వహించడం ద్వారా విద్యార్థులను పరిశ్రమ సవాళ్లకు ఎలా ముందుగానే సిద్ధం చేస్తోందని వివరించారు. వీఐటీ-ఏపీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ... విశ్వవిద్యాలయం ఖ్యాతిని పెంచడంలో అంతర్జాతీయ సహకారాలు, అవగాహన ఒప్పందాల ప్రాముఖ్యతను తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ విద్యార్థులు సమయ నిర్వహణ సవాళ్లకు ఆటోమేషన్ పరిష్కారాలను అన్వేషించాలన్నారు. ఈ హ్యాకథాన్‌లో మొదటి బహుమతిని టీం కుకీలో కత్రినా ఎలంగ్‌బామ్, ప్రాంజల్ కుమార్, రాకేష్ కుమార్ రభా, శౌనక్ చౌదరికి, రెండో బహుమతిని టెక్నికల్ మావ్జ్‌లో తన్మయ్ రాజుర్కర్, ప్రసన్న పాల్, అన్షుల్ హజారే, చిన్మయ్ భట్, మూడో బహుమతిని ఏఐలో రుద్ర నారాయణ సాహూ, స్వయం సృజన్ త్రిపాఠి, ప్రద్యున్ గుప్తా, సార్థక్ గుప్తా జట్లు గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ దీపశిఖ మిశ్రా, సుధాకర్ ఇలంగో (డీన్, స్కోప్), సరోజ్ పాణిగ్రాహి (అసోసియేట్ డీన్, స్కోప్), ఖదీర్ పాషా (డిప్యూటీ డైరెక్టర్, స్టూడెంట్ వెల్ఫేర్), విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలసలు నివారించండి

విశాలాంధ్ర - యు.కొత్తపల్లి: ఉపాధి హామీపై అధికార పార్టీ నాయకుల ప్రమేయాన్ని నివారించాలని, బోగస్ మస్టర్ బిల్లులపై దృష్టి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. యు. కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బీకేఎంయు సభ్యత్వం లో చేర్పించారు. మధు మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి పట్టణాలకు వలస వెళ్తున్నారన్నారు. ఉపాధి హామీ చట్టంను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. వివిధ గ్రామాలలో పనులు దొరక్కపోవడంతో బతుకుదెరువు కోసం అప్పులు చేస్తూ జీవిస్తున్నారన్నారు. అప్పులు తీర్చడానికి పక్క రాష్ట్రాలకు వలస బాట పట్టారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ, వ్యవసాయ కూలీల జీవన పరిస్థితులలో మార్పు రావడం లేదన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించా లన్నారు. రోజు వేతనం రూ.700 ఇవ్వాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. జిల్లాలో నాలుగు నెలల వేతనబకాయిలు చెల్లించాలన్నారు. ఉపాధి హామీలో రాజకీయ జోక్యాన్ని, ముఖ్యంగా అధికార పార్టీ నాయకుల ప్రమేయాన్ని నివారించాలన్నారు. ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాజకీయ కారణాలతో తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిపై కక్ష సాధింపులు, వేధింపులు నివారిం చాలన్నారు. అనేక గ్రామాల్లో బోగస్ మస్టర్లు వేసి బిల్లులు చేసుకోవడం జరుగుతోందని, వాటిని అరికట్టాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ, నక్క శ్రీనివాసరావు, గోవింద్ శ్రీను, సత్యవతి, పద్మ పాల్గొన్నారు.

దివ్యాంగులకు యూనిక్ డిజిబిలిటీ ఐడెంటి కార్డ్స్: డీఆర్వో

విశాలాంధ్ర-హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలో దివ్యాంగుల కోసం జారీ చేసే యూనిక్ డిజిబిలిటీ ఐడెంటి కార్డు(యుడిఐడి) ఏ విధంగా పొందవచ్చునో అనే అంశం మీద వివిధ రకాల దివ్యాంగుల ప్రతినిధులతో జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి వివరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో వివిధ రకాల దివ్యాంగ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశం లో యుడిఐడి కార్డును ఏ విధంగా నమోదు చేసుకోవాలో ఏ విధంగా పొందవచ్చునో వివరంగా దివ్యాంగ ప్రతి నిధులకు వివరించడం జరిగినది. దివ్యాంగ ప్రతినిధులు అడిగిన వివిధ రకాల సంశయాలకు జిల్లా రెవెన్యూ అధికారి చాలా ఓపికగా సమాధానం ఇవ్వడం జరిగినది. ఈ యు.డి.ఐ.డి కార్డు అనేది కొత్తగా ఇస్తున్న కారణంగా దివ్యాంగ మిత్రులకు వచ్చే వివిధ రకాల డౌట్స్ కి ప్రత్యేకంగా కలెక్టర్ కార్యాలయంలో ఒక సెల్ ను ఏర్పాటు చేస్తామని,కార్యాలయ పని దినాలలో కలెక్టర్ కార్యాలయంలో అందుబాటులో ఉంటుందని తెలియజే యడం జరిగింది. యు డి ఐ డి కార్డు అనేది ఎలాంటి అవకతవకలు లేకుండా జారీ చేసే విధంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డిఆర్ఓ తెలిపారు. ఈ కార్డు కోసం అన్ని మీసేవ కార్యాలయాల్లో ఉచితంగా అప్లై చేసుకునే విధంగా సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగినదని కూడా తెలియజేశారు. అంతేకాకుండా జిల్లాలో ఉన్న అధికార యంత్రాంగం అంతా కూడా దివ్యాంగుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధను తీసుకుంటామని డిఆర్ఓ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ సంచాలకులు వికలాంగులు వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ రాజేందర్ సి సెక్షన్ సూపరిండెంట్ సునీత, వివిధ రకాల దివ్యాంగ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి: మౌర్య

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : అన్ని రంగాలలో వెనుకబడిన వడ్డెర జాతి కులస్తులను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎస్టీ జాబితాలో చేర్చాలని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేకంగా వడ్డెర కార్పోరేషన్లు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని భారతీయ వడ్డెర (ఒడిఇ) సమాజ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డా.వెంకటేష్ మౌర్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య కోరారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను పంపడానికి సిద్ధమైందన్నారు. ఆదే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేధికను పంపాలని కోరారు. ఎపి ప్రభుత్వం వడ్డెరుల కోసం ప్రత్యేకంగా ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించిందన్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం కార్పోరేషన్ ను ఏర్పాటు చేసి నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గడిచిన ఎన్నికలకు ముందు ఏఐసిసి నేత రాహుల్ గాంధీ, పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని, కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఒకటిన్నర సంవత్సరం గడిచినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసి ప్రతి ఏడాది జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలన్నారు. వడ్డెరులను విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో అదుకోవాలని కోరారు. రాష్ట్రంలో తమ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కేటాయించాలని, నామినేటేడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సంపంగి ప్రభాకర్, దేరింగుల రూపమహేశ్వరి, కొమ్మరాజుల శేఖర్, బత్తిని రాము, దండుగుల రమేష్, దేరంగుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద కేఫ్ నీలోఫర్ ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: దేశంలో అతిపెద్ద కేఫ్ కేఫ్ నీలోఫర్‌ను హైటెక్ సిటీలోని రాయదుర్గంలో ముఖ్య అతిథి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఏబీఆర్ కేఫ్ అండ్ బేకర్స్? ప్రైవేట్ లిమిటెడ్ తన కేఫ్ నీలోఫర్ బ్రాండ్లో హైదరాబాద్‌లో 9వ అవుట్లెట్ ఇది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌ను టెక్నాలజీ హబ్‌గా మాత్రమే కాకుండా, గ్లోబల్ క్యూజిన్ క్యాపిటల్‌గా కూడా నిలబెట్టాలని సంకల్పించామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 'చాయ్' అంటే హైదరాబాద్ గుర్తుకు వస్తుందన్నారు. హైదరాబాద్‌లో 'నీలోఫర్' కు ప్రత్యేకమైన పేరు ఉందన్నారు. హైదరాబాదీ బిర్యానీ, ఇరానీ చాయ్, అలాగే కేఫ్ నీలోఫర్ కూడా నగర సంప్రదాయ వారసత్వంలో అంతర్భాగం అన్నారు. ఈ కేఫ్ నగరంలో కీలకమైన ఐటీ కారిడార్లో అగ్రశ్రేణి టెక్ కంపెనీల మధ్య ఏర్పాటు చేశారన్నారు. ఇక నేనైతే రోజుకు నాలుగైదు కప్పుల చాయ్ తాగుతాను. చాయ్ అంటే బాగా ఇష్టం. ముఖ్యంగా నీలోఫర్ చాయ్‌కి అలవాటు పడ్డాను, దానికి కారణం బాబూ రావు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు) షబీర్ అలీ మాట్లాడుతూ భారతదేశంలోనే అతిపెద్ద టీ కేఫ్ హైటెక్ సిటీలో ఉండటం ఒక భాగ్యం అన్నారు. నీలోఫర్ చాయ్ దేశవ్యాప్తంగా టీ ప్రేమికుల హృదయాలను గెలుచుకుందన్నారు. కేఫ్ నీలోఫర్ మేనేజింగ్ డైరెక్టర్ అనుముల శశాంక్ మాట్లాడుతూ కేఫ్ నీలోఫర్ 47 ఏళ్ల గొప్ప వారసత్వాన్ని కలిగి ఉందన్నారు. హైటెక్ సిటీలో ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నామన్నారు. గత పదమూడు ఏళ్లుగా సన్నద్ధమవుతున్నామని చెప్పారు. అది ఇప్పటికి నెరవేరిందన్నారు. మొదట బంజారా హిల్స్?, హిమాయత్ నగర్లో ఉన్న కేఫ్ ల అభి వృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. అక్కడే ప్రామాణిక ఇరానీ కేఫ్ అనుభూతిని పరిచయం చేశామ న్నారు. మేము మరింతగా నైపుణ్యం సముపార్జిం చడానికి ఈ కేఫ్ లు పునాదిగా నిలిచాయన్నారు. ఈ కొత్త అవుట్‌లెట్‌లో ప్రధాన ఆకర్షణగా రెండు టన్నుల 'నీలోఫర్ క్యాటిల్ ఆఫ్ లవ్' నిలవ నుందన్నారు. ఈ కేఫ్ చిరస్మరణీయ ప్రయాణాన్ని ఇది ప్రతిబింబిస్తుందని చెప్పారు. సంప్రదాయాన్ని ఆధునిక తతో మిళితం చేస్తుందన్నారు. తాజా, నాణ్యమైన వంట కాలు, విశేషమైన ఆతిథ్యం ప్రధానంగా ఉంటుందన్నారు. టీ, బన్ మస్కా మలై బన్, కునాఫా చీజ్‌కేక్ వంటి క్లాసిక్ ఐటెమ్స్?, మిల్లెట్ ఆధారిత వంటకాలు, రైస్ కాంబోలు, స్థానిక రుచుల సమాహారం కలవన్నారు. ఐటీ హబ్, అభివృద్ధి చెందుతున్న నివాస ప్రాంతాల్లో ఈ కేఫ్ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

జంట కార్పొరేషన్‌లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

విశాలాంధ్ర-మేడిపల్లి: పీర్జాదిగూడ, బోడుప్పల్ జంట మున్సిపల్ కార్పొరేషన్ లలో -ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ బిల్లుపై గురువారం ఉదయం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.
ముఖ్య అతిథులు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి లు హాజరయ్యారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం నుండి మేడిపల్లిలోని చెంగిచెర్ల చౌరస్తా వరకు బోడుప్పల్ మరియు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణలకు చట్టబద్ధత కల్పించిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పార్టీ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, బీసీల హక్కులను రక్షించడం కోసం బీసీ రిజర్వేషన్ల బిల్లు తీసుకువచ్చిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం ద్వారా ఎస్సీ సామాజిక వర్గాలలోని అన్ని ఉపవర్గాలకు న్యాయం జరిగేలా కృషి చేశామని పేర్కొన్నారు. అదనంగా, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మక హామీలను అమలు చేయడంలో ఎప్పుడూ ముందుంటుందని, ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం నిస్వార్థంగా పనిచేస్తుందని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని, భవిష్యత్తులో కూడా పార్టీని అండగా నిలిపేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ల మాజీ మేయర్లు అమర్ సింగ్, తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహ్మ రెడ్డి, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతూర్తి రవి, జంట కార్పొరేషన్ ల మాజీ కార్పొరేటర్లు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జ్ లు, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు

విశాలాంధ్ర-హైదరాబాద్ : మహిళా నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, సాలార్ జంగ్ మ్యూజియం, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, మరియు సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ సంయక్త ఆధ్వర్యంలో ఉచితంగా మహిళలకు ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని అకాడమీ చైర్మన్ ఎం.సి.శేఖర్ వెల్లడించారు. మహిళలు ఫోటోగ్రఫీ నేర్చుకొని, ఉపాధికోసం వృత్తిగా స్వీకరించడానికి ఉత్సాహంగా ఉన్నట్లయితే, వారు ఈ సమగ్ర ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సును పూర్తి చేసిన తర్వాత ఉపాధి పొందవచ్చునని తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించే ఈ ఆరు నెలల (ఆఫ్ లైన్) ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు లో ప్రవేశానికి ఫోటోగ్రఫీ అభిరుచి గలవారు లేదా వృత్తిగా స్వీకరించేవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ హిమాయత్ నగర్ సిగ్మా ఫోటోగ్రఫీ అకాడమీ లో గురువారం మహిళలకు " ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు వాల్ పోస్టర్ ను అకాడమీ చైర్మన్ ఎం.సి.శేఖర్ల తో కలిసి భాష , సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ మహిళలు ఫోటోగ్రఫీ నేర్చుకోవడం పట్ల ఉత్సాహంగా ఉన్నట్లయితే, వారు ఈ సమగ్ర ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సును పూర్తి చేసిన తర్వాత ఉపాధి పొందవచ్చునని తెలిపారు. ప్రాథమిక ఫోటోగ్రఫీ తోపాటు వెడ్డింగ్, ఇండస్ట్రియల్, ఫాషన్, పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలను, అధునాతన సాంకేతికతలు, కంపొజిషన్, లైటింగ్, ఫ్రేమ్మింగ్ లలో కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందని, ఈ ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్స్ ఫోటోగ్రఫీ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో పట్టణ మరియు గ్రామీణ యువతకు సహాయం చేయడమే కాకుండా ఫోటోగ్రాఫర్‌గా ఎదిగి, వృత్తిగా స్వీకరించేవారికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గత నాల్గుగు బ్యాచ్ లలో దాదాపు 1200 మంది కి పైగా యువత విజయవంతంగా ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు అభ్యసిస్తున్నారని అన్నారు. ఈ బ్యాచ్ ప్రత్యేకించి మహిళలకు ఉచితంగా ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు శిక్షణ తరగతులు ఏప్రిల్ 25 నుండి ప్రారంభమౌతాయని, ఆసక్తి కల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నంబర్లలో (8008021075 - 7095692175) ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల లోపు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోగలరని,ఆన్లైన్ లో రిజిస్టర్ చేసుకునే వారు ఇక్కడ ఇచ్చిన లింక్ ద్వారా చేసుకోవచ్చున్నారు.

%https://sapindia.org/diploma-course%/ KsÁT ÔûB 20 %APRIL%, 2025 అని ఎం.సి.శేఖర్ వెల్లడించారు.

రాజీవ్ యువ వికాసం పథకం యువతకు ఆర్థిక భరోసా : సీతక్క

విశాలాంధ్ర - బయ్యారం : రాష్ట్ర ప్రభుత్వం యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగులైన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ వర్గాల యువతకు రూ. 4 లక్షల ఆర్థిక చేయూతను అందిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం మండలంలో అంతర్గత రోడ్లు, బ్రిడ్జిలు, పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, సింగిల్ విండో చైర్మన్ మూల మధుకర్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ అనంతరం మంత్రి మాట్లాడుతూ మండలంలోని లక్ష్మీనరసింహాపురంలో మూడు కోట్లు, కోడిపుంజుల తండాలో రూ. కోటి 50 లక్షలతో రోడ్ల నిర్మాణం, మొట్ల తిమ్మాపురం లో రెండు కోట్ల తో వంతెన నిర్మాణం, కోట గడ్డ లో 4.72 లక్షలతో రోడ్ల విస్తరణ తదితర అభివృద్ధి పనులను ఆమె శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు పట్టణాలు అనే తేడాలు లేకుండా అభివృద్దె ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అందులో గిరిజన గ్రామాల ప్రజలు సౌకర్యార్థం అంతర్గత రోడ్ల నిర్మాణం విద్య, వైద్యం, ఆరోగ్యం, మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు చేయూతను అందించడానికి ప్రతి నియోజకవర్గానికి 3500 పైచిలుకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు సర్వీసులను కల్పిస్తూ,అండగా ఉంటున్నామన్నారు. ఐటిడిఏ పరిధిలోని గిరిజన గ్రామాలలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ద్వారా రైతులు, ప్రజలకు వివిధ సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్

విశాలాంధ్రజూబిలీహిల్స్ : 2025 ఎడిషన్‌లో 30,000 చెట్లు నాటే లక్ష్యాన్ని అధిగమించడా నికి రన్ తర్వాత అద నంగా 100 మొక్కలను నాటే కార్యక్రమాన్ని గురువారం జీవిఆర్ పార్క్‌లో నిర్వహించారు. గ్రాన్యూల్స్ ట్రస్ట్, హార్ట్‌ఫుల్‌నెస్ నిర్వహిస్తున్న రన్ తర్వాత జరిగే మొక్కల నాటే కార్యక్రమానికి యువజన వ్యవహారాలు %ఛ% క్రీడల మంత్రిత్వ శాఖ ఫిట్ ఇండియా మద్దతు ఇస్తోంది, అతుల్ ధవ్లే, గ్రాన్యూల్స్ ఇండియా చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ హరి తోట, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, పల్లవి, ఫారెస్ట్ బై హార్ట్‌ఫుల్ నెస్ జి యచ్ ఆర్ మారథాన్ డైరెక్టర్ రచనా మెహతా హాజరయ్యారు. హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి రామచంద్ర మిషన్ అధ్యక్షులు అయిన పూజ్య దాజీ అన్నారు. ఫారెస్ట్స్ బై హార్ట్‌ఫుల్‌నెస్‌తో మేము ప్రారంభించిన ఈ ప్రయత్నం యొక్క విజయానికి ఆ సమాజాలు ఇస్తున్న మద్దతు కూడా చాలా కీలకం. లక్ష్యంలో 80% కంటే ఎక్కువ ఇప్పటికే సాధించినందున, దానిని 30,000 మొక్కలకు పెంచడానికి మేము ప్రేరణ పొందాము. కలిసి మేము చెట్లను నాటడం మాత్రమే కాదు - తరతరాలుకు అవసరమైన పచ్చని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును కూడా రూపొందిస్తున్నాం అని ఉమా చిగురుపాటి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ అన్నారు.

వైఎఫ్ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: తిరుపతిలో మే 15 నుంచి 18 వరకు జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల లోగోను లెనిన్ బాబు గురువారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో లెనిన్‌బాబు మాట్లాడుతూ తిరుపతిలో జరిగి ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యపైనా, మతం పేరుతో జరుగుతున్న దాడులపైనా పోరాటాలకు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువతను సన్నద్ధం చేస్తామన్నారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు హామీని మోదీ సర్కారు విస్మరించిందని విమర్శించారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం తీసుకువచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహాసభలలో యువతీ యువకులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, బీసన్న, నగర నాయకులు అఖిల్, ఖాసీం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమాభివృద్ధికి ప్రతిపాదన లేదు

నిర్మాతల మండలిలో చర్చిస్తున్నాం: కందుల దుర్గేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖలో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి ఎలాంటి ప్రతిపాదన ప్రస్తుతానికి లేదని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. శాసనమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల ప్పుడు విశాఖపట్నంలో సినీ పరిశ్రమ అభివృద్ధిపై వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్ర బాబు ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. రాష్ట్రంలో షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతుండటంతో మంచి ఆదాయం ఉందన్నారు. నిర్మాతల మండలితో మాట్లాడి స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రీ-రికార్డింగ్, రికార్డింగ్ థియేటర్లను రాష్ట్రంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో పర్యాటకంపై వైసీసీ సభ్యుడు కుంభా రవి బాబు అడిగిన ప్రశ్నకు కందుల దుర్గేశ్ స్పందిస్తూ 'చట్టపరిధిలోకి వచ్చే గిరిజన ప్రాంతాలలో పెట్టుబడులు ఆకర్షించ డానికి, పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నాం' అని అన్నారు. ఆర్థిక జీవనోపాధిని బలోపేతం చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా గిరిజన సమాజంతో కూడిన హోమ్ స్టే, పర్యావరణ పర్యాటక సర్క్యూట్, వెల్నెస్ టూరిజం, సాహస పర్యాటక కార్యకలాపాల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆలయాల నిర్వహణపై భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, తిరుమల నాయుడు అడిగిన ప్రశ్నకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమాధానం చెప్పారు. వ్యక్తులు, ప్రైవేటు సంస్థలు నిర్వహించే దేవాలయాల జాబితాను దేవాదాయ శాఖ నిర్వహించదన్నారు. గత ప్రభుత్వం సర్వశ్రేయోనిధి నుంచి 88 ప్రైవేటు ఆలయాల సీజీఎఫ్ కమిటీ ఇచ్చిన మంజూర్ల ప్రకారం రూ.27.59 కోట్ల ప్రజల సొమ్మును ఇష్టారీతిన ఖర్చు చేసిందన్నారు. అర్హతగల ప్రతి పేదవారికీ పక్కా గృహం అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వైసీపీ ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, కాంట్రాక్టర్ ఇసాక్ బాషా అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ, ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్... రాష్ట్రంలో అమలవుతున్నా యన్నారు. పేదలకు పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలనే చిత్తశుద్ధితో 2026 మార్చిలోగా 7లక్షల30 వేల ఇళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. అవసరమైన చోట ఔట్ సోర్సింగ్ సేవలు వినియోగించుకుంటామని మంత్రి చెప్పారు. ఇక పెండింగ్ గృహాలు పూర్తి చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలు 5.8 లక్షల మందికి అదనపు ఆర్థిక సాయం అందించాలని యోచిస్తున్నామన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. లబ్ధిదారులకు ఆమోదయోగ్యంగా ఉండే లే-అవుట్లలో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. నూతనంగా పీఎంఏవై 2.0 మొదలైందని, ఇప్పటికే లబ్ధిదారులను గుర్తించడం ప్రారంభించామని, 53 వేల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. వైసీపీ ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, దువ్వాడ శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డి అడిగిన ప్రశ్నకు రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమాధానం చెబుతూ... 2024, మార్చి వరకు ఫిషింగ్ హార్బర్లపై ఖర్చు చేసింది రూ.970.56 కోట్లు కాగా, భౌతిక పురోగతి కింద ఇచ్చామని తెలిపారు. భూ సమస్యలు పరిష్కారాలు, మౌలిక సదుపాయాలపై నిర్ణయం ఖరారైన తరువాత భౌతిక పనులను ప్రారంభిస్తామన్నారు. క్రీడా పాఠశాలలపై పర్చూరి అశోక్‌బాబు అడిగిన ప్రశ్నకు రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బదులిస్తూ... వైఎస్ఆర్ క్రీడా పాఠశాల కడపలో ఉందని, 2006లో దీనిని స్థాపించినట్లు తెలిపారు. 2024-29కి ఆంధ్రప్రదేశ్ క్రీడా విధానాన్ని కూటమి ప్రభుత్వం ఇటీవల ఆమోదించిందని, ప్రతి మూడు జిల్లాలకు దశల వారీగా క్రీడా పాఠశాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల రుణాలపై తూమాటి మాధవరావు, పండుల రవీంద్రబాబు, లేళ్ల అప్పిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బదులిచ్చారు. శ్వేతపత్రంలో ప్రచురించిన 2024 జూన్ 12 నాటికి ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల మొత్తం రుణాలు, బాధ్యతలు రూ.9,74,556 కోట్లని వివరించారు. 12 జూన్ 2024 నుంచి 31 డిసెంబర్, 2024 వరకు పెరిగిన నికర ప్రజా రుణం రూ.44,184.96 కోట్లుగా తెలిపారు. ప్రభుత్వ రుణాలు మూలధనం, వడ్డీ చెల్లింపులతో సహా ద్రవ్య లోటును పూరించడానికి ఉపయోగపడతాయని, ప్రభుత్వ రంగ సంస్థల రుణాలు రెవెన్యూ, మూలధన వ్యయాల కోసం దోహదమవుతాయని చెప్పారు. అనంతరం మండలిలో ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక ప్రతిని హోం మంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆపై శాసనమండలిని నిరవధిక వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

స్పీకర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే తాటిపర్తి ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి: తమ పార్టీ ఎమ్మెల్యేలను ఉద్దేశించి శాసనసభలో స్పీకర్ చేసిన వ్యాఖ్యలపై వైసీపీ ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ గురువారం స్పందించారు. 'మేమేమీ గోడలు దూకి అర్ధరాత్రులు, అపరాత్రుల్లో అసెంబ్లీకి వచ్చి సంతకం పెట్టడం లేదు. మా నియోజకవర్గాల సమస్యలను ప్రశ్నల రూపంలో సభ ముందుకు తీసుకొచ్చే క్రమంలో అసెంబ్లీ సిబ్బంది సూచన మేరకు హాలు బయట, అందరి సమక్షంలో ఉండే రిజిస్టర్‌లో, అందరి ముందే సంతకం పెట్టాం తప్ప, అందుకోసం దొంగల్లా రాలేదు. ఎవరూ చూడకుండా సంతకం చేయలేదు. మేమేమీ దొంగలం కాదు, అలా వ్యవహరించడానికి!' అని పేర్కొన్నారు. అయినా స్పీకర్ పదవిని మేము గౌరవిస్తామని, ఆయన ఎలా మాట్లాడినా, ఎన్ని విమర్శలు చేసినా సరే... వాటన్నింటినీ ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని స్పష్టం చేశారు.

పెట్టుబడుల యుద్ధం

అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదంతో వేడెక్కిన మండలి

దావోస్ పర్యటనలపైనా విమర్శల దాడి

మంత్రి పయ్యావుల వర్సెస్ బొత్స

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు, నూతన పరిశ్రమల స్థాపన, ఒప్పందాలపై శాసన మండలి ప్రశ్నోత్తరాల్లో గురువారం అధికార కూటమి, వైసీపీ సభ్యుల మధ్య మాటల తూటాలు పేలాయి. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్- ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య వాగ్వాదం జరిగింది. ఎవరికి వారు.. తమ ప్రభుత్వంలోనే పరిశ్రమలు వచ్చాయని వాదించారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన ఖర్చులు, గత ప్రభుత్వ హయాంలో అప్పులపై కూటమి-వైసీపీ సభ్యుల పరస్పర విమర్శ

లు, ఎదురు దాడులతో మండలి వేడెక్కింది. తొలుత వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, పండుగల రవీంద్రబాబు, కవురు శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు మంత్రి పయ్యావుల కేశవ్ బదులివ్వగా... దానికి సంతృప్తి చెందని వైసీపీ సభ్యులు ఎదురు దాడికి దిగారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చాయని... పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన జరిగిందని చెప్పుకోగా... దాన్ని కూటమి మంత్రులు, ఎమ్మెల్సీలు తిప్పికొట్టారు. దానిపై ప్రభుత్వం తరపున మంత్రి లోకేశ్ ఒకసారి బదులివ్వాల్సి వచ్చింది. ఈ వ్యవహారంలో అధికార కూటమి, ప్రతిపక్ష సభ్యులు పరస్పరం రన్నింగ్ కామెంట్లు చేసుకోవడంతో మండలి వేడెక్కింది. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలను పూర్తిగా నీరుగార్చిందన్నారు. ఒక్క ఫోన్ కాల్‌తో అమర్‌రాజా కంపెనీని పక్క రాష్ట్రానికి పారిపోయేలా చేసిందని మండిపడ్డారు. కనీసం అండర్‌వేర్ కంపెనీని కూడా వదలలేదన్నారు. మా విధానం ఒక్కటేనని, పరిశ్రమల స్థాపనకు ఎవరొచ్చినా ఆహ్వానిస్తామని... వైసీపీ సభ్యులు, వారి మిత్రులూ వచ్చినా స్వాగతిస్తామని చెప్పారు. పెద్దఎత్తున పరిశ్రమల్ని నెలకొల్పి, రాబోయే రోజుల్లో ఉద్యోగ కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) అనేది పెట్టుబడి సంబంధిత అవగాహన ఒప్పందాలపై సంతకం చేయడానికి వేదిక కాదని వివరించారు. గత ప్రభుత్వం కంటే... ఈసారి దావోస్ పర్యటనలో అధికంగా పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. దానిపై ప్రతిపక్ష నేత బొత్స మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లో ఒక కంపెనీ ఇతర రాష్ట్రాలకు ఎందుకు పారిపోయిందో చెప్పాలంటూ నిలదీశారు. ఎవరికి వారు తమ ప్రభుత్వ హయాంలోనే పెట్టుబడులకు పెద్దఎత్తున ఎంఓయూలు వచ్చాయని చెప్పుకొచ్చారు. నూతన పరిశ్రమల స్థాపనపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మౌలిక సౌకర్యాల కల్పన జరిగితేనే అనేక పరిశ్రమలు వస్తాయన్న లక్ష్యంతో నాడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, కరోనా సమయంలోను కొత్త పరిశ్రమలు తెచ్చారని వివరించారు. రాష్ట్రంలో పేదరికం నిర్మూలన జరగాలంటే కొత్త పరిశ్రమలు తెచ్చేందుకు కృషి చేయాలని, పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన వారికి కూడా ఉద్యోగవకాశాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, పీ4 పాలసీతో ఎంత మందిని పారిశ్రామిక వేత్తలుగా మార్చారని, ఎస్సీ,ఎస్టీలకు పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌ను ఎప్పుడు విడుదల చేస్తారంటూ ప్రశ్నించారు. దీనిపై పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమాధానమిస్తూ... 2014-19 వరకు 4వేల కోట్లు ఇన్సెంటివ్ ఇవ్వగా, 2019-2024 కాలంలో కేవలం రెండువేల కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో టెక్స్‌టైల్స్ పాలసీకి మార్గదర్శకాలూ రూపొందించలేదని, అశోక్ లైలాండ్ పారిపోయిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అశోక్ లైలాండ్‌ను రీస్టార్ట్ చేశామని తెలిపారు. పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను గత ప్రభుత్వంతో పోలిస్తే..ఎక్కువగా చేస్తున్నామని, 2019-24 మధ్య ఈశాఖపై పూర్తిగా నిర్లక్ష్యం చూపారన్నారు.

క్యూబాలో ఐజేయు అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. క్యూబా రాజధాని హవానాలోని హవానా విశ్వవిద్యాలయంలో 'కాగ్నిటివ్ వార్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ నెట్‌వర్క్స్, విద్య, మీడియాపై ప్రజల్లో అవగాహన పెంచడం'పై నిర్వహించిన నాల్గవ అంతర్జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సదస్సును క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కానెల్ ప్రారంభించారు. భారత ప్రతినిధిగా శ్రీనివాస్ రెడ్డి వెళ్లారు. ఐదు రోజులుగా జరుగుతున్న ఈ సదస్సుకు వివిధ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. సదస్సులో భాగంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. 'తప్పుడు సమాచారం, మీడియాలో మార్పులు ఎదుర్కోవడం' అంశంపై ఓ పత్రాన్ని సమర్పించారు. ప్రేక్షకుల మన్ననలు పొందారు.

ఉగాదికి 'జీరో పావర్టీ-పీ4'

సన్నాహాలు, పౌర భాగస్వామ్యంపై సీఎం సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉగాది పండుగను పురస్కరించుకొని ఈనెల 30న జీరో పావర్టీ-పీ4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్‌షిప్) కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఇదే క్రమంలో సన్నాహకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సమీక్షించారు. జీరో పావర్టీ-పీ4 సర్వే, సంప్రదింపుల పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. పౌరుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జీరో పావర్టీ-పీ4 వంటి పరివర్తన విధానాలను రూపొందించేటప్పుడు సంప్రదింపులు, పారదర్శకత ప్రాధానమని ముఖ్యమంత్రి అన్నారు. పీ4 సంప్రదింపులలో పాల్గొని తమ విలువైన సూచనలు, అభిప్రాయాలను అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం నడవడానికి బాధ్యతాయుతమైన సొసైటీని ఏర్పాటు చేయడం గురించి ప్రభుత్వ వ్యూహాన్ని వివరించారు. పీ4 సొసైటీని రాష్ట్రవ్యాప్తంగా అనుబంధ చాప్టర్లతో, ప్రైవేట్ రంగ క్రియాశీల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జీరో పావర్టీ-పీ4 ప్రారంభోత్సవానికి సమగ్ర సన్నాహాలు, పౌర భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు.

తోటపల్లి ఆధునికీకరణపై కొత్త అంచనాలు: మంత్రి నిమ్మల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉత్తరాంధ్రలోని తోటపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణ పనులను పునః పరిశీలన చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అసెంబ్లీ లో గురువారం ఆ ప్రాంతం ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ.. పాలకొండ, రాజాం, కురుపాం నియోజకవర్గాలకు నీరందించే ఆశయంతో నాగావళి నదిపై తోటపల్లి వద్ద 1908లో ఈ ప్రాజెక్టును నిర్మించారన్నారు. శతాబ్ద కాలం గడిచిపోయినందున ముఖ్య నిర్మాణాలు, అనుబంధ కాలువలు శిథిలావస్థకు చేరాయన్నారు. 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తోటపల్లి కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులకు రూ. 195 కోట్లు కేటాయించి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించగా, రూ 41.66 కోట్ల విలువైన 22 శాతం పనులు పూర్తి చేసినట్లు నిమ్మల స్పష్టం చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం 25 శాతం లోపు ఉన్న పనులను ఎక్కడివి అక్కడే ఆపేయడం, రద్దు చేయడం వంటి దుశ్చర్యల్లో భాగంగా తోటపల్లి ఆధునీకరణ పనులు కూడా ఆగిపోయాయన్నారు. గతంలో ఈ పనులు చేసిన కాంట్రాక్టర్ కూడా తిరిగి చేపట్టేందుకు సిద్ధంగా లేడన్నారు. సభ్యుల కోరిక మేరకు తోటపల్లి కుడి, ఎడమ కాలువల ఆవశ్యకతను, ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకుని కొత్త రేట్ల ప్రకారం అంచనాలు వేయించి పునః పరిశీలన చేస్తామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా హిరమండలం గొట్టా గ్రామం వద్ద వంశధార నదిపై నిర్మించిన గొట్ట బ్యారేజ్ అనుబంధ కాలువల ఆధునికీకరణ పనులను గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు. ఈ ప్రాజెక్టు ఆధునీకరణకు రూ. 16 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించి పరిపాలనామోదం కోసం చూస్తున్నామని మంత్రి తెలిపారు. పోలవరం బనకచర్ల డీపీఆర్ తయారీ సందర్భంలో సభ్యుడు ప్రతిపాటి పుల్లారావు సూచనలు పరిగణలో తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సాగర్ ఆయకట్టులో కాలువల పూడిక తీత, కలుపు తొలగింపు తదితర పనులు కూడా ఓ అండ్ ఎం పనుల్లో భాగంగా చేస్తామని సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు.

28న 'చలో దిల్లీ' విజయవంతం చేయండి: పుప్పాల

విశాలాంధ్ర-పెదకాకాని: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఆలిండియా భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) పిలుపుమేరకు ఈ నెల 28న దిల్లీలో జరిగే ధర్నాలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండల భవన నిర్మాణ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ... పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం-1996ను అమలులో వివిధ లోపాలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించి కార్మికులకు తీవ్ర నష్టం కలిగించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తామని, ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లైమ్‌లకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇంతవరకు సమస్యల పరిష్కారం కోసం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటని అన్నారు. చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు కార్మిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు ప్రభుత్వాలు అమలు చేయాలని, ప్రభుత్వ, ఇతర ప్రైవేట్ నిర్మాణ రంగ సంస్థల నుంచి రెండు శాతం సెస్సు వసూలు చేయడానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సంక్షేమ బోర్డు నిధులను కార్మిక ప్రయోజనాలకు మాత్రమే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొట్టు శ్రీనివాసరావు, ఒగ్గు కోటేశ్వరరావు, దానబోయిన సాంబశివరావు, ఆత్మకూరి రామ్మూర్తి, కట్టెబోయిన శ్రీనివాసరావు, సైకిల్ సురేష్, పమిడిమల్ల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అత్మగౌరవం కోసమే వైసీపీకి గుడ్‌బై

త్వరలో టీడీపీలోకి మర్రి రాజశేఖర్

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నిస్వార్థంగా పనిచేసినా సముచిత గౌరవం, గుర్తింపు దక్కలేదు కాబట్టే ఆత్మగౌరవం కోసం వైసీపీని వీడుతున్నట్లు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తెలిపారు. త్వరలో టీడీపీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చేసిన మోసం వల్లే ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నటు గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజశేఖర్ ప్రకటించారు. 2011 నుంచి 14ఏళ్లు వైసీపీలో ఉండి, ఉమ్మడి గుంటూరు జిల్లాలో పార్టీ బలోపేతానికి పనిచేసినట్లు చెప్పారు. 2019లో అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ, మంత్రి పదవి ఇస్తానన్న జగన్ మాట తప్పారని, వేరొకరికి పదవి కట్టబెట్టారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే ప్రతిసారీ మర్రి రాజశేఖర్‌కు పదవి ఇస్తామంటూ మోసం చేశారని అసహనం వ్యక్తంచేశారు. 2019 ఎన్నికలకు ముందు చిలకలూరిపేటలో గెలిస్తే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రిని చేస్తానని చెప్పి... అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని రాజశేఖర్ చెప్పారు. '2024 ఎన్నికలప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను పరిగణించకుండా, వేరొకరిని ఎంపిక చేసి, వారి విజయం కోసం పనిచేయమన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు అలాగే శ్రమించాను. అయితే పార్టీ ఓడిపోయింది. ఆపై తాడేపల్లికి పిలిచి చిలకలూరిపేట నియోజకవర్గ బాధ్యతలు తీసుకోమంటే అంగీకరించాను. దసరాకు ఇన్‌చార్జిగా ప్రకటిస్తామని చెప్పారు. కానీ 53 వేల ఓట్లతో గుంటూరులో ఓడిన వారికి ఇన్‌చార్జి పదవి కట్టబెట్టారు' అని రాజశేఖర్ అన్నారు. ఎమ్మెల్సీగా రాజీనామా చేశాకే, వైసీపీకి గుడ్‌బై చెబుతున్నానని అని తెలిపారు. తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినందుకు జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మగౌరవం కోసమే వైసీపీ వీడి... టీడీపీలోకి వెళుతున్నట్లు చెప్పారు.

అసెంబ్లీలో ఐదు కమిటీల ఏర్పాటు

సభాపతి ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అసెంబ్లీలో ఐదు కమిటీల ఏర్పాటుకు సభాపతి అయ్యన్నపాత్రుడు ఆమోదం తెలిపారు. ప్రతి కమిటీలో చైర్మన్‌తోపాటు ఆరుగురు సభ్యులతో కలిపి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉంటారు. అయ్యన్నపాత్రుడు చైర్మన్‌గా నిబంధనల కమిటి (రూల్స్ కమిటీ) ఏర్పాటైంది. ఇందులో అమర్నాథ్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ధర్మరాజు, గద్దె రామ్మోహన్, కళా వెంకట్రావు, సుజనా చౌదరి సభ్యులుగా ఉంటారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు చైర్మన్‌గా ఏర్పాటైన వినతుల కమిటి (పిటిషన్స్ కమిటీ)లో గంటా శ్రీనివాసరావు, గురజాల జగన్‌మోహన్‌రావు, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ నేతృత్వంలో సభా హక్కుల కమిటీ (ప్రివిలేజస్ కమిటీ)లో అదితి విజయలక్ష్మి, గజపతిరాజు పూసపాటి, బండారు సత్యానందరావు, బుగ్గల దస్తగిరి, పి.ధర్మరాజు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మామిడి గోవిందరావు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ చైర్మన్‌గా ప్రభుత్వ హామీల కమిటీ (అస్యూరెన్స్ కమిటీ)లో అమిలినేని సురేంద్రబాబు, దామచర్ల జనార్దన్, గిడ్డి సత్యనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నంద్యాల వరదరాజులరెడ్డి, కె.ఎస్.ఎన్.రాజు, సీనియర్ నేత మండలి బుద్ధప్రసాద్ చైర్మన్‌గా నైతిక విలువల కమిటీ (ఎథిక్స్ కమిటీ)లో బత్తుల బలరామకృష్ణ, భాష్యం ప్రవీణ్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జ్యోతుల నెహ్రూ, కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరావు సభ్యులుగా ఉంటారు.

సూపర్ సిక్స్‌పై కాలక్షేపం

శాసన మండలిలో ప్రజా సమస్యలపై పోరాటం: బొత్స

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సూపర్ సిక్స్‌కు నిధులు కేటాయించకుండా ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. మీడియా పాయింట్ వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించి పరిష్కారానికి ప్రయత్నం చేశామని చెప్పారు. ప్రభుత్వం మార్షల్స్‌ను తెచ్చి తమను సభ నుంచి బయటికి పంపించేందుకు చూసిందని ఆరోపించారు. 'ఓటేశారు... మేం గెలిచాం... ఇక దోచుకుంటే సరిపోతుందనే భావనలో ప్రభుత్వం ఉందని' ఆయన విమర్శించారు. ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్లు బొత్స చెప్పారు. రాబోయే రోజుల్లోనైనా ప్రజలకు మంచి చేస్తారని మేం ఆశిస్తున్నామని, ప్రజల ఆకాంక్షకు తగ్గట్టుగా ప్రభుత్వం వ్యవహరించడం లేదన్నారు. నాడు ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన వారిపై టీడీపీ కేసులు పెట్టిందనీ, ఆ కేసులను ఎత్తేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనని ఆయన గుర్తుచేశారు.

అన్ని కులాల వారికి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఎస్సీ వర్గీకరణ ఏక కమిషన్ రిపోర్టుపై చర్చ లేకుండా ప్రకటన ఇచ్చారన్నారు. అసలు వర్గీకరణ ఎలా చేశారు, ఏ విధంగా చేశారో కనీస చర్చలేదని చెప్పారు. జగన్ అన్ని కులాలను గౌరవించారని, పదవుల్లోనూ అందరికీ న్యాయం చేశారని వివరించారు. డాక్టర్ అంబేద్కర్ స్మృతివనం పెడితే ఈ ప్రభుత్వానికి కన్ను కుట్టిందన్నారు. అట్టడుగు వర్గాల వారికి గౌరవం ఇవ్వడం ఈ ప్రభుత్వానికి నచ్చదని మండిపడ్డారు. అట్టడుగు వర్గాలపై ఈ ప్రభుత్వానికి ప్రత్యేకమైన ద్వేషమని, ఈ తీరును మేం తప్పుపడుతున్నామని చెప్పారు. అధికార పార్టీ సభ్యులు రోజూ చెప్పిందే చెబుతున్నారనీ, రోజూ ఆవు కథ చెబితే ఎలా అంటూ బొత్స ఎద్దేవా చేశారు.

క్లస్టర్ విధానంతో రెవెన్యూ సేవలకు ఇబ్బందులు

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల పేరుతో సుమారు 6 నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా చేయడం వల్ల భవిష్యత్తులో రెవెన్యూ సేవలకు అంతరాయం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు తెలిపారు. మంగళగిరిలోని రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోదియాను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ఇతర నాయకులు కలిశారు. ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామ సచివాలయాల వ్యవస్థలో రేషనైలేజేషన్‌కు సంబంధించి కొనసాగుతున్న పరిణామాలపై చర్చించారు. దీంతో రేషనైలేజేషన్ సంబంధించిన ఫైలు తమ వద్దకు వచ్చినప్పుడు ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తానని సిసోదియా సంఘం నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాచకొండ శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏజర్ల ప్రభాకర్, విజయవాడ డివిజన్ అధ్యక్షులు బాజీ, నందిగామ డివిజన్ ప్రెసిడెంట్ లీలా ప్రసాద్; జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌పై హమాస్ ప్రతీకార దాడి

టెల్‌అవీవ్: గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులకు ప్రతీకారంగా హమాస్ ఆ దేశంపై రాకెట్లతో దాడి చేసింది. సెంట్రల్ ఇజ్రాయిల్‌పైకి మూడు ప్రొజెక్టైల్స్‌తో హమాస్ దాడి చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం వెల్లడించింది. ఒక రాకెట్‌ను ధ్వంసం చేయగా, మిగతా రెండు ఖాళీ స్థలాల్లో పడ్డాయని, ప్రాణ నష్టం జరగలేదని తెలిపింది. మరోవైపు జియోనిస్ట్ మారణహోమానికి ప్రతిస్పందనగా ఇజ్రాయిల్‌పై దాడి చేసినట్లు హమాస్ సాయుధ విభాగం అల్ ఖసమ్ బ్రిగేడ్స్ ధ్రువీకరించింది. టెల్ అవీవ్‌లోని ఆక్రమిత భూభాగాల్లో ఎం 90 రాకెట్ల బారేజ్‌తో దాడి చేసినట్లు వెల్లడించింది. కాగా, కాల్పుల విరమణ తర్వాత హమాస్ దాడి చేయడం ఇదే మొదటిసారి. ఇజ్రాయిల్ మరోవైపు మంగళవారం నుంచి గాజాలో రక్తపాతం సృష్టిస్తున్న విషయం విదితమే.

గంజాయి ద్వారా సంపాదించిన ఆస్తుల జప్తు

విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: విశాఖపట్నం రేంజ్ పరిధిలో గడిచిన 8 నెలల్లో గంజాయి నిర్మూలనకు అనేక చర్యలు చేపట్టామని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. ఈ దిశగా పోలీస్ శాఖలో సమూల మార్పులు తీసుకు వచ్చామన్నారు. గంజాయి విక్రయం ద్వారా సంపాదించిన అక్రమ ఆస్తుల ను జప్తు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. యువత మత్తుకు బానిసలై అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. శ్రీకాకుళం, విజయనగరం,పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసులు 226 గంజాయి కేసులలో స్వాధీనం చేసుకున్న 7378 కేజీల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యం లోశ్రీకాకుళం జిల్లా, లావేరు మండలం, పాత కుంకాము గ్రామం పరిధిలో ఉన్న రైన్ బో ఇండస్ట్రీ వద్ద ధ్వంసం చేశారు. రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, విజయనగరం జిల్లా ఎస్పీ వకల్ జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సంధర్బంగా గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ గడిచిన 8 నెలల కాలంలో గంజాయి నిర్మూలన చర్యలలో భాగంగా 524 కేసులలో 31768 కేజీల గంజాయి, 12.05 లీటర్ల హాషిష్ ఆయిల్, 372 వాహనాలు సీజ్ చేసి 2050 మంది నింతుల్ని అరెస్టు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఒడిశా సరిహద్దు వెంబడి చెక్ పోస్టు లు ఏర్పాటు చేసి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాలకు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకిత సూరన, విజయనగరం జిల్లా ఏఎస్పీ సౌమ్యలత, శ్రీకాకుళం ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, డిఎస్పీలు,ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వడగాడ్పులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఉపశమనం పొందేందుకు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించారు. రాబోయే మూడు మాసాల్లో ఉష్ణోగ్రతలు, వడగాల్పుల సన్నద్ధతపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో ఆయన వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 40 నుంచి 42 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున రాబోయే మూడు మాసాలు ఎండ వేడిమి, వడగాల్పుల నుంచి కాపాడుకునేందుకు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ప్రజల్లో తగిన అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సహా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ఉపాధి కూలీలకు పనిచేసే చోట్ల తాగునీరు, మజ్జిగ, టెంట్లు, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. జిలా స్థాయిలో వివిధ శాఖలను సమన్వయం చేసేందుకు వీలుగా ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్ర విత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ఆర్ కూర్మనాథ్... మంగళవారం 42.7 సెంటీగ్రేడ్, బుధవారం 42.3 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని వివరించారు.

అలరించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాలు

క్రీడా విజేతలకు సీఎం చంద్రబాబు బహుమతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాలు గురువారం రాత్రి ఉత్సాహంగా ముగిశాయి. ఏపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల ముగింపు రోజు జరిగిన ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వివిధ శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సాంస్కృతి కార్యక్రమాల్లో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు దుర్యోధనుడి వేషదారణ ఆలరించింది. ఆయన డైలాగ్‌లకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, చంద్రబాబు, పవన్, లోకేశ్ తదితరులు తమ స్థానాల్లో నుంచి లేచి చప్పట్లు కొట్టారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరావు హాస్యనటన ఆకట్టుకుంది. పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్... పల్నాటి బాలచంద్రుడి వేషధారణలో అలరించారు. ఆయన ప్రదర్శనకూ సభలో చప్పట్లు మారుమోగాయి. ఏపీ లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్ -2025లో భాగంగా క్రికెట్, బాడ్మింటన్, అథ్లెటిక్స్, వాలీబాల్, కారమ్స్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, మ్యూజికల్ చైర్స్, త్రోబాల్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు సీఎం చంద్రబాబు తదితరులు బహుమతులు అందజేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.